తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha

epaper.vaartha.com    WWW.VAARTHA.COM

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-2-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 8 పేజీలు: 8+16 వెల: 8.00



సమీక్ష — నేటి నాయకత్వానికి విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ బహుమానం

ఈరోడ్ ఉప ఎన్నికలో డిఎంకె గెలుపు

5లో




# ఢిల్లీకి 'డబులింజన్'

## హస్తినలో మళ్లీ విరిసిన కమలం

| బిజెపి | ఆప్ | కాంగ్రెస్ |
|---|---|---|
| 48 | 22 | 0 |

### 28 యేళ్ల తర్వాత ఢిల్లీ పగ్గాలు చేపడుతున్న బిజెపి

### కేజ్రీవాల్, సిసోడియా సహా ఓటమిపాలైన ఆప్ దిగ్గజాలు

### ఓటర్లపై ఎక్కువ ప్రభావం చూపిన లిక్కర్ స్కాం

### బిజెపి పంచిన 'ఉచిత హామీల'తో అందలం అందించిన మహిళా ఓటర్లు

### కేంద్రం, ఢిల్లీలో ఒకే ప్రభుత్వంతో అభివృద్ధి తారస్థాయికి చేరుతుందన్న బిజెపి నేతలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించింది. దాదాపు 28 ఏళ్ల తర్వాత ఎర్రకోటపై బిజెపి జెండా ఎగిరింది. మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాల్లో గెలిచి మెజార్టీమార్కును సైతం దాటి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీకి కేవలం 22 స్థానాలు మాత్రమే దక్కాయి. ఇక పోతే శతాధికవర్షపార్టీ కాంగ్రెస్‌కు ఈసారి కూడా చుక్కెదురయింది. ఢిల్లీ ప్రజలు ఒక్కనియోజకవర్గంలో కూడా ఆదరించలేదు. మూడోసారి జరిగిన ఎన్నికల్లో కూడా ఆపార్టీ జీరోస్థానానికే పడిపోయింది. ఆపార్టీ ఉనికే లేకుండాపోయిందని చెప్పవచ్చు. ప్రధానిమోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా అనుసరించిన వ్యూహాలతో బిజెపికి ప్రజలు పట్టం కట్టారు. 40 లక్షల ఓట్లు కలిగిన పూర్వాంచల్ ఓటర్లుకూడా 20 నియోజకవర్గాల్లో మోడీకే మొగ్గు చూపించారు. అందుకు అనుగుణంగా బీహార్, యూపిలకు చెందిన వారే ఎక్కువ ఉండటంతో ఆరాష్ట్రాల అగ్రనేతలను కూడా ప్రచారంలోకిదించి ఓటర్లను ఆకర్షించారు. అన్నింటికంటే >>2

## ఢిల్లీ సెక్రటేరియట్ సీజ్

### - ఎల్‌జి ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ పరాజయం వేళ అనూహ్యపరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ సచివాలయాన్ని సీజ్‌చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా కీలకనిర్ణయం ప్రకటించారు. ముందస్తు అనుమతి లేకుండా ఫైళ్లు రికార్డులను తొలగించవద్దని అన్నివిభాగాలకు ఆదేశాలు జారీచేసారు. ఆయన సూచనల >>2

## ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం

### -ఓటమిపై మాజీ సిఎం కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఎన్నికల్లోప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తున్నామని ఢిల్లీమాజీ సిఎం అరవింద్‌కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదని ఇక నిర్మాణాత్మక ప్రతిపక్షంగా బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సేవలందిస్తుందని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ ప్రజలతీర్పును శిరసావహించాల్సిందేనని అన్నారు. భారీ మెజార్టీతో విజయం సాధించడంపట్ల >>2

## అసెంబ్లీ తొలిసభలోనే కాగ్ నివేదిక ఇస్తాం

### బిజెపి వేడుకల్లో ప్రధాని మోడీ

### అవినీతి పాలనకు ఇక విముక్తి

### రాజధాని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా

### ఆప్ చేతిలోనే యమున కలుషితం: ప్రధాని

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీప్రజలు దశాబ్దకాలం పాటు సాగిన అవినీతిపాలనకు విముక్తి కల్పించారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. యమునామాయీకిజై అన్న నినాదంతో ప్రధాని బిజెపి కార్యాలయంలో పెద్ద ఎత్తున జరిగిన వేడుకల్లో పాల్గొని అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. ఢిల్లీప్రజలు ఇపుడు ఎంతో ఉపశమనంతో ఉల్లాసంగా ఉన్నారన్నారు. 21వ శతాబ్దంలో ఢిల్లీ ప్రజలు తమకు సేవచేసుకునే భాగ్యం కల్పించారని, ఆవిధంగానే తాను ఢిల్లీ వాసులందరికీ లేఖరాసా >>2


ఢిల్లీ సిఎం రేసులో పర్వేష్‌సింగ్ వర్మ

కుంభకోణాలు, నాయకత్వ లేమితోనే ఓటమి: అన్నాహజారే

2లో




శనివారం న్యూఢిల్లీలోని బిజెపి కార్యాలయం వద్ద కార్యకర్తల విజయోత్సవ హేల

# 30 నెలల్లో మీరాలం బ్రిడ్జి

### చెరువుపై 90 రోజుల్లో బ్రిడ్జి డిపిఆర్ పూర్తి చేయాలి

### జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** హైదరాబాద్‌లో మీరాలం చెరువుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పైన అధికారులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. 90 రోజుల్లో బ్రిడ్జి డిపిఆర్ పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 30 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అత్యంత ప్రముఖ ప్రాంతంగా మీరాలం బ్రిడ్జిని తీర్చిదిద్దాలని సూచించారు. శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జిహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. గ్రేటర్ హైదరాబాద్‌లో చేపడుతున్న పలు ప్రాజెక్టుల పైన సమీక్ష చేశారు. చిన్నపిల్లలను దృష్టిలో ఉంచుకుని బ్రిడ్జి పరిసరాలను రూపొందించాలని సిఎం సూచించారు. 2.425 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు మూడు ప్రతిపాదనలను చేశారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న కొత్త ఫ్లై ఓవర్ల పై మరింత లోతుగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

రోడ్ల వెడల్పు పైన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రెండు రోజుల్లో సమగ్ర సమాచారంతో రావాలని సూచించారు. సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ల నిర్వాకం!

## ఓ మృతదేహానికి రెండురోజులు వైద్యం

## ఆస్పత్రిపై కేసు నమోదు

### పెద్దఎత్తున బాధితుల ఆందోళన

**హైదరాబాద్ (సైబరాబాద్ )ప్రతినిధి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** రెండు రోజుల క్రితం చనిపోయినా కేవలం డబ్బులకోసం శవానికి వైద్యం చేశారంటూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. నరాల సమస్యతో ఆసుపత్రిలో చేరితో 13 లక్షలు వసూలు చేసికూడా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలు తీశారంటూ విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదుచేశారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదీనగూడలోగల సిద్దార్థ్ న్యూరో ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈఘటన వివరాలు మృతురాలి బంధువులు తెలిపిన ప్రకారం ఇలా వున్నాయి. కడపజిల్లా నందునూరుకు చెందిన జి. సుహాసిని(26) డిగ్రీ పూర్తిచేసి ఇంటివద్దనే ఉంటుంది. గతనెల 10వ తేదీన తన తండ్రి గుండెపోటు రావడంతో చనిపోగా ఈ విషయం తెలిసి తీవ్ర ఆందోళన చెందిన సుహాసిని కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో ఈమెను సమీపంలోవున్న ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సలహా మేరకు ఆమెను మెరుగైన వైద్యంకోసం మదీనగూడ లోగల సిద్దార్థ్ న్యూరో ఆసుపత్రికి >>2




శనివారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటి సిఎం భట్టి

## బకాయి నిధులిప్పించండి

### కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌నుకోరిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి8:** విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కేంద్రాన్ని కోరారు. శనివారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను సఫ్దర్ జంగ్ రోడ్డులోని ఆమె నివాసగృహం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కలిసి రాష్టానికి కేంద్రము నుంచి వివిధ అంశాల్లో రావలసిన ఆర్థిక వనరులకు సంబంధించి విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ అంశాలకు సంబంధించి రాసిన లేఖలను సైతం ఆమెకు అందజేశారు. వివిధ కార్పొరేషన్‌లు/ ఎస్‌పివిల ఋణ పునర్వ్యవస్థీకరణ (రిస్ట్రక్టరింగ్ ఆఫ్ డెబిట్) - ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 4,08,48, 54, 461 తిరిగి చెల్లింపును వేగవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014కింద, విభాగం 94(2) ప్రకారం, తెలంగాణకు రావలసిన వెనుకబాటుగా ఉన్న జిల్లాల కోసం ప్రత్యేక సహాయ నిధి విడుదల చేయాలని కోరారు.

2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రంగా ప్రయోజిత పథకాల నిధుల విడుదలలో జరిగిన కేటాయింపు పొరపాటు సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 లోని విభాగం 56(2) ప్రకారం రూ. 208.24 కోట్లు తిరిగి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పవర్ >>2



శనివారం న్యూఢిల్లీలో ఆర్బీఐ సిబిడి సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

# పంచాయతీ ఎన్నికలకు సిద్ధమైన ఇసి

## 15వ తేదీలోగా సంబంధిత సిబ్బందికి శిక్షణ పూర్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి8:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సిద్ధమవుతోంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిన ఇసి, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ అందించడంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 15వ తేదీలోగా సంబంధిత సిబ్బందికి ఎన్నికల తీరుపై శిక్షణ పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైందని చెప్పవచ్చు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో తమ హవా కొనసాగించేందుకు ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించాయి. మొదటగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండడంతో అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పార్టీలు సమాయత్తమయ్యాయి. ఈ దశలో ఓవైపు రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతుండగా, ఎన్నికల కమిషన్ కూడా అదే రీతిలో అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ఈనెల 10, 12, 15న పిఒ, ఎపిఒ లకు శిక్షణ ఇవ్వనుండగా పదవ తేదీలోగా ఎన్నికలకు సిబ్బందిని నియమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. కాగా, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల తేదీలు ఖరారంటూ సోషల్ మీడియాలో సమాచారం వైరల్ గా మారింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 10వ తేదీ విడుదల కాబోతుందని, 24న మొదటి విడత ఎన్నికలు, మార్చి మూడో తేదీన రెండో విడత ఎన్నికలు, మార్చి పదవ తేదీన మూడో విడత ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ సిద్ధమైనట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ పై అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల సీఎల్పీ సమావేశం నిర్వహించిన తెలంగాణ కాంగ్రెస్.. స్థానిక సంస్థల ఎన్నికలలో తమ హవా చాటుకునేందుకు నాయకులను సిద్ధం చేసింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో విజయాలను సాధించిందని, ఓవైపు రాష్ట్ర అభివృద్ధి తో పాటు, మన వైపు సంక్షేమ పథకాలను కూడా అమలు చేశామన్నారు.

# ఢిల్లీకి 'డబులింజన్'

>> ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాలకు బడ్జెట్‌లోచూపించిన తాయిలాలు కట్టిపడేసాయి. మధ్యతరగతి కుటుంబాలకు వార్షిక ఆదాయపన్ను పరిమితి 12 లక్షలకు పెంచుతూ బడ్జెట్‌లో ప్రకటించారు. ఇదే పెద్ద అస్త్రంగా ఢిల్లీలోపనిచేసింది. ఢిల్లీలో ఎక్కువశాతం మధ్యతరగతి వర్గాలే ఎక్కువ. వేతన జీవులకోసం 8వ వేతన సంఘం నియామకంప్రకటించి పెద్ద ఎత్తున ఓట్లు రాబట్టుకుంది. అంతేకాకుండా ఈఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా నిలిచారు. 60 లక్షలపైచిలుకు ఉన్న మహిళా ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. నెలకు రూ.2500 సాయంతోపాటు గర్భిణీలకు 25వేల రూపాయల ఆర్థికసాయం ఓటర్లలో బలంగా నాటుకునిపోయింది. ఢిల్లీలో నిరంతరం కేంద్రంతో వివాదం, లెఫ్టినెంట్ గవర్నర్‌తో వివాదం మద్యం కుంభకోణాలతో నిత్యం వార్తల్లో నిలిచిన ఆమ్ ఆద్మీపార్టీని ప్రజలు ఏవగించుకున్నారు. మహామహులంతా కూడా ఓటమి పాలయ్యారు. జైలుకు వెళ్లి వచ్చిననేతలందరినీ ఓటమి చవిచూపించారు. మాజీ సీఎం పార్టీ అధినేత అరవింద్‌కేజ్రీవాల్, మాజీ డిప్యూటిసిఎం మనిశ్‌సిసోడియా, ఆప్ ప్రభుత్వంలో ఆరోగ్యమంత్రిగాపనిచేసిన సత్యేంద్రజైన్ ముగ్గురినీ కూడా ఢిల్లీ ఓటర్లు ఇంటికి పంపించారు. ఇక అతిస్వల్ప మెజార్టీతో మాత్రమే ఢిల్లీ సిఎం అతిశి మొర్లేనా సింగ్ కల్కాజీ స్థానంలో గట్టెక్కారు. కేవలం నాలుగువేలపైచిలుకు ఓట్లే ఆమె మెజార్టీ సాధించారు. పోలింగ్‌ముగిసిన వెంటనేప్రకటించిన ఎగ్జిట్‌పోల్ సర్వేలు అన్నీ కూడా వాస్తవరూపం దాల్చాయి. 50సీట్లకుపైబడి వస్తాయని ప్రకటించినా ఏకైక అతిపెద్ద పార్టీగా రావడంఖాయం అన్న సర్వేలను ఢిల్లీప్రజలు నిజంచేసారు. అదేవిధంగా ఢిల్లీలో యువ ఓటర్లు, మొదటిసారి ఓటుహక్కుపొందిన ఓటర్లు కూడా కొంత కీలకంగా మారారు. కేంద్రంతో సఖ్యతతో కొనసాగుతూ అభివృద్ధికి పట్టం కట్టే పార్టీయే తమకు ముఖ్యమన్న భావన ఢిల్లీ ఓటర్లలో వ్యక్తం అయింది. అందువల్లనే ఢిల్లీప్రజలు భారతీయ జనతాపార్టీని అఖండమెజార్టీతో గెలిపించడంతో ఆపార్టీలో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. సుష్మస్వరాజ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన తర్వాత మళ్లీ ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాలేదు. దేశంలోని ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెంచిన బిజెపి ఢిల్లీని పెద్దగా పట్టించుకోలేదు. కాగా 2014 నుంచి ప్రధానిగా మోడీ పగ్గాలుచేపట్టినప్పటినుంచి ఆప్‌ప్రభుత్వ పనితీరును గమనిస్తూ వచ్చారు. దేశ రాజధాని పరిసరప్రాంతాలు కేంద్రపాలిత ప్రాంతం కేంద్రం అధీనంలోనే ఉంటున్నందున ఢిల్లీని పార్టీ ఖాతాలోవేసుకుంటే పాలన సౌలభ్యం మరింతమెరుగుపడుతుందని ముందునుంచి భావించారు. ఆదిశగానే వ్యూహాలను అమలుచేసి ఢిల్లీలో కాషాయ జెండాను ఎగురవేసారు.

# ఢిల్లీ సెక్రటేరియట్ సీజ్

>>మేరకు సాధారణపరిపాలనశాఖ ఉత్తర్వులు జారీచేసింది. భద్రతాపరమైన సమస్యలు రికార్డులభద్రతను పరిరక్షించుకునేందుకు ఈ అభ్యర్థనచేసామని జిఎడి పేర్కొంది. సచివాలయంలోని అన్ని శాఖల ఇన్‌ఛార్జిలు సెక్రటేరియట్ కార్యాలయాలు మంత్రుల క్యాంపు కార్యాలయాలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని అన్ని రికార్డులుభద్ర పరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఈ ఫలితాల వేళ అదీ బిజెపి విజయం సాధించిన తర్వాత ఈనిర్ణయం వెలువడటం తీవ్ర చర్చకు దారితీసింది. అయితేఈ ఉత్తర్వులు సాధారణ పరిపాలనలో భాగమని అధికార మార్పిడిజరగబోతున్న తరుణంలోముఖ్యమైన ప్రభుత్వ రికార్డులు దుర్వినియోగం కాకుండాచూడటమే వాటి ఉద్దేశ్యమని అధికారులు చెపుతున్నారు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు నిజంచేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు బిజెపికి పట్టం కట్టారు. కమలదళం హోరులో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీపార్టీకొట్టుకునిపోయింది. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి మ్యాజిక్‌ఫిగర్ 36ను దాటేసింది. హ్యాట్రిక్‌సాధించాలనుకున్న ఆప్ ఆశలకు గండికొట్టింది.


శనివారం శ్రీనగర్‌లో ఆనందోత్సాహాల మధ్య బిజెపి కార్యకర్తలు

## బిజెపిని మరోసారి గెలిపిస్తున్నందుకు

# రాహుల్ గాంధీకి అభినందనలు

### ఢిల్లీ ఫలితాలపై సెటైరికల్ ట్వీట్, పాత విడియోను పంచుకున్న కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యం చూపింది. విజయం ఖాయం చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ఎన్నికల ఫలితాల ట్రెండ్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఎద్దేవా చేస్తూ పోస్టు పెట్టారు. 'బీజేపీని మరోసారి గెలిపిస్తున్నందుకు రాహుల్ గాంధీకి అభినందనలు' అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు. దీనికి 2024 లో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ వీడియోను కేటీఆర్ జతచేశారు. దేశంలో మోదీకి అత్యంత నమ్మకమైన కార్యకర్త ఎవరైనా ఉన్నారంటే అది రాహుల్ గాంధీనే అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించడం ఈ వీడియోలో కనిపిస్తోంది. మోదీని, బీజేపీని అడ్డుకోవడం రాహుల్ వల్ల కాదని తాను గతంలోనే చెప్పానంటూ కెటిఆర్ ఈ వీడియోను షేర్ చేశారు.

# కమలం జోరుకు కంగుతున్న ఆప్ దిగ్గజనేతలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని ఢిల్లీలో కీలకపరిణామం చోటుచేసుకుంది. అధికార ఆప్ అగ్రనేతలకు ఢిల్లీ ఓటర్లు షాకులిచ్చారు. ఆప్ జాతీయ కన్వీనర్ మాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్ ఈ ఎ న్నికల్లో ఓటమిని చవిచూసారు. ఆయనతోపాటు అగ్రనేతలుమనీష్‌సిసోడియా,సత్యేంద్రజైన్‌లు కూడా ఓటమి పాలయ్యారు. న్యూఢిల్లీ సెంట్రల్ నియోజకవర్గంనుంచి పోటీచేసిన కేజ్రీవాల్‌పై బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ గెలిచారు. అయితే ఈ ముగ్గురునేతలు ఢిల్లీ మద్యం కుంభకోణంకేసులో నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ముగ్గురునాయకులు జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చారు. దీనితో వీరిని ప్రజలు ఓడించారు.మరోవైపు కల్కాజి నియోజకవర్గంలో సీఎం అతిశి మాత్రం విజయం సాధించారు. జంగ్‌పురలో బిజెపి అభ్యర్థి తర్వీందర్‌సింగ్‌చేతిలో మనీష్ సిసోడియా పరాజయం పాలయ్యారు. అలాగే షాకుర్‌బస్తీలో సత్యేందర్‌జైన్‌సైతం ఓటమి పాలయ్యారు. అదేవిధంగా మరో ప్రముఖ ఆప్‌నేత సౌరభ్‌భరద్వాజ్‌మాత్రం గ్రేటర్ కైలాశ్ స్థానంలోమూడోసారి గెలిచారు. బిజెపనికి చెందిన శిఖారాయ్‌పై ఆయన గెలిచారు. అదేవిధంగా ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ నేత పాఠక్ బిజెపి అభ్యర్థి ఉమంగ్ బజాజ్ చేతిలో రాజిందర్‌నగర్‌స్థానంలో ఓటమి పాలయ్యారు.

# రేషన్ కార్డుల దరఖాస్తులకు బ్రేక్ వేయలేదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** రేషన్ కార్డుల దరఖాస్తులకు ఏలాంటి ఆటంకం కలిగించలేదని ఎలక్షన్ కమిషన్ తెలిపింది. ఆదిలాబాద్,నిజామాబాద్,మెదక్,కరీంనగర్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో రేషన్ కార్డుల దరఖాస్తు స్వీకరణకు ఎన్నికల కమీషన్ అడ్డుచెప్పిందని వందంతుల షికారు చేశాయి. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం చేస్తూ మీ సేవా కమీషర్‌కు నిరంతం దరఖాస్తులు స్వీకరించేలా శుక్రవారం ఆదేశాలు కూడా జారీచేశారు. ఆన్‌లైన్‌లో కొత్తవాటి కోసం దరఖాస్తులు , అదేవిధంగా కుటుంబ సభ్యుల మార్పులు చేర్పులు కోసం ఒక ప్రత్యేక పోర్టల్ ఓపెన్ చేశారు. రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటంతో పోర్టల్ తాత్కాలికంగా నిలిపిఎయాలని ఇసి ప్రభుత్వాన్ని శనివారం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని జరగుతున్న ప్రచారంలో నిజంలేదని పేర్కొంది. ఇ సి ఆదేశాల మేరకు రేషన్‌కార్డుల ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రభుత్వం వెంటనే నిపివేసింద జోరుగా వందతులు వ్యాపించాయి. తెలంగాణలో జనవరి 26నుంచి కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం పంపిణీ చేయడం ప్రారంభించింది. కొత్త రేషన్ కార్డులకు అర్హత పొందిన వారి జాబితాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది.

# మల్లన్నసాగర్ నిర్వాసితులను ఆదుకోండి

## పెండింగ్‌లో ఉన్న 10 శాతం సమస్యలను తీర్చండి

## సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఫిబ్రవరి8:** సిద్దిపేట జిల్లాలో నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటానని ఆనాడు మీరు ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిరాహారదీక్ష చేపట్టారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉన్నందున ఆ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాల్సి న బాధ్యత మీపై ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాస కాలనీల నిర్మాణం, ఇంటి స్థలాలు, మౌలిక సౌకర్యాలను కల్పించడం జరిగిందని, మిగిలిన 10శాతం సమస్యలు గత ఏడాది కాలంగా పెండింగ్ లోనే ఉన్నాయని సిఎంకు లేఖలో గుర్తు చేశారు. నిరాహారదీక్ష చేసిన మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నిర్వాసితులు మీపైనే ఆశలు పెట్టుకున్నారని పెండింగ్ సమస్యల పరిష్కారంతోపాటుగా మరింత మెరుగైన సౌకర్యాలు, మెరుగైన పరిహారాన్ని అందిస్తారని ఎదురుచూస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 2013 భూసేకరణ చట్టంతో నిర్వాసితులకు 121 గజాల ఇంటి స్థలం, ఒక లక్షా 25వేల రూపాయలు మాత్రమే అందించాలనే నిబంధన ఉందని, కానీ మెరుగైన ప్యాకేజీని మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం నాడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ అమల్లోకి తెచ్చారని చెప్పారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ప్రతీ నిర్వాసితుడికి గజ్వేల్ పట్టణ సమీపంలోనే 250 గజాల ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి 5.04 లక్షల రూపాయలు, 7.50లక్షల పరిహారం అందజేశామన్నారు. 18ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరికి 5లక్షల రూపాయల పరిహారం, 250గజాల ఇంటి స్థలం కేటాయించామని, వీటితోపాటు పాత ఇండ్ల నిర్మాణ స్ట్రక్చర్‌కు కూడా సరైన లెక్క కట్టించి పరిహారం ఇచ్చామన్నారు. ప్యాకేజీతోపాటు నిర్వాసితులకు వారి గ్రామాల పేరిట ఆర్అండ్ఆర్ కాలనీలను నిర్మించి బిఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగేవరకు దాదాపుగా అన్ని వసతులను దశలవారీగా సమకూర్చామన్నారు.

ఇందుకోసం రూ.1260 కోట్లను ఖర్చు చేసి నిర్వాసితులకు అత్యంత ప్రాధాన్యతను కల్పించామని, ఈ నిధులతో 90శాతం పనులను చకచకా పూర్తిచేశామన్నారు. మిగితా 10శాతం పనులతో పాటు కోర్టు కేసుల్లో తీర్పు వచ్చినవారికి, అక్కడక్కడ ప్యాకేజీ మిస్సయినవారికి పరిహారం అందించాల్సి ఉందన్నారు.
ప్రభుత్వం మారిన క్రమంలో ఆ మిగితా పనులను పూర్తి చేయలేకపోయామని, ముంపు గ్రామాలకు చెందిన వితంతువులను కూడా కుటుంబంగా పరిగణించి వారికి ప్యాకేజీ ఇవ్వాలని ఇటీవల హైకోర్టు తీర్పు వెల్లడించిందని, వెంటనే వితంతువులకు పరిహారం అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. లక్షలాది ఎకరాలకు సాగునీటితోపాటు హైదరాబాద్ సహ అనేక ప్రాంతాలకు తాగునీటి కష్టాలను తీరుస్తున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం వెనుక నిర్వాసితుల త్యాగాలు ఉన్నాయని చెప్పారు. మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రిజర్వాయర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నారు.
హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు మూసి నదిలో గోదావరి జలాలను తరలించడానికి మీరు మల్లన్నసాగర్ పై ఆధారపడ్డారు. ఇక్కడి నుంచే 20 టిఎంసిల నీటిని హైద్రాబాద్ తరలించే దుకు టెండర్ల ప్రక్రియ కూడా చేపడుతున్నట్లు తెలుస్తున్నదన్నారు. కాళే శ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. కాళేశ్వరంతో ప్రయోజనం లేదని మీరు స్వయంగా విమర్శలు చేశారు, మరి కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ నీళ్ల కోసం ఎందుకు తాపత్రయ పడుతున్నారని పేర్కొన్నారు. ఆనాడు మీరు నిరాహారదీక్ష చేపట్టిన సమ యంలో మా ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈరోజు నేను కూడా మిమ్మల్ని ప్రశ్ని స్తున్నా. నాడుమేము తక్కువ పరిహారంఇచ్చామని మీరు ఆరోపణలు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో ఎక్కువ పరిహారం ఇచ్చి నిర్వాసితుల దగ్గర మీమాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

## తీర్పును అంగీకరిస్తున్నాం

>> బిజెపికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రజలు ఎంతో విశ్వాసంతో గెలిపించారని, ప్రజల ఆకాంక్షలమేరకు పనిచేస్తుందని ఆశిస్తున్నట్లు కేజ్రివాల్ పేర్కొన్నారు. గడచిన పదేళ్లలో విద్య, ఆరోగ్యం, మంచినీరు, విద్యుత్ రంగాల్లో గణనీయమైన కృషిచేసామనిఅన్నారు. ఢిల్లీలో మౌలికవనరులు పెంపొందించేందుకు కృషిచేసామన్నారు.

## నిధులిప్పించండి

>> ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కేటాయించిన అదనపు బాద్యత (ఎక్సెస్‌లయబిలిటీ)) మేరకు అందుకోవలసిన మొత్తానికి సంబంధించిన అంశం పైన చర్చించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 కింద నిధుల బదిలీ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఫండ్స్) కోరుతూ విజ్ఞప్తి చేశారు. 8.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పవర్ యుటిలిటీల మధ్య పెండింగ్‌లో ఉన్న బకాయిల పరిష్కారం చేయాలని కోరారు.

# ఢిల్లీ సిఎం రేసులో పర్వేష్‌సింగ్ వర్మ

## మహిళ అయితే భాంసురి స్వరాజ్, మీనాక్షిలేఖి, స్మృతి ఇరానీ?



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** రెండున్నరదశాబ్దాల నిరీక్షణ తర్వాత ఢిల్లీ పీఠంపై ఇపుడు కాషాయం జెండా ఎగిరింది. దేశరాజధాని అధికారాన్ని ఎవరికి అప్పగిస్తుందో అన్న ఉత్కంఠమధ్యజరిగిన ఎన్నికల్లో బిజెపి ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించింది. మెజార్టీ మార్కు 36 స్థానాలను దాటి ఏకంగా 48 స్థానాలు కైవసం చేసుకుంది. సిఎం రేసులో ప్రధానంగా ఉన్న పర్వేశ్‌సాహిబ్ సింగ్‌వర్మ ఈ విజయంపై మాట్లాడుతూ ఢిల్లీప్రజలకు ధన్యవాదాలుచెప్పారు. ప్రధానిమోడీ నాయకత్వంలోనే డబుల్ ఇంజన్‌ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. ఇక సిఎం పదవి పరంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని ఎవరి అంచనాలు ఎవరికి ఉన్నా హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని ఖరాఖండిగాచెప్పారు. పర్వేశ్ మాజీ సిఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు. 2014నుంచి 2024 వరకూ పశ్చిమఢిల్లీనుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఆయన రికార్డుస్థాయిలో 5.78 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచారు. ప్రస్తుతం బిజెపి హైకమాండ్ ఢిల్లీ పాలనపగ్గాలు పర్వేశ్‌చేతికి అందించే అవకాశాలే ఎక్కువ అని స్పష్టం అవుతోంది. వీరుకాకుండా ఢిల్లీ బిజెపి చీఫ్ వీరేంద్రసచ్‌దేవాకూడా రేసులో ఉన్నారు. అలా కాకుండా మహిళకే అవకాశం ఇవ్వాలనిభావిస్తే బిజెపి ఎంపి మాజీ సిఎం సుష్మస్వరాజ్ కుమార్తె భాంసురి స్వరాజ్ పేరుకూడా వినిపిస్తోంది. అలాగే కరోల్‌బాగ్‌నుంచి పోటీచేసిన దుష్యంత్‌కుమార్ గౌతమ్, ఎంపిలుగా ఉన్న మీనాక్షిలేఖి, అమేథిలో ఓటమి చవిచూసిన కేంద్రమాజీ మంత్రి స్మృతీ ఇరాని పేర్లుకూడా వినిపిస్తున్నాయి.

# కాగ్ నివేదిక ఇస్తాం

>> న్నారు. ఈరోజు ఢిల్లీ ప్రజలంతా నాపై విశ్వాసం ఉంచినందుకు శిరసువంచి అభివాదం చేస్తున్నట్లు మోడీ అన్నారు. అభివృద్ధిలో ఢిల్లీని పరుగులు పెట్టిస్తానని ఈసందర్భంగా ఢిల్లీప్రజలకు హామీ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. అభివృద్ధి, విజన్, నమ్మకానికి దక్కిన విజయమే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం అన్నారు. ఈ విజయం అవిశ్రాంతంగా పోరాడిన ప్రతి బిజెపి కార్యకర్తకు దక్కుతుందని అభినందించారు. మార్పుకోరుతూ ఢిల్లీప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం సిటీగా పరిమితం కాదని యావద్దేశానికి వర్తించే చరిత్రాత్మక తీర్పు అని మోడీ శ్లాఘించారు.
భిన్న సంస్కృతులకు నిలయమైన ఢిల్లీనిమినీ హిందూస్థాన్‌గా భావిస్తామన్నారు. అవినీతికి వ్యతిరేకంగాపార్టీ పెట్టినవారు పూర్తి అవినీతిలో కూరుకుపోయారని అన్నారు. ఢిల్లీ తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే కాగ్‌నివేదిక ప్రవేశపెడతామని మోడీ హెచ్చరించారు. వాయుకాలుష్యం పారిశుధ్యసమస్యలు పట్టిపీడిస్తున్నాయని, ఆప్‌ప్రభుత్వంలో యమునా కాలుష్యకాసారంగా మారిపోయిందని, యమునాలో విషం కలిపారంటూ హర్యానాపై తప్పుడు ఆరోపణలుచేసారని, యమునానదిని ఆప్‌ప్రభుత్వం అపవిత్రంచేసిందని కాలుష్యకోరలనుంచి యమునానదిని రక్షిస్తామని ఎంత కష్టమైనా యమునా నదిని ప్రక్షాళనచేస్తామని ప్రధాని అన్నారు.
అలాగేసభలో కాంగ్రెస్‌పైనా ఛలోక్తులు విసిరారు. ఢిల్లీ ఫలితాల్లో కాంగ్రెస్ జీరో హ్యాట్రిక్ కొట్టిందని వ్యాఖ్యానించారు. వరుస ఓటములతో కాంగ్రెస్‌కు గోల్డ్‌మెడల్ ఇవ్వవచ్చని అన్నారు. కాంగ్రెస్ మునిగిపోవడమే కాకుండా వారి మిత్రులను కూడాముంచేస్తోందని వ్యంగ్యోక్తులు సంధించారు. ఇండియా కూటమిలోని పార్టీలకు కాంగ్రెస్ నిజస్వరూపం తెలిసిపోయిందని ఓటుబ్యాంకు రాజకీయాలను మిత్రులు కూడా గ్రహించారని మోడీ పేర్కొన్నారు. పూర్వాంచల్ ఓటర్లకు ప్రధాని మోడీ ధన్యవాదాలు తెలిపారు. సభకు బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపినడ్డా అధ్యక్షత వహించారు. ఢిల్లీ విజయం బిజెపి క్షేత్రస్థాయిలోపనిచేసిన ప్రతి కార్యకర్త విజయం అని నడ్డా పేర్కొన్నారు.

# ఓ మృతదేహానికి రెండురోజులు వైద్యం

>> తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతున్న ఆమెను ఎలాగైనా బాగుచేస్తామని నమ్మబలికిన ఆసుపత్రి వైద్యులు ఇప్పటికే 13 లక్షల రూపాయలు వసూలు చేశారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి ఆసుపత్రి వైద్యులు మరో 5 లక్షలు చెల్లిస్తేనే వైద్యం నిర్వహిస్తామని లేదంటే వెంటనే వైద్యం నిలిపివేస్తామని సుహాసిని సోదరుడు రాకేష్‌కు తెలిపారు. దీంతో ఇప్పటికే అందినకాడల్లా అప్పులు చేసిన తాము ఒక్కసారిగా ఐదు లక్షలు ఇవ్వలేమని చెప్పి నగరంలోని నిమ్స్ ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమయ్యారు. అయితే అప్పటికే సుహాసిని అపస్మారక స్థితిలోకి చేరుకోగా కోమాలోకి వెళ్లిందని వైద్యులు తెలిపారు. శనివారం ఉదయం సుహాసినిని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. అదే సమయంలో మృతదేహం నుంచి దుర్గంధం వస్తుండడంతో మృతదేహాన్ని ఫ్రీజర్‌బాక్సులో ఉంచిన మృతురాలి బంధువులు సిద్దార్థ ఆసుపత్రి వద్దకు తీసుకువచ్చి ఆసుపత్రి ముందు ఉంచారు.

**రెండు రోజుల క్రితమే చనిపోయింది**

అయితే రెండు రోజుల క్రితమే సుహాసిని మృతిచెందినట్లుగా తెలుస్తుందని నిమ్స్ వైద్యులు తమతో చెప్పినట్లుగా సుహాసిని సోదరి మీడియాకు తెలిపారు. గత రెండు రోజులుగా తన చెల్లిని చూసేందుకు అనుమతించలేదని, డబ్బులు పూర్తిగా చెల్లించి మరో ఆసుపత్రికి తీసుకువెళ్లమన్నారని తెలిపారు. తాము ఒంటిమీద ఉన్న బంగారాన్ని అమ్మేసినా డబ్బులు సరిపోక అందినకాడికి అప్పులు తెచ్చి ఆసుపత్రికి చెల్లించామన్నారు. కడప నుంచి తాము ఇంతదూరం వస్తే ఇక్కడ తమను అన్యాయంగా దోచుకొని శవాన్ని అప్పగించారని వాపోయింది.

**న్యాయం జరిగే వరకు పోరాడుతాం:శోభన్**

కార్పోరేట్ ఆసుపత్రుల ధనదాహానికి పేదల ప్రాణాలు పోతుండగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని సిపిఎం శేరిలింగంపల్లి కార్యదర్శి చల్లా శోభన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకొని శనివారం సాయంత్రం తమ కార్యకర్తలతో ఆసుపత్రికి చేరుకున్న ఆయన ఆసుపత్రి ప్రధాన ద్వారం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సిదార్థ ఆసుపత్రి యాజమాన్యం అకృత్యాలపై ఇప్పటికే పలు ఫిర్యాదులు ఉన్నాయని, అమాయక ప్రజలవద్ద నుంచి లక్షలాది రూపాయలు దండుకొని వారి ప్రాణాలు తీస్తున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రి భవనాన్ని సైతం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, ఫైర్‌సేఫ్టీ సైతం ఏమాత్రం లేదన్నారు. సుహాసిని కుటుంబానికి న్యాయం చేసి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చేందుకు తాము ఎంతటి పోరాటానికైనా వెనకాడమన్నారు.

# కుంభకోణాలు, నాయకత్వ లేమితోనే ఓటమి

## ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమిపై అన్నాహజారే



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమిపై సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందించారు. అరవింద్ కేజ్రివాల్ విధానాలు, నిర్ణయాలు మద్యంపాలసీ కుంభకోణాలు, నాయకత్వలోపం వంటివి ఓటమికి కారణాలని విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్ తీరుపై మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ పనితీరు సరిగ్గాలేకపోవడానికి కారణం సరిపోని నాయకత్వం కుంభకోణాలు, రాజకీయ వివాదాలపై దృష్టికేంద్రీకరించడమే కారణమన్నారు. ఆప్‌నేతలకు తాను పదేపదే సలహాలు ఇచ్చినా వారు పట్టించుకోలేదని అన్నాహజారే అన్నారు. ఎన్నికల అభ్యర్థులు స్వచ్ఛమైన వ్యక్తిత్వం, స్వచ్ఛమైన మనస్సు, కళంకంలేని ఖ్యాతి కలిగి ఉండాలని ఎప్పుడూ చెపుతూనే ఉన్నానని అయితే ఆప్ దానిని కోల్పోయిందని వారు మద్యం, డబ్బుతోకూడిన కుంభకోణాల్లో చిక్కుకున్నారన్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రతిష్టను దెబ్బతీసారని అందుకే ఎన్నికల్లో ఓట్లు సంపాదించడానికి వారు ఇబ్బందిపడ్డారన్నారు. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ నిరంతరం మంచి వ్యక్తిత్వాన్ని ప్రోత్సహించినా ఎన్నికల్లో పనిచేయలేదని హజారే అన్నారు. మద్యం కుంభకోణాల్లో ఆయనప్రమేయం ఉందనిప్రజలు విశ్వసించారన్నారు. ఆరోపణలు రాజకీయాల్లోభాగమే కానీ అమాయకత్వాన్ని వారు కాపాడుకోవాలి.సత్యం ఎప్పుడూ సత్యంగానే ఉంటుందన్నారు. ఆప్‌తో దూరంగా ఉండాలని తాను మొదటినుంచి నిర్ణయించుకున్నట్లు అన్నా హజారే అన్నారు. ఒకసమావేశం జరిగితే ఆపార్టీలోచేరకూడదని అనుకున్నానని అప్పటినుంచి దూరంగా ఉన్నానన్నారు. ప్రతిఫలం ఆశించకుండా లక్ష్యం సాధించడానికి ప్రయత్నించడం సరైన విధానమని దీన్ని గ్రహించడంలోకేజ్రీవాల్ విఫలం అయ్యారని అందుకే నిండా మునిగిపోయారన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 9-02-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
ద్వాదశి రా. 7.26
ఆరుద్ర సా. 5.52
వర్జ్యం : తె.5.56-7.32
దు.సా. 4.38-5.24
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. శుభకార్యాలలో పాల్గొంటారు.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మిథునం:** పనులలో తొందరపాటు వద్దు. ఖర్చులు పెరుగుతాయి ప్రయాణాలు.

**కర్కాటకం :** ఆలోచనలు స్థిరంగా ఉండవు. దైవదర్శనాలు మిత్రుల కలయిక. పనులు సకాలంలో పూర్తి.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఆర్థిక లాభాలు పొందుతారు. నూతన వస్తు లాభాలు.

**కన్య :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. మిత్రుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**ధనుస్సు:** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వాహన సౌఖ్యం.

**మకరం:** ఋణబాధలు ఎదురై అధిగమిస్తారు. మిత్రులతో విభేదాలు ఏర్పడిన పరిష్కరించుకొంటారు.

**కుంభం:** స్వల్ప అనారోగ్యం సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. ధన వ్యయం పెరుగుతుంది.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు నిరాశపరుస్తాయి. అనుకోని ఖర్చుల ఎదురైన సమర్థవంతంగా నిర్వహిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'ఫోర్టిఫైడ్'పై అవగాహన లేక నల్లబజారుకు పిడిఎస్ బియ్యం

### డబ్ల్యూహెచ్ఓ ఆదేశం మేరకు ఐదు ఆహార సరకుల్లో ఫోర్టిఫైడ్ తప్పనిసరి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన అరకొరగా ఉండటంతో పేదలు వాటిని తినకుండా దళారులకు విక్ర యిస్తున్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన 89,96,083 కుటుంబాలకు ఫోర్టిఫైడ్ రైస్‌ను 2022 నుంచి తెలం గాణలో సరఫరా చేస్తున్నారు. కొత్తగా జనవరి 26న మరో పదిలక్షల కుటుంబాలకు తెల్లరేషన్‌కార్డులు మం జూరు చేశారు. 3.5కోట్ల వినియోగదారుల కోసం పిడిఎస్ బియ్యం ఫోర్టిఫైడ్ చేసి సరఫరా చేస్తారు. పౌర సరఫరాలశాఖ ఏటా 36లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పిడిఎస్ ద్వారా సరఫరా చేస్తుంది. పిడిఎస్ బియ్యం బస్తాలో 99కిలోలకు అదనంగా 74 రూపాయలు ఖర్చు పెట్టి పదికిలోల ఫోర్టిఫైడ్ గ్రెయిన్స్‌ను కలిపి లబ్ధి దారులకు సరఫరాచేస్తుంది. పిడిఎస్ లబ్దిదారులు బియ్యం దొడ్డుగా వున్నాయని తినకుండా తిరస్కరిస్తున్నారేకానీ ఈ బియ్యం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజ నాలు గుర్తించడంలేదు. ఫోర్టిఫైడ్ రైస్‌ను తక్కువ ధరకు దళారులకు అమ్మేసుకుంటున్నారు. దళారులు రైసుమిల్లరకు విక్రయిస్తారు. రైస్‌మిల్లర్లు వాటిని పాలిష్ చేసి దేశం ఎల్లలు దాటిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాలమేరకు రాబోయే రోజుల్లో ప్రతి ఆహారసరుకులు ఫోర్టిఫైడ్ చేసి విక్రయించాల్సి వస్తుంది. పాలు, గోధుమపిండి, ఉప్పు, వంటనూనేలు బి12, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి సూక్ష్మపోషకాలతో బలవర్ధకంగా తయారిస్తూ వినియోగదారులకు అందుబాటు లోకి తీసుకొస్తున్నారు. గుడ్డును కూడా ఇప్పుడు ఇ విటమిన్‌తో ఫోర్టిఫైడ్ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మాత్రం నాలుగు ఆహారవస్తువులు ప్రైవేట్ రంగంలోని ఆహారపారిశ్రామిక వేత్తలు తప్పనిసరిగా ఫోర్టిఫైడ్ చేయనది విక్రయించడంలేదు. ఉప్పు అయోడిన్‌తో ఫోర్టిఫైడ్ చేసి విక్రయిస్తున్నారు. అదే విధంగా ఆహారవంటకాలలో వాడుతున్న నూనెలో కూడా విటమిన్స్ ఫోర్టిఫైడ్ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరాచేసే బియ్యంను ఐరన్,ఫోలిక్‌యాసిడ్, విటమిన్లు,జింక్, బి12 గుళికలు పలచటి దంతికలుగా రూపొందించి అందులో కలిపేస్తున్నారు. ప్రతి99 కిలోలకు వెయ్యి గ్రాములు అంటే కిలో కలుపుతున్నారు. ఫోర్టిఫైడ్‌కు క్వింటాల్‌కు 74రూపాయల ఖర్చును కేంద్రం రాష్టాం చెరిసమానంగా భరిస్తున్నాయి. పెద్ద ఎత్తున సామన్యుడి ఆరోగ్య ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం పిడిఎస్ బియ్యం లబ్దిదారులకు తెలియకపోవడంతో అమృతతుల్యమైన ఈ బియ్యం రేషన్‌దుకాణంలోనే కొన్నిచోట్ల విక్రయిస్తుంటే మరికొన్ని చోట్ల ఉదయం బియ్యం కొనుగోలు కోసం వచ్చే చిరువ్యాపారులకు కిలోకు పది రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా ప్రస్తుతం ఫోర్టిఫైడ్ రైస్ బియ్యం వండిపెడుతున్నారు. దీనితో గర్భిణి మహిళలలో ఇనుము దాతువు లోపం తగ్గి ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టడమే కాకుండా మాతృ,శిశు మరణాలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా చౌకధరల దుకాణాల వారిగా ప్రభుత్వం సరఫరాచేసే ఫోర్టిఫైడ్ రైస్ బియ్యం పట్ల అవగాహన పెంచి అవి వారు వండుకొని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దొడ్డు బియ్యమైనా సన్నబియ్యమైనా ఫోర్టిఫైడ్ రైస్‌లో ఉండే పౌడర్ కూడా నీటిలో కలిసి వృధా కాకుండా కడగకుండానే వండుకొని తినాల్సి ఉన్నా ఈ విషయం చెప్పక పోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలలో వాటిని కడిగి వండుతుండటంతో అవి ఏ స్థాయిలో ప్రయోజనం కలిగం చాల్సి ఉంటుందో అంతప్రయోజనం లబ్ధిదారులకు అందడంలేదు.

# ఆప్‌ను ఊడ్చి పారేశాం.. ఢిల్లీ మాదే

### తెలంగాణలోని ఎమ్మెల్సీ సీట్లూ మావే..

### మేధావులారా.. ఆలోచించి ఓటేయాలి

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అక్రమ దందాలకు పాల్పడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు చీపురును ఛీ కొట్టి ఊడ్చిపారేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ మాదే.. తెలంగాణసహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోయేది బిజెపియే అన్నారు. ఇక్కడ 3 ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోబోయేది కూడా బిజెపియే అన్న ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ చీపురుతో ఛీ కొట్టారు. చేతిని చిదిమేశారు. కమలాన్ని వికసింపజేశారు. ఢిల్లీ అయినా గల్లీ అయినా బిజెపితోనే మనసంతా, ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీతోనే మేమంతా అని చాటిచెప్పిన ప్రజలకు కృతజ్ఞతలు అని తెలిపారు. అక్రమ దందాలతో, అక్రమాలతో జైలుకు పోయిన నాయకుడు మాకొద్దు, నీతివంతమైన మోడీ పాలన ఢిల్లీలోనూ రావాలని ప్రజలు ఆకాంక్షించారు. అందుకే చీపురుతోనే ఆప్ పార్టీని ఊడ్చి పారేశారు. వార్ వన్ సైడ్ అన్నట్లుగా ఢిల్లీ ప్రజలు బిజెపికే పట్టం కట్టారు. తెలంగాణ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం త్వరలోనే రాబోతోంది. ఇకపై ఢిల్లీ పీఠం మాదే అన్నారు. త్వరలోనే తెలంగాణలోని ఎమ్మెల్సీ సీట్లు కూడా బిజెపి పరమే కాబోతున్నాయన్నారు. ఎందుకంటే ప్రశ్నించే పార్టీ బిజెపి అన్నారు. ఉద్యోగులు, పట్టభద్రులు, మేధావుల పక్షాన పోరాడేది బిజెపి అన్నారు. తెలంగాణలోని మేధావులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులంతా ఆలోచించుకుని బిజెపికి ఓటేయాలని కోరుతున్నామన్నారు.

# నకిలీ బీమా పత్రాలను సృష్టించి మోసాలకు పాల్పడిన ముఠా అరెస్టు

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** నకిలీ బీమా పత్రాలను సృష్టించి ఆయా భీమా కంపెనీలను, రవాణా శాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ సంస్థలను తప్పుదోవ పట్టిస్తున్న ఓ ముఠాను పేట్ బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. దూలపల్లి ప్రాంతానికి చెందిన ప్రవీణ్ (37), రామంతపూర్ ప్రాంతానికి చెందిన కాముని బాల మహేందర్ (28), బాలానగర్ ఫిరోజ్ గూడకు చెందిన మొలక బాలాజీ (29), లోతుకుంట అల్వాల్ ప్రాంతానికి చెందిన రుహుల్లా బేగ్ (27)లు గత కొంతకాలంగా ముఠాగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆలోచనలతో ప్రభుత్వ ప్రైవేటు యంత్రాంగాలను తప్పుదోవలను పట్టించేందుకు తప్పుడు పత్రాలను సృష్టించి తప్పించుకుని తిరుగుతున్నారు. గురువుల ప్రవీణ్ అనే నిందితుడు మేడ్చల్ రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీవో బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కార్యాలయానికి వచ్చే వాహనాదారులకు లేనిపోని మాటలు చెప్పి అధికంగా ఇన్సూరెన్స్ చెల్లించకుండా తక్కువ రూపాయలకే వాహన ఇన్సూరెన్స్ పత్రాలను ఇస్తానని నమ్మబలికి వారిని బుట్టలో వేసుకుంటాడు. మొలక బాలాజీ అనే నిందితుడు గతంలో ఓ ప్రైవేట్ సంస్థలు కన్సల్టెన్సీగా పనిచేస్తూ కంప్యూటర్ పై అవగాహన ఉంది. దీనికి తోడు మరో ఇద్దరు నిందితులు అందరూ ఒక్కటిగా మారి ఆయా వాహనాల బీమా పత్రాలను పొందాలంటే 15 వేలకు పైగానే ఉంటుంది. కానీ వీళ్లు 2500 మాత్రమే పత్రాలను అందిస్తామని, వీటిని ఆయా వాహనాలను తనిఖీ చేసే సమయంలో అధికారులకు చూపిస్తే సరిపోతుందంటూ చట్టబద్ధమైనవంటూ నమ్మించి బాధితులను మోసం చేస్తూ వస్తున్నారు. వీరు చేసే మోసం పట్ల ఓ బాధితులు 7న పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రంగంలోకి దిగి తమదైన శైలిలో నిందితులను పట్టుకొని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ అలియాంజ్, రహేజా ఇన్సూరెన్స్, క్రోమా, రిలయన్స్, బిగ్ బాస్కెట్ లాంటి పేరున కంపెనీల బ్రాండ్‌ను నకిలీ పత్రాలుగా తారుమారు చేసి బాధితులకు అప్పగిస్తూ వస్తున్నారు. వీరి వద్ద 16 మంది అభ్యర్థుల డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు 45 ఆయా నకిలీ పత్రాలు, 178 నకిలీ బజాజ్ అలి యాంజ్, ఆరు రహేజా బీమా, 1 సీఎం ఫైనాన్స్ నకిలీ బీమా సర్టిఫికెట్లు, లాప్ టాప్, సిపియు, సెల్‌ఫోన్లు సీజ్‌చేసి నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలపై బిజెపి మేధోమథనం

### విజయమే లక్ష్యంగా వ్యూహారచన

### ప్రచార కార్యాచరణపై ప్రణాళికలు

### ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల తరుణంలో బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ గోల్కొండ హోటల్‌లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఎమ్మెల్సీ అభ్యర్థులు, కీలక నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, పార్టీ ఎన్నికల అభ్యర్థులు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నా రు. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల వ్యూహరచన రూపొందించేలా ప్రచార కార్యాచరణపై సమగ్రంగా చర్చించి కీలక సూచనలు చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన ఎండగడుతూ, కాంగ్రెస్ సర్కారు మోసాలను ప్రజలకు వివరించేలా ప్రచారాన్ని ఉధృతం చేయడంపై ప్రధానంగా దృష్టి సాధించాలన్నారు. రానున్న రోజుల్లో కర్ణాటక, తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో స్వతంత్రంగా అధికారకంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందన్నారు. బిజెపి రాష్ట్ర శాఖ తరపున, ప్రజలందరి తరపున ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు శుభాకాంక్షలు తెలిపారు.

# కొంపముంచిన బిఆర్‌ఎస్‌తో కేజ్రీవాల్ స్నేహం

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కెసిఆర్ సార్థ్యంలోని బిఆర్‌ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంపముంచిందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి భాష్యం చెప్పారు. కెసిఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యాపారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయని ఆయన అపహాస్యం చేశారు. అన్నాఅజారే చేపట్టిన అవినీతిరహిత భారతదేశం నినాదాన్నే తన పార్టీ సిద్ధాంతంగా మార్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా, మొదట ఢిల్లీలో అధికారం, తర్వాత పంజాబ్ ను కైవసం చేసుకోవడం ద్వారా దేశ స్థాయిలో తన పేరు మారుమోగేలా చేశారని చరిత్రను టిపిసిసి నెమరేసుకున్నారు. తాజా ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో ఆప్ ను కోలుకోలేని దెబ్బ తీశాయని ఎకసెక్కాలు చేశారు. ఈ పరిస్థితికి కేజ్రీవాల్ స్వయం కృతాపరాధమే కారణమని విమర్శించారు. కేజ్రీ పతనానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. అందులో ఒకటి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంప ముంచిందనే చెప్పాలి. కేసీఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యాపారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయి. ఏ అవినీతిరహిత నినాదంతో కేజ్రీవాల్ దేశ స్థాయిలో ఇమేజ్ తెచ్చుకున్నారో దానికి లిక్కర్ స్కాం తూట్లు పొడిచిందని ఆయన పేర్కొన్నారు . ఆప్ కు అప్పటి వరకు ఉన్న క్లీన్ ఇమేజ్‌ను లిక్కర్ స్కాం ఆరోపణలు ఊడ్చిపారేశాయి. అవినీతికి కేజ్రీవాల్ అతీతుడు కాదు అన్న అభిప్రాయం ప్రజల్లో కలగడానికి కేసీఆర్ ఫ్యామిలీ కారణమైందని ఆయన దుయ్యబట్టారు. రెండు దఫాలు ఢిల్లీని ఏలిన కేజ్రీ పాలనలో లిక్కర్‌స్కాం తప్ప మరో అవినీతి ఆరోపణలేదు. కవిత లిక్కర్ వ్యాపార కాంక్ష కేజ్రీ పార్టీ సిద్ధాంతానికే తూట్లు పొడిచిందని అన్నారు. దేశ స్థాయిలో కేజ్రీ ఇమేజ్‌ను ఈ స్కాం పైకి కనిపించనంత కుళ్లబొడిచిందనే చెప్పాలి. ఇక రెండో అంశం కాంగ్రెస్ పార్టీని శత్రువుగా పరిగణించడం తాజా ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీ పతనానికి మరో కారణమైందని అన్నారు. కాంగ్రెస్‌ను దూరం పెట్టి అధికారాన్ని కూడా కోల్పోయారని చెప్పక తప్పదని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం

ఫారం-VII

## (Declaration) రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

G2/1021/2024 — తేది: 03.12.2024

Gaz. No. 90/2024

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూరు గ్రామము వద్ద ప్యాకేజీ నెం. 29 డిస్ట్రిబ్యూటరీ-82 మేజర్ 31 టేల్ చివర గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.7.13 గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరీ-82 మేజర్ 31 టేల్ చివర కెనాల్ నిమిత్తం సేకరింపవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఎ. 7.13 గుం॥ భూమి డిస్ట్రిబ్యూటరీ-82 మేజర్ 31 టేల్ చివర కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరింపబడుటకుగాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించదానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామము : చెర్కూరు — మండలం : వెల్దండ — జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ఎస్.డి.నెం. | పట్టా/ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట/తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేరు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 597 | పట్టా | మెట్ట | 0.24 | మందగళ్ల అలివేలు భర్త: లక్ష్మయ్య (0.02) మందగళ్ల వెంకటమ్మ భర్త: [illegible] (0.02) మందగళ్ల చెన్నయ్య తండ్రి: బాలయ్య (0.07) మందగళ్ల [illegible] తండ్రి: బాలయ్య (0.07) మందగళ్ల లక్ష్మయ్య తండ్రి: బాలయ్య (0.06) [illegible] | 591 | 596 | 592 | 604 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 592 | పట్టా | మెట్ట | 1.13 | ఎనుముల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి: లక్ష్మారెడ్డి (1.13) [illegible] | 584 | 593 | 581 | 587 | లేవు | లేవు | పైప్ లైన్ | 1 |
| 3 | 581 | పట్టా | మెట్ట | 1.21 | [illegible] (1.01) [illegible] 0.20 [illegible] | 567 | 580 | 567 | 592 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 577 | లావుణి పట్టా | మెట్ట | 2.07 | [illegible] (0.11) [illegible] (0.11) [illegible] (0.16) [illegible] (0.17) [illegible] (0.06) [illegible] (0.07) [illegible] (0.06) [illegible] (0.01) [illegible] | 566 | 578 | 576 | 581 | [illegible] | 4 1 | 1 | [illegible] |
| 5 | 576 | పట్టా | మెట్ట | 0.36 | కె.లక్ష్మణ్ తండ్రి: హేమ్లా (0.36) | 574 | 557 | 575 | 581 | లేవు | లేవు | పైప్ లైన్ | 1 |
| 6 | 575 | పట్టా | మెట్ట | 0.12 | [illegible] (0.12) [illegible] | 574 | 557 | 311 | 578 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 574 | పట్టా | మెట్ట | 0.20 | [illegible] (0.19) [illegible] (0.01) [illegible] | 566 | 575 | 311 | 565 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | | మొత్తం | 7.13 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ వల్ల ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగాగాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ — సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ — సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 661/LA/PP/Advt/Pub/2024-25


सत्यमेव जयते

సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ

భారత ప్రభుత్వం

## సామాజిక న్యాయం మరియు సాధికారత యొక్క విభాగం

ప్రకటిస్తోంది

## షెడ్యూల్డ్ కులానికి ఉపకార వేతనాలు

## 2024-25 సంవత్సరానికి SC విద్యార్థుల కొరకు పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనముల పథకాలు క్రింద

## ఉన్నత విద్య అనుసరించడానికి విద్యార్థులకు

**అర్హత**
- తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షిక ఆదాయం రూ. 2.50 లక్షలకు మించకూడదు
- గుర్తింపు గల కాలేజీలు/స్కూళ్లలో కోర్సులు అనుసరించే విద్యార్థులు

**అవకాశం**
- క్లాస్ 11 ఆపై నుండి అన్ని గుర్తింపు గల కోర్సులు
- రాష్ట్ర ప్రభుత్వం/కేంద్ర పాలిత ప్రాంతంచే అంగీకరించబడి మరియు రూఢీ చేయబడిన దరఖాస్తులు
- నిరుపేద కుటుంబాల యొక్క కవరేజ్

**హక్కు**
- కంపల్సరీ తిరిగి ఇవ్వబడని ఫీజులు (ట్యూషన్ ఫీజు కలిపి)
- సంవత్సరానికి రూ. 2500 నుండి 13500 రేంజిగల విద్యా సంబంధమైన అలవెన్స్
- దివ్యాంగ (ప్రత్యేక సామర్థ్యం) విద్యార్థులకు 10% అదనపు అలవెన్స్

- విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్ర స్కాలర్‌షిప్ పోర్టల్స్‌పై దరఖాస్తు పెట్టుకోవడానికి
- విద్యార్థులు చెల్లుబాటైన ఒక మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (UID), ఆధార్ సీడెడ్ బ్యాంక్ అకౌంట్, ఆదాయపు సర్టిఫికెట్ మరియు కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండవలెను

ఇప్పుడే దరఖాస్తు చేయండి

- పథక మార్గదర్శకాలు మరియు వివరమైన అర్హతా ప్రమాణం క్రింద పేర్కొనబడిన లింక్‌పై అందుబాటులో ఉన్నాయి

cbc38101/11/0039/2425


# OFFICE OF THE DEPUTY COLLECTOR AND COMPETENT AUTHORITY (NSEL)

1ST FLOOR, D.D.BUILDING OLD CUSTOM HOUSE, MUMBAI – 400001

## PUBLIC NOTICE FOR E-AUCTION FOR SALE OF IMMOVABLE PROPERTIES MODIFICATION OF THE NOTICE OF SALE & BID DOCUMENT DATED January 17, 2025

Pursuant to the attachment before the SUPREME COURT COMMITTEE comprising JUSTICE (RETD) PRADEEP NANDRAJOG constituted by the order dated 04.05.2022 by the **HON'BLE SUPREME COURT of INDIA** IN W.P.(C) NO. 995/2019 dated 06.01.2025, under the directions of the Supreme Court Committee (hereinafter referred to as "SCC") has engaged **Quikr Realty Pvt Ltd** (hereinafter referred to as "the Agency") to assist in the sale of the properties attached and made absolute through e-auction on **"as is where is and whatever there is basis"**.

Subsequently, The SCC vide order dated 06.01.2025 directed that the process of sale may be started by The Competent Authority-NSEL (hereinafter referred to as CA) through E-auction. As per the directions of the SCC, Quikr Realty have been engaged by CA to assist in the sale of the properties.

A Notice for e-auction has been published on 17, January 2025 and the CA has invited bids from the intending bidders along with a bid deposit. In the notice published the Area, EMD Deposit, Bid Increase Amount & Reserve Price of the properties are changed as follows:

**Short description of the property:**

**Telangana**

| S. No. | Location | Address | Area | EMD Deposit (in INR) | Last Date of submission of EMD | Date of Auction | Bid Increase Amount (In INR) | Reserve Price (in INR) |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Telangana | Residential premises bearing Plot No 9, D No. 293/82/NGG, Survey No.403/1,Block No.8-2, Nandagirihills, Jubilee Hills-I, Hyderabad | 360 Sq Yards or 301 Sq Mtrs. | 64,80,000/- | 17th February 2025 up to 5:00pm | 19th February 2025, 11.00 am to 12.00 pm | 6,00,000/- | 6,48,00,000/- |

The interested parties/ bidders are hereby informed to observe this change and participate accordingly.

All other terms and conditions of the e-auction notice of sale and e-Bid documents shall remain the same.

Place: Mumbai

Date: February 09, 2025

Deputy Collector and Competent Authority (NSEL) Mumbai

కుల గణనపై రాజకీయ దుమారం రేగుతోంది. కుల,మత, ప్రాంత వైషమ్యాలు లేని తెలంగాణ రాష్ట్రంలో కుల గణన కొత్తగా కులాల కుంపట్లు పెట్టినట్టు అవుతుంది. గత ప్రభుత్వ హయంలోని సమగ్ర కుటుంబసర్వే, ప్రస్తుత కులగణనసర్వే రెండు సర్వేలగురించి వాటి మధ్యఉన్న వ్యత్యాసాల గురించిప్రజల్లో ఉన్నఅపోహల్ని తొలగించే ప్రయత్నం చేయాలి. 2014 సర్వేలో బీసీ జనాభా శాతంలో ముస్లిం, మైనార్టీ జనాభాశాతాన్ని లెక్కించకుండా ఓసీ జనాభాశాతం 21ఉంటే అందులో నుండి13ముస్లిం మైనార్టీలను తీసేసి ఓసీ జనాభా పదిశాతంలోపు మాత్రమే అని ప్రచారం చేస్తున్నారు. అయితే అది వాస్తవ దూరమని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఓసీల్లో ఉన్నముస్లిం,మైనార్టీల జనాభా శాతాన్ని తీసివేసినప్పుడు, బీసీల్లో ఉన్న ముస్లిం, మైనార్టీల (బీసీఈ)జనాభా శాతాన్ని తీసి వేసినపుడే అసలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది. 2024కులగణన సర్వేలో బీసీజనాభా ముస్లిం మైనార్టీలను మినహాయించి 46.25 ఓసీ జనాభా 13.31.వాస్తవానికి బీసీజనాభా శాతం ఎక్కువగా ఉంటుందని కొంతమంది, లేదు ముస్లిం, మైనార్టీలను మినహాయించి ఓసీ జనాభా ఎక్కువగా ఉంటుందని కొన్ని కుల సంఘాల వారు వాదిస్తున్నారు. ఎవరికీ ఇష్టం వచ్చినట్టువాళ్లు మాట్లాడుతుంటే ప్రభుత్వం చేసిన ఈబృహత్తర కార్యక్రమంబూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అందుకే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలి. వివరాలపై ప్రజల్లో ఉన్నఅనుమానాలను నివృత్తి చేయాలి. ప్రజల్లో ఉన్న అపోహలుతొలగించి, ప్రభుత్వమే ఈ వివాదానికి తెరదించాలి. తమ పరిధిలో ఉన్న అన్నిఅంశాలను పరిగణనలోకి తీసుకుని బీసీలకు న్యాయంచేస్తామనిచెబుతూ పంచాయితీ ఎన్నికలకు వెళ్లాలనేది కాంగ్రెస్ ప్లాన్. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీ వైపు జనం మొగ్గుచూపుతారా లేదా అన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# కుల గణనపై దుమారం

**సిహెచ్ వి వి రఘుబాబు**

బీసి రిజర్వేషన్ల రచ్చ తెలంగాణ పాలిటిక్స్‌లో హీట్ క్రియేట్ చేస్తోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసిన కుల గణన నివేదికలకు తీవ్ర వ్యత్యాసం ఏర్పడంతో రాష్ట్ర ప్రజల్లో గందరగోళం ఏర్పడింది. అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామని, కులాల లెక్కలు తేలుస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అందుకు తగ్గట్లుగా కులగణన సర్వేచేసింది. కానీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్ల పెంపు పాజిబుల్ అయ్యేలా కనిపించడం లేదు. అయితే సాధ్యమైనంత త్వరగా స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకుంటోంది ప్రభుత్వం. అందుకే ఇప్పుడు రిజర్వేషన్స్ ఇష్యూ హాట్ టాపిక్ అయింది. మరోపక్క తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో రాష్ట్రంలో బిసి జనాభా 46.25 శాతమని తేల్చారు. ముస్లిం మైనార్టీలకు చెందిన బీసీలు 10.08 శాతంగా ఉన్నారని నివేదిక చెబుతోంది. అంటే తెలంగాణలో మొత్తం బీసీల జనాభా 56.33శాతంగా తేలింది. ఇక తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్నాక మొదటిసారి 2014లో బిఆర్ఎస్ హయంలో ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే జరిగింది. ఈ సర్వేలో దాదాపు 3.63 కోట్ల జనాభా ఉన్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఇందులో సామాజిక వర్గాల వారీగా జనాభా శాతం చూస్తే ఓసి21, బీసీ51, ఎస్సీ18, ఎస్టీ10 శాతంగా తేల్చగా, ఇందులో ముస్లిం, మైనార్టీలు దాదాపు 14 ఉన్నట్టు తెలిపింది. ఇందులో కూడా బీసీ, ఓసీలు ఉంటారు. కానీ ప్రత్యేకంగా ముస్లిం మైనార్టీ బీసీ, ముస్లిం మైనార్టీ ఓసీలని ప్రత్యేకించి చెప్పలేదు. ఈ సర్వే నివేదికతో తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణనను బేరీజు వేసుకుంటే కొన్నివర్గాల జనాభ తగ్గడంతో ఈ సర్వేలు ప్రజలు, రాజకీయ పార్టీల్లో గందరగోళాన్ని కలిగిస్తున్నాయి. ఇకకాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన సమయం వచ్చింది. కానీ సుప్రీంకోర్టు తీర్పుప్రకారం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. అంటే ప్రస్తుతమున్న 22 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచడానికి వీల్లేదు. ఇక్కడే కాంగ్రెస్ ప్రభుత్వం ఓ స్ట్రాటజీని ఫాలో అవుతోందనేది అర్థమవుతోంది. బీసీ రిజర్వేషన్లను పెంచుకునేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించనుంది. అప్పుడు బీసీ రిజర్వేషన్ల బాల్ బీజేపీ సర్కార్ కోర్టులోకి వెళ్తుందని, తమ పరిధిలో ఉన్నంత వరకు చేశామని ప్రజలకు చెప్పుకోవచ్చని కాంగ్రెస్‌ప్లాన్ అనే చర్చ సాగుతోంది. ఇదే సమయంలో 42శాతం బీసీ రిజర్వేషన్ హామీని చట్ట పరంగా కాకుండా, పార్టీ పరంగా నిలబెట్టుకుంటామని సీఎం



రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో 42శాతం సీట్లు డెడికేటెడ్‌గా బీసీలకే ఇచ్చి మాట నిలబెట్టుకుంటామంటున్నారు. అయితే ఇది స్థానిక సంస్థల వరకే పరిమితమా లేక అసెంబ్లీ, పార్లమెంట్ ఇతర ఎన్నికలకు కూడా పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టికెట్లు ఇస్తారా అనేదానిపై మాత్రం స్పష్టత లేదు. ఇక మిగతా పార్టీలు కూడా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే ఉన్న 22 శాతం రిజర్వేషన్ ప్రకారం ఆ సీట్లు బీసీలకు ఇస్తూనే, జనరల్ స్థానాల నుంచి మరో 20శాతం సీట్లు బీసీ కోటాలో చేర్చేలా ఆలోచనచేస్తోంది. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పరంగా 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాకపోయినా పార్టీపరంగా ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చామని చెప్పుకోవాలన్నది రేవంత్ సర్కార్ ఆలోచన. తాము బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వడానికి రెడీగా ఉన్నాం మీ సంగతి ఏంటంటూ బీఆర్ఎస్, బీజేపీపై ఇప్పటికే సీఎం సవాల్ చేశారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు పెంచాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని కేంద్రంలో తమ ప్రభుత్వం లేదు. కాబట్టి ఇప్పుడు అది సాధ్యం కాదని ప్రజలకు చెప్పాలనుకుంటూనే, పార్టీ పరంగా 42శాతం బిసిలకు స్థానికసంస్థల టికెట్లు ఇచ్చి కామారెడ్డి డిక్లరేషన్‌ను తు.చ తప్పకుండా అమలు చేశామని చెప్పేందుకు సిద్ధమవుతోంది. మరోపక్క దేశవ్యాప్తంగా సగటున ప్రతి జనాభా లెక్కల్లో 13 పెరుగుదల కనిపిస్తుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ కులగణన లెక్కల్లో మాత్రం బీసీ జనాభా తగ్గినట్లు, ఓసి జనాభా పెరిగినట్లు కన్పిస్తుండటంతో వివాదం చెలరేగింది. అయితే ఇందులో ఒక లాజిక్ ఉందంటున్నారు అధికారులు. 2014లో సకుటుంబ సర్వే ఫలితాల్లో మొదటగా ముదిరాజ్, 2వ స్థానంలో మున్నూరు కాపు, 3వ స్థానంలో గౌడ, 4వ స్థానంలో యాదవ సామాజిక వర్గాలున్నాయి. కానీ ఇప్పుడు మాత్రం మున్నూరుకాపు సామాజిక వర్గం 4వ స్థానంలో ఉందనేది అనధికార సమాచారం. ఇందువల్లనే మొత్తం బీసీలు తగ్గిపోయారనే వాదన ఉంది. కాపులు గతంలో ఓసీ కేటగిరీలో ఉండేవాళ్లు. ఇప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్‌లో కాపులు ఓసి క్యాటగిరీలోనే ఉన్నారు. 1950 తర్వాత తెలంగాణలో మున్నూరు కాపులోని కొన్ని వర్గాలను గుర్తించి బీసీలలో చేర్చారు. ఇప్పటికీ తెలంగాణ పల్లెల్లో మున్నూరు కాపులకు, రెడ్లకు పెద్ద తేడా ఉండదు. దీంతో మున్నూరు కాపులు చాలామంది రెడ్డి అని పేరు వెనకాల తగిలించుకున్నారు. తాజాగా జరిగిన సర్వేలో రెడ్డి అనే పేరు చివరి అక్షరాన్నిచూసి వాళ్ళందరినీ సర్వేయర్లు ఓసి జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. రెడ్డి అని పేరుచివర్లో తగిలించుకున్న వారంతా మున్నూరు కాపులే అయి ఉండడంతో వారి జనాభా తగ్గిపోయింది. కానీ సాంకేతికంగా పేరు చివర రెడ్డి ఉన్న వాళ్లంతా బీసీ సర్టిఫికెట్ పొంది ఉన్న మున్నూరు కాపు సామాజిక వర్గం. సర్వే చేసేందుకు వెళ్లిన సర్వేయర్లకు ఈ విషయం పూర్తిస్థాయిలో తెలియకపోవడంతో వారిని ఓసిక్యాటగిరీలో చేర్చారు. ఇందువల్లనే తెలంగాణలో బీసీ జనాభా తగ్గి ఓసి జనాభా పెరిగినట్లుగా కనిపిస్తుంది అనేది ఒక ప్రచారం. అసలు మొత్తం జనాభా తగ్గింది అనేది మరో ఆరోపణ. ఇందులో కూడా ఓటర్ లిస్టును ఇప్పుడున్న కులగణన సర్వేతో పోల్చిచూడడం వల్ల వస్తున్న ఇబ్బంది అని కొంత మంది అధి కారులు చెబుతున్నారు. ఇక బీసీల్లో బీసీ ఏ, బీసీ బి, బీసీడి లు మాత్రమే హిందూ బీసీలు. బీసీ సి వర్గంలో ఎస్సీ సామాజిక వర్గంలోని ప్రజలెవరైనా క్రైస్తవ మతంలోకి వెళ్తే వారు బీసీ సి కింద పరిగణింపబడతారు. బీసీ ఈలోముస్లిం, మైనార్టీల్లో సామాజిక, ఆర్థిక వెనకబాటు ఉన్నవారు వస్తారు. దాదాపుగా బీసీ ఏలో 68 కులాలు, బీసీ బిలో 28 కులాలు, బీసీ సీలో ఒకటి, బీసీ డిలో 51 కులాలున్నాయి. ముస్లిం మైనార్టీలకు సంబంధించి బీసీలైన బీసీ ఈ వర్గంలో 14 కులాలు ఉన్నాయి. మొత్తంగా బీసీ సామాజిక వర్గంలో 162 కులాలు ఉన్నాయి. ఇప్పుడు పదేళ్ల తర్వాత 2024లో జరిగిన కులగణన సర్వేలో పాల్గొన్న మొత్తం జనాభా 3.54 కోట్లు అయితే సర్వేకు దూరంగా ఉన్న జనాభా దాదాపు 16 లక్షలని ప్రభుత్వం తెలిపింది. అంటే మొత్తం జనాభా 3.70 కోట్లు. 2011 జనగణనలో తెలంగాణ జనాభా 3.51 కోట్లు. 2014 నాటికి సమగ్ర సర్వేలో పెరిగిన జనాభా 3.63 కోట్లు అంటే దాదాపు మూడు ఏండ్లలో 12 లక్షలు పెరిగింది. అంటే ఏడాదికి సగటున 4 లక్షల జనాభా పెరిగింది. ఈ సగటును పరిగణనలోకి తీసుకున్నా 2014 నుండి 2024 వరకు జనాభా దాదాపు 35 40 లక్షలు పెరగాలంటే 4 కోట్లకు పైగా ఉండాలి. కానీ లక్షల్లో జనాభా తక్కువగా నమోదైంది. అంటే సర్వేలో పాల్గొన్నది 97 శాతం కాదు. అంత కంటే తక్కువే. దాదాపు 56 మంది ప్రజలు సర్వేకు దూరంగా ఉండి ఉంటారు. ఇదే సమయంలో రాష్ట్రంలో గతంతో పోలిస్తే బీసీ జనాభా పెరిగిందని కులగణన సర్వేపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో 51.09 గా నమోదైన బీసీ జనాభా శాతం ఇప్పుడు 56.33కు పెరిగినట్లు లెక్కలు చెప్పారు. అలాగే షెడ్యూల్డ్ జనాభా 9.8నుండి 10.45కు, ఇతర కులాల జనాభా 21.55 నుండి 15.79 కు తగ్గిందని తేల్చారు. ఏది ఏమైనా ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇచ్చే వరకూ బీసీ జనాభాపై ఆందోళన తగ్గే అవకాశం కనిపించడం లేదు. ●

# 'కల్లల' దారిలో..

పంజాబ్

జీవితం కొత్త బంగారు లోకంలా మారుతుందని కన్న కలలు ఒక్కక్షణంలో పగిలిపోయాయి. ఏదో విధంగా అమెరికా చేరితే అక్కడ కనీసం ఏ హోటల్ లోనో, ఫాంహౌస్‌లోనైనా పనిదొరకకపోతుందా! అనే ఆశతో అడ్డదారులగుండా వెళ్లి హాయిగా బతకొచ్చునుకొన్న చాలా మంది చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేయించుకొని 'ప్రత్యేక సైనిక విమానం'లో తిరిగి వచ్చారు. వాళ్లని అలా తోసేసింది అమెరికాప్రభుత్వం. ట్రంప్‌తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొన్న అనేకానేక 'విపరీత చర్యల'లో ఇది ఒకటి. అన్ని అనుమతులు, అధికార పత్రాలతో వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకొని ఇక అక్కడ స్థిర పడతామనుకొన్న వారికి కూడా ఆందోళనకర పరిస్థితి ఏర్పడుతున్నప్పుడు అడ్డదారిలో, అక్రమంగా అమెరికా చేరుకొన్న వారి పరిస్థితి ఎలా ఉంటుంది? నయవంచన చేసే ఏజెంట్లకు 20 నుంచి 80లక్షల దాకా సమర్పించుకొని అక్రమంగా అమెరికా చేరిన భారతీయులు దాదాపు 18 వేల మంది ఉన్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. వారందరిని వెనక్కి పంపడం కోసం అమెరికా ప్రభుత్వం కంకణం కట్టుకొంది. అలాగే మరికొన్ని దేశాల నుంచి అక్రమంగా వలసవచ్చిన వారిని కూడా. అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించడానికి అడ్డదారులు చూపిన ఏజెంట్లు దాదాపు 12వేల కోట్లు జేబులో వేసుకొన్నట్లు తెలుస్తోంది. ఒక్క పంజాబ్‌లోనే ఎనిమిదివేల మంది యువకులు దాదాపు నాలుగువేల కోట్ల రూపాయలు పోగొట్టుకున్నట్లు సమాచారం. గత బుధవారం (5,ఫిబ్రవరి) అమృతసర్‌లో వాలిన అమెరికా 'లోహ విహంగం' లోంచి 104మంది అక్రమవలసదారులు వెర్రిముఖాలు వేసుకొని దిగారు. వారిలోచాలా మంది చేతులకు, కాళ్లకు సంకెళ్లు కనిపించాయి. విమానంలో కదలడానికి కూడా అవకాశం లేకుండా వారిని కూర్చోబెట్టారుట. అమెరికా దృష్టిలో వారు తప్పుచేసినవారైతే కావచ్చు! కానీ వాళ్ల మనుషులే కదా! అమృతసర్‌లో దిగిన 'సి–17' ఒక సైనిక విమానం. ఆ విమానంలో సంకెళ్లు వేసి పంపించిందంటే 'బందీ'లుగా వారిని పరిగణించిందని అర్థం. అంటే బందీలకు ఎలాంటి 'శిక్ష'లు వేస్తారో వారు కూడా అవన్నీ అనుభవించి వచ్చారన్నమాట. కొన్ని లక్షలు పోగొట్టుకుని

**ఎ.వి.వి ప్రసాద్**

అక్కడికి వెళ్లడమేకాక, ఎంతో దీనావస్థలోఅక్కడి నుంచి వచ్చారంటే వారి జీవితం ఎంత దుర్భరంగా మారిందో చెప్పడానికి ఇంకేం కావాలి! 15 లక్షల మంది ఇతర దేశాల వారిని ఇలాపంపించి వేయడానికి అమెరికా రూపొందించిన వ్యూహంలో ఇదొక అంకం మాత్రమే. అమెరికాలో అక్రమవలసదారులు ఎంతమంది ఉన్నారనే అంశంపై రకరకాల లెక్కలు చెబుతున్నారు. రోజుకోకథ చెబుతున్నారు. మొత్తం అక్రమ వలస దారులు 7.25లక్షలని మరోలెక్క. దాని ప్రకారంభారతీయుల సంఖ్యకూడా పెరుగుతుంది. రానున్న రోజుల్లో అటువంటి 'విమానాలు' మరికొన్ని మన ఎయిర్ పోర్టుల్లో దిగవచ్చు. మొన్న అమృత్ సర్‌కు వచ్చిన విమానం లో పంజాబ్‌కు చెందిన వారు 30మంది



సైనిక విమానం

ఉండగా, హర్యానా–33, గుజరాత్–33, మరికొన్ని రాష్ట్రాల వారుఉన్నారు. వారిలో కొందరు మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. నిజానికి ఇది మొదటిసారికాదు. అక్రమ వలసదారులంటూ ముద్రవేసి గతంలో కూడా వందల సంఖ్యలో భారతీయుల్ని వెనక్కిపంపిన సందర్భాలున్నాయి. గత అక్టోబర్‌లో 100 మంది అమెరికా నుండి తిరిగొచ్చారు. అంతకుముందు 2023 అక్టోబర్ నుంచి గత సెప్టెంబర్ దాకా 1100మందిఅక్రమ వలసదారులు వెనక్కి వచ్చారంటే నిత్యం ఎంత మంది అక్కడికి అక్రమంగా చేరుతున్నారో అర్థం చేసుకోవచ్చు. దీనంతటికి ప్రధాన కారణం దళారులు. వారు చెప్పేమాటలు నమ్మే అమాయకులు. ఉన్న కాస్త ఇల్లు, కొద్దిపాటి పొలం అయిన కాడికి అమ్మేసి, దళారుల మాటలు నమ్మి వారి వెనుక అమెరికా వెళ్తున్నవారే ఎక్కువ. కొడుకులు అమెరికావెళ్తే బాగా డబ్బుసంపాదించి తమ కష్టాలు తీరుస్తారనే గంపెడాశతో ఉన్న ఆస్తులన్నీ కుదువబెట్టి పంపించే తల్లిదండ్రులే ఎక్కువ మంది. టెన్త్ పాసవ్వగానే చాలా మంది ఈ ఏజెంట్ల చేతిలో పడుతు న్నారు. పేదరికంలో మగ్గుతున్నవారిని దళారులు తేలికగా ఆకర్షించి రకరకాల మార్గాల ద్వారా అమెరికా చేరుస్తున్నారు. వారిదగ్గర ఎటువంటి అనుమతులు, అధికార పత్రాలు ఉండవు. వాటి గురించి తెలియనివారే వారిలోఎక్కువ. రకరకాల అడవి మార్గాల ద్వారా ప్రయాణించి వారందరిని తీసుకువెళ్తుంటారు. కొంత మంది డ్రగ్స్, దోపిడీ ముఠాలలో చేరి ఆ వక్రమార్గం కూడా పడుతుంటారు. ముఖ్యంగా పనామా, గ్వాటెమాలా, కోస్టారికా వంటి దేశాల నుంచి అమెరికాకు అక్రమంగా చేర్చడానికి ఏజెంట్లు ప్రయత్నిస్తుండగా, మార్గమధ్యంలో వారిలో కొందరు యువకులను డ్రగ్స్ ముఠాలు ఆకర్షించి తమతో చేర్చుకుంటాయి. ఎంతో ప్రతికూల వాతావరణం ఎదురైనా ఎలాగోలా అమెరికా చేరుతామనే ఆశవారిని ముందుకు నడిపిస్తూఉంటుంది. తీరాఅక్కడికి చేరాక ఏజెంట్లు వదిలే యడంతో దిక్కుతోచని పరిస్థితిలోపడి బిచ్చమెత్తుకునేస్థాయికి చేరుకుంటారు. కొందరు అలవాటైనదోపిడీలు, అక్రమపనులకు పాల్పడుతూ పోలీసులకు దొరికిపోయి జైళ్లపాలవుతుంటారు. ఉన్నతవిద్య కోసం కెనడా, అమెరికా వెళ్లినదాదాపు 20వేలమంది భారతీయ విద్యార్థులు అక్కడ కళాశాలల్లో చేరలేదని ఇటీవల ఓ నివేదిక వెల్లడించింది. మరి వారంతా ఏమయినట్లు? పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నామంటూ చెప్పేకొందరు నేరస్తులుగా మారినట్లు వార్తలు వినిపిస్తుంటాయి. ఇటువంటి విచారకర ఘటనలు అనేకానేకం. అమెరికాను ఒక భూతల స్వర్గంగా భావించేవారు ఉన్నంతవరకు ఇలాంటి ఘోరమైనపరిస్థితులే ఏర్పడుతుంటాయి. సగటు భారతీయుడు అమెరికా కలలుకంటూ కూర్చుంటే ముందు ముందు ఇంకా ఘోరమైన ఉదంతాలు వినవలసి వస్తుందేమో! సురక్షితమైన వలసలను ప్రోత్సహించేలా కేంద్రం పటిష్టమైన చట్టం రూపొందిస్తే కొన్నివేలమంది భారతీయులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పుడున్న చట్టాలను చాలా మెరుగుపరచవలసి ఉంది. ●

# ప్రధానికి ఎన్నికల పరీక్ష

కొసావో

ఆగ్నేయ యూరోప్‌లోని చిన్న దేశం ఆ ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతోంది. నాలుగేళ్ల క్రితం అద్వితీయ మెజార్టీతో గెలిచిన ప్రస్తుత ప్రధాని ఆల్బిన్ కుర్తి మళ్లీ తన అదృష్టం పరీక్షించుకోనున్నాడు. ఎన్నికల బరిలో మరో ఇద్దరుముగ్గురు నిలిచినా ప్రధానంగా కుర్తిపేరే ఎక్కువ వినిపిస్తోంది. పాలనాపరంగా సంస్కరణలు తీసుకురావడంతోను పొరుగుననే ఉన్న సెర్బియాతో ఉన్న వివాదాలను పరిష్కరించుకునే దిశగా ఆయన వేసిన అడుగులు అక్కడి ప్రజలను ఆకర్షించాయి. తొమ్మిదో తేదీ జరిగే ఎన్నికలు ఆ దేశ సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. 2008లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న తర్వాత ప్రపంచ దేశాలు ప్రత్యేకించి ఐక్యరాజ్యసమితి కూడా గుర్తించిన ఈ దేశాన్ని సెర్బియా మాత్రం గుర్తించలేదు. ఎందుకంటే మెజార్టీ ప్రాంతాలన్నీ సెర్బియా భాష మాట్లాడే ప్రజానీకమే ఎక్కువ నివసిస్తుంటారు. యూరోప్ కూటమిలో ఎగువ మధ్యతరగతి కేటగిరీ దేశంగా గుర్తించినాకొసావో ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం అత్యంత పేద దేశంగానే కొనసాగుతోంది. మొత్తం 26రాజకీయ పార్టీలు ఒక స్వతంత్ర అభ్యర్థి తమతమ అభ్యర్థులను ఎన్నికల్లో పోటీకి దించాయి. మొత్తం 120 మందిని పార్లమెంటుకు ఎన్నుకోవడం ఆపై మెజార్టీ సాధించిన పార్టీకి అధికార పగ్గాలు కట్టబెట్టడం రివాజుగానే వస్తోంది. సెర్బ్ మైనార్టీలకు పది, మరో పది ఇతర మైనార్టీలకు స్థానాలు రిజర్వుచేసారు. కొసావోకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పూర్తికాలం పనిచేసిన పార్టీగా అల్బిన్ కుర్తి పార్టీకి పేరుంది. అందువల్లనే ఈసారికూడా పాలనా పగ్గాలుచేపట్టే దిశగా ఆయన వ్యూహాలు అమలు చేస్తున్నారు. అల్బేనియా, మాంటెనెగ్రో, సెర్బియా, ఉత్తర మెసిడోనియా దేశాలు సరిహద్దులుగా ఉన్న ఈ చిన్నదేశంలో ఈ సరిహద్దు దేశాల ప్రభావం కూడా ఎక్కువగానేకనిపిస్తుంది. 18 లక్షల జనాభా ఉన్న ఈ దేశ జిడిపి 9.4 బిలియన్ డాలర్లుగా ఉంది. యూరో కరెన్సీనే వినియోగిస్తున్న ఈదేశం స్వతంత్రంగా ఆవిర్భవించిన తర్వాత ఇప్పుడు ఐరోపా కూటమిలో సభ్యత్వం తీసుకోవాలని నిర్ణయించుకుంది. దేశంలో రాజకీయ అనిశ్చితిని పారద్రోలి ఏకపార్టీ పాలననే తీసుకురావాలన్న లక్ష్యంతో కుర్తి

**గన్ని మోహన్**

ఎన్నికల బరిలో నిలిచారు. అల్బేనియా వేర్పాటువాదులు, సెర్బియా ప్రభుత్వదళాల మధ్యఏడాది కాలంపాటు జరిగిన యుద్ధం తర్వాత జరుగుతున్న పార్లమెంటు ఎన్నికలుకావడంతో ఇప్పుడు ఇరుగుపొరుగు దేశాలకు సైతంవీటిపై ఆసక్తి పెరిగింది. వామపక్ష వెటెవెండోస్తే పార్టీ అధినేతగా కుర్తీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక ఇతరత్రా డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావో పిడికే దేశంలోని అత్యంత పురాతన పార్టీ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ కొసావో ఎల్డీకే ఈ రెండూ కూడాకుర్తీ వామపక్ష పార్టీకి గట్టిపోటీఇస్తున్నాయి. వీటిలో పిడికే పార్టీనాయకులకు యుద్ధ నేరాలకు పాల్పడినట్లు అంతర్జాతీయ న్యాయ స్థానంలో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇక



అల్బిన్‌కుర్తి

మరోపార్టీ ఎల్డీకే నేత ఇబ్రహీం రుగోవా 2006 లో మరణించిన తర్వాత ఆపార్టీకి ప్రాభవం తగ్గిపోయింది. పింఛన్లు పెంచుతామని, విద్య, ఆరోగ్య సేవలు సమూలంగా ప్రక్షాళనచేసి మరింతచేరువ చేస్తామని ఉద్యోగుల జీతభత్యాలు కూడా పెంచుతామని వాగ్దానాలు చేస్తున్నాయి. అయితే ఇందుకు నిధులు ఎలా సమకూరుస్తారు. ఎక్కడినుంచి తెస్తారు అన్న వివరాలేమీ లేకపోయినా కొసావోలో మెరుగైన జీవితాన్ని ఇస్తామని మాత్రం అటు పిడికె, ఇటుఎల్డీకే పార్టీలు ముమ్మర ప్రచారంతో దూసుకువస్తున్నాయి. దేశంలోని ప్రతినగరంలోను, ప్రతి కుటుంబంలోను తమ పార్టీకి మెరుగైన మద్దతు కనిపిస్తోందని భావిస్తున్నా చివరినిమిషంలో కుర్తికే ఎక్కువ అవకాశాలుంటాయని సర్వేలు చెపుతున్నాయి. విదేశీ సాయంపై ఎక్కువ ఆధారపడిన ఈ దేశానికి ఇప్పుడు ట్రంప్ రద్దుచేస్తానని చెపుతున్న యుఎస్ ఎయిడ్ సంస్థ నుంచి 200 కోట్ల డాలర్లవరకూ పెట్టుబడులసాయంఅందింది. అయితే కుర్తీ మాత్రం సెర్బియన్ దినార్ కరెన్సీ వినియోగంపై నిషేధం ప్రకటించారు. దీనితో ఐరోపాకూటమి రెండేళ్ల క్రితం కొన్ని ప్రాజెక్టులకు నిధులు కూడా నిలిపివేసింది. తాత్కాలికఆంక్షలు, చర్యలను పక్కనపెట్టి ఎన్నికలపై దృష్టికేంద్రీకరించిన కుర్తీ భవిష్యత్తు ధోరణి ఎలా ఉంటుందన్న దానిపై సెర్బ్ మైనార్టీలు ఎక్కువ ఆసక్తిచూపుతున్నారు. ఉత్తరప్రాంత సెర్బ్‌మైనార్టీల పట్ల అనుసరించే వైఖరిని స్పష్టం చేయాలంటూ అమెరికా, యూరోపియన్‌కూటమి ఒత్తిడితెస్తున్నాయి. ఈయూతో భాగస్వామ్యం పునరుద్ధరించుకోడానికి కొత్తప్రభుత్వం నిర్మాణా త్మక చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఆ దిశగానేవచ్చే ప్రభుత్వానికి మద్దతు కూడాఉంటుందని ఐరోపా కూటమి తెగేసి చెప్పింది. సెర్బియాతో సత్సంబంధాలు నెలకొల్పేందుకు రెండుదేశాల మధ్య సాధారణ స్థితిరావాలని అటు ఐక్యరాజ్యసమితితోపాటు యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాలు అభిలషిస్తున్నాయి. షరతుల్లో భాగంగా సెర్బ్‌జనాభా మెజార్టీ ఉన్న మున్సిపాలిటీలకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకివస్తోంది. ముందు సెర్బియా తమదేశాన్ని గుర్తించినట్లు అధికారిక ప్రకటన చేసిన తర్వాతనే ఎలాంటి చర్చలైనా అనిప్రధాని కుర్తీ తెగేసి చెపుతున్నారు. ఈతరుణంలో జరు గుతున్న ఎన్నికలు ప్రపంచ దేశాలను ఆకర్షిస్తు న్నాయి. అంతేకాకుండా ఈ ఎన్నికలను పరిశీ లించేందుకు యూరోపియన్ యూనియన్ నుంచి 100 మంది పరిశీలకుల బృందం, యూరోప్ మండలినుంచి 18 మంది, అంతర్జాతీయంగా ప్రపంచస్థాయి సంస్థలనుంచి మరికొందరితో కూడిన ప్రతినిధుల బృందం తొమ్మిదోతేదీ జరిగే ఎన్నికలను పరిశీలించి నివేదికలు ఇస్తుంది. ఆ తర్వాతనే ఎన్నుకునే ప్రభుత్వాన్ని, దేశాన్ని యూరోపియన్ యూని యన్ ఐక్యరాజ్యసమితిలు ప్రత్యేక గుర్తింపు నివ్వడంతోపాటు సభ్యత్వం ఇస్తాయని తెలుస్తోంది. అందువల్లనే ఇప్పుడు కొసావోకు జరిగే ఈపార్లమెంటు ఎన్నికలు అక్కడిప్రజలకు అధికార పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకం అయ్యాయి. ●

# ప్లాస్టిక్ విష వలయంలో ప్రపంచం..



సుంకవల్లి సత్తిరాజు

పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో ఒకటి. ప్లాస్టిక్ వాడకం అత్యంత ప్రమాదకరమైన సమస్యగా మారిన నేపథ్యంలో పర్యావరణానికి పెను ప్రమాదం ఏర్పడింది. ప్రకృతి, పర్యావరణం, వాతావరణ మార్పులు, కాలుష్యం, భూతాపం వంటి సమస్యలపై దశాబ్దాల తరబడి అనేక అంతర్జాతీయ సంస్థలు పోరాడుతూనే ఉన్నాయి. కాని వీటిన్నింటినీ తలదన్నే విధంగా జనవాహినిలోకి నిశ్శబ్దంగా చొచ్చుకొచ్చిన ప్లాస్టిక్ భూతం తన పంజా విసిరి, సకల జీవరాశుల మనుగడపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది. పర్యావరణ సమస్యలకు, వాతావరణంలో అవాంఛనీయమైన మార్పులకు ప్లాస్టిక్ వాడకం కారణం కాబోతున్న విషయం ప్లాస్టిక్ ఉత్పత్తులు ప్రారంభమైన తొలిదశలో అంతగా ఎవరూ పట్టించుకోలేదు. కాని రానురాను ప్లాస్టిక్ వాడకం“ ఇంతింతై వటుడింతై...“అన్న మాదిరిగా పెరిగి పెద్దదై మానవాళితోపాటు, ఇతర జీవరాశుల మనుగడను మట్టుబెట్టడానికి సంసిద్ధంగా ఉంది. ఇంతటి ప్రధానమైన సమస్యను ఈనాటికీ ప్రపంచం సరిగా గుర్తించకుండా నాన్పుడిధోరణి అనుసరించడం భవిష్యత్తును విస్మరించడమే కాగలదు. ప్లాస్టిక్ వలన జీవవైవిధ్యం దెబ్బతింటున్నది. పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్లాస్టిక్ వలన ఏర్పడే గ్రీన్ హౌస్ ఉద్గారాల వలన వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. భూతాపంలో కూడా ప్లాస్టిక్ ప్రధాన భూమిక పోషించడం ఆందోళనకరం. సముద్రాల్లో సుమారు 200 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్టు కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. ఏటా సముద్ర జలాల్లో కోటి టన్నుల ప్లాస్టిక్ కలుస్తుందని ఒక అంచనా. ఇలా ఉండగా కొన్నిసర్వేల ప్రకారం సముద్రాల్లో 5 ట్రిలియన్లకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలున్నాయని, ఈ సంవత్సరం ఈ పరిమాణం మూడు రెట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మనం వినియోగించి అవతలపారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు వివిధ మార్గాల్లో తిరిగి తిరిగి మన దగ్గరకే చేరుతున్నాయి. మైక్రోప్లాస్టిక్, నానోప్లాస్టిక్ రూపాల్లో మనం తినే ఆహారంలో కలిసి మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తున్నది. సముద్రాల జలాల్లో కలుస్తున్న ప్లాస్టిక్ వలన సముద్ర జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దట్టమైన మంచులో కూడా అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ పదార్థాలను కనుగొన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సముద్ర జీవుల ఉదరాల్లో ప్లాస్టిక్ ఉన్నట్టు తెలిసింది. మిలియన్ల సంఖ్యలో సముద్ర జీవులు ప్లాస్టిక్ వ్యర్థాల వలన మరణిస్తున్నట్టు తెలిసింది. జల జీవులను ఆహారంగా తినడం వలన మానవాళి అనేక ఆరోగ్యం పరమైన దుష్పరిణామాలను ఎదుర్కోవడం జరుగుతున్నది. చైనా, థాయిలాండ్, ఇండోనేషియా వంటి దేశాలు అత్యధికంగా ప్లాస్టిక్‌ను సముద్ర జలాల్లోకి విడుదల చేస్తున్నాయి. సముద్ర వ్యర్థాల్లో 85 శాతం భాగాన్ని ప్లాస్టిక్ ఆక్రమించింది. ప్లాస్టిక్ వలన ఏర్పడుతున్న అనర్థాలు తెలిసికూడా అనేక దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిని, వినియోగాన్ని, ఎగుమతులను విరివిగా పెంచేశాయి. ఆసియా ప్లాస్టిక్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంది. చైనా, ఇండో నేషియా, జపాన్ మెక్సికో, వియత్నాం వంటిదేశాలు ప్లాస్టిక్ ను అధికంగా వినియోగిస్తున్నాయి. చైనా, ఉత్తర అమెరికా దేశాలు ప్లాస్టిక్‌ఉత్పత్తిలో ముందంజలో ఉన్నాయి. ఇండియా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, రష్యా తదితర దేశాలు కూడా ప్లాస్టిక్ ఉత్పత్తిలో ముందుకు దూసుకుపోతున్నాయి. 2025 నాటికి సముద్రాల్లో కలిసే ప్లాస్టిక్ వ్యర్థాలు 250 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకునే అవకాశముంది. ఒక వైపు ప్లాస్టిక్‌ను వాడకూడదని ప్రభుత్వాలు నియంత్రణ పెడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లను వాడితే జరిమానాలు విధిస్తామని ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వాలేప్లాస్టిక్ ఉత్పత్తులకు అనుమతులు మంజూరు చేస్తున్నాయి. ఎగుమతులు చేస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగించని ప్రభుత్వ కార్యాలయాలంటూ ఉన్నాయా? ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో



పౌరసరఫరాల శాఖలు ప్రజాపంపిణీ వ్యవస్థలో వివిధరకాల వస్తువులకు ప్లాస్టిక్ సంచులనే వినియోగించడం హాస్యాస్పదం. ప్రజలను ప్లాస్టిక్ వాడొద్దని చెబుతూనే ప్రభుత్వాలే ప్లాస్టిక్‌ను వినియోగించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. పర్యావరణంపై పలు అంశాలు తీవ్రప్రభావంచూపుతున్నాయి. ఒకవైపు కాలుష్యం, మరో వైపు చెట్లనునరికి పచ్చదనం లేకుండా చేయడం, ఇంకోవైపు పారిశ్రామిక వ్యర్థాలు పంట పొలాల్లో పురుగు మందులను విచక్షణా రహితంగా వినియోగించడం వలన ప్రకృతిలో ఏర్పడుతున్న ప్రమాదకరమైన మార్పులు తీవ్రమైన కలతకు గురిచేస్తున్నాయి. ప్రకృతి రచయితగా, ప్రపంచ పర్యావరణ ఉద్యమంలో అమెరికాకు చెందిన రాచెల్ లూయిస్ కార్సన్ ప్రసిద్ధి గాంచిన విషయం లోకవిదితమే. జీవావరణం, పర్యావరణం, సముద్రాలను కాలుష్యం నుండి రక్షించడానికి ఉద్యమించిన కార్సన్ తరహాలోనే సుమారు అర్థశతాబ్దం క్రితం అప్పటి అమెరికా సెనేటర్ “గేలార్డ్ ఆంటోన్ నెల్సన్“ పర్యావరణ పరిరక్షణ గురించి, మనం నివసించే భూమి గురించి, మానవ నిర్లక్ష్యం వలన రాబోయే విపత్తుల గురించి ఈ ప్రపంచాన్ని ముందే హెచ్చరించాడు. అతని ఆలోచనలకు, ఉద్యమాలకు ప్రజల్లో మంచి స్పందన లభించింది. గేలార్డ్ నెల్సన్ కోట్లాదిమంది అమెరికన్లతో భారీ పర్యావరణ ఉద్యమాన్ని నిర్మించాడు. మనం నివసించేభూమిని కాపాడుకోవాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రజల్లో అవగాహన కలిగించాడు. పర్యావరణ కార్యశీలతలో కదం తొక్కిన కెరటంగా“ గేలార్డ్ నెల్సన్“ పేరొందాడు. ప్రస్తుత ఆధునిక యుగంలో ఇలాంటి ఉద్యమాలు ఎంతో అవసరం. ముఖ్యంగా ప్లాస్టిక్ వస్తువులు హోరెత్తుతున్న నేటి కాలంలో రాబోయే విపత్కర పరిణామాల గురించి అట్టడుగు స్థాయి వరకు అవగాహన అవసరం. 2050 నాటికి సముద్రాల్లో నివసించే జీవజాలం కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉంటాయని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచంలో సముద్ర కాలుష్యంలో 80శాతం వ్యవసాయ వ్యర్థాలు, పురుగు మందుల అవశేషాల వలన ఏర్పడుతున్నది. దాదాపు వెయ్యిరకాల సముద్ర జీవజాతులు ప్లాస్టిక్ వలన ప్రభావితం అవుతున్నాయి. ప్రపంచంలో సగానికి పైగా జీవజాలం అనుకూల పరిస్థితుల్లో ఈ శతాబ్దాంతానికి అంతరించిపోయే అవకాశముంది. ప్రపంచంలో 60 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలకు సుమారు 12 దేశాలు కారణమవుతున్నాయని కొన్ని సర్వేల వాదన. చైనా, అమెరికా, భారత్, బ్రెజిల్, మెక్సికో దేశాలు అత్యధిక ప్లాస్టిక్ వ్యర్థాలకు కారణంగా పేర్కొంటున్నారు. కోకోకోలా, పెప్సీ వంటి ఉత్పత్తుల వలన ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. చైనా బంగారంలోనే కాదు ప్లాస్టిక్ తయారీలో కూడా ప్రథమ స్థానంలోఉంది. ప్రపంచంలో అత్యధిక ప్లాస్టిక్ తయారీ చేస్తూ కేవలం 17శాతం మాత్రమే రీసైక్లింగ్ చేస్తున్న దేశంగా చైనా పేర్కొనబడుతున్నది. సమస్యను సృష్టించడం సులభం. సమస్యను పరిష్కరించడం చాలాకష్టం. మనకు తెలియకుండానే మనం సమస్యల వలయంలో కూరుకుపో యాం. వీటి పరిష్కారం చేతగాక దాదాపుగా చేతులెత్తేశాం. అయినా పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ, ప్రజలకు అవగాహన పేరుతో తూతూ మంత్రంగా ఏవేవో కార్యక్రమాల ను నిర్వహిస్తూ, ఏదో జరిగిపోవాలని, సమస్యలు పరిష్కా రమైపోవాలనిఆశిస్తున్నాం. ఆధునికంగా జీవించాలనే పేరుతో లేనిపోని అలవాట్లను మనజీవితానికి అన్వయింప చేసుకున్నాం. ప్రకృతిని విధ్వంసం చేసుకున్నాం. పర్యావరణాన్ని చేజేతులా నాశనం చేసుకున్నాం. కాలుష్యాన్ని కొని తెచ్చు కున్నాం. మానవ స్వార్థం జీవవైవిధ్యాన్ని దెబ్బతీసింది. అందమైన ప్రకృతిని అంధవికారంగా మార్చి, వాతావరణాన్ని విష వాయువులతో ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపి, మనం నివ సించే భూగ్రహాన్ని మానవాళి అస్థిత్వానికి అననుకూలంగా మార్చేశాం. భూతల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. గ్లోబల్ వార్మింగ్ ఒక క్లిష్టమైన సమస్యగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో భూఉష్ణోగ్రతలు తగ్గించడానికి కుదిరిన పారిస్ ఒప్పందం నుండిఇటీవల అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం తప్పుకోవడం బాధ్యతారాహిత్యం. మానవ అవసరాల కోసం సృష్టించుకున్న అనేక విధానాలు మానవ విధ్వంసానికి దారితీస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగం నిత్యజీవితంలో పెనవేసుకుపోయింది. వినియోగం ఇలాగే కొనసాగితే భూగోళం ప్లాస్టిక్ నిలయంగా మారి, అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయి. ప్లాస్టిక్ విషవలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న ప్రపంచాన్నికాపాడాలి. ●

# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ బహుమానం!

## 7.4 బిలియన్ డాలర్ల ఆయుధాల విక్రయానికి ఆమోదం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** ఇజ్రాయెల్, గాజా యుద్ధం తాజా పరిస్థితిపై చర్చించడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టెల్‌అవీవ్‌కు అమెరికా భారీ గిఫ్ట్‌ను ప్రకటించింది. అగ్రరాజ్యం తయారుచేసిన 7.4 బిలియన్ డాలర్ల విలువైన బాంబులు, క్షిపణులను ఇజ్రాయెల్‌కు విక్రయించేందుకు ఆమోదం తెలిపింది. అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కో ఆపరేషన్ ఏజెన్సీ (డిఎస్‌సిఏ) ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొంది. 600 మిలియన్ డాలర్ల హెల్‌ఫైర్ క్షిపణులతోపాటు 6.75 బిలియన్ డాలర్ల బాంబులు, మార్గదర్శక కిట్‌లు విక్రయించేందుకు నిర్ణయించినట్లు తెలిపింది. 'ఇజ్రాయెల్ ప్రస్తుత, భవిష్యత్తు బెదరింపులను ఎదుర్కొనేందుకు, దాని మాతృభూమి రక్షణ బలోపేతానికి ఇది ఉపయోగపడుతుంది. సరిహద్దులు, కీలకమైన మౌలిక సదుపాయాల రక్షణకు ఐడిఎఫ్ సామర్థ్యాన్ని ఇది మెరుగుపరుస్తుంది' అని డిఎస్‌సిఏ పేర్కొంది. ప్రస్తుతం నెతన్యాహు అమెరికాలో పర్యటిస్తున్న క్రమంలోనే ఇంత మొత్తంలో ఆయుధాల విక్రయానికి ఆమోదం రావడం గమనార్హం. ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణకు ముందు రఫాలో పౌరుల భద్రత, వారికి మానవీయ సాయంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్‌కు అందాల్సిన కీలక ఆయుధాల షిప్‌మెంట్‌ను అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ నిలిపివేశారు. అయితే, తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన వెంటనే ట్రంప్ ఆ దేశానికి ఆయుధాలను ఇచ్చేందుకు ఆమోదం తెలపడం గమనార్హం.

2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్ హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హానియా, అక్టోబరు 7 నాటి ఘటనకు సూత్రధారి యహ్యా సిన్వార్‌తోపాటు కీలక నేతలను హతమార్చింది. టెల్‌అవీవ్ దాడుల్లో గాజాలో 46,000 మందికిపైగానే పాలస్తీనీయులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.



# టిక్కెట్లు దక్కని వారు ఫిరాయించి పగ తీర్చుకున్నారు!

## ఆ 8 స్థానాలు బిజెపికి ఎలా దక్కాయంటే..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశరాజధాని ఢిల్లీలో దాదాపు 26 యేళ్ల తర్వాత బిజెపి అధికార పీఠం దక్కించుకుంది. పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఈ ఎన్నికల్లో బిజెపి నాయకత్వం తోపాటు కార్యకర్తలు కూడా చెమటోడ్చి పని చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని విభేదాలు కూడా రచ్చకెక్కి ఓటమికి కారణమయ్యాయి. గతేడాది ఆప్ ఎంపి స్వాతిమలివాల్ చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం రేకెత్తించాయి. అలాగే ఆప్ నుంచి బిజెపిలోకి ఫిరాయించిన 8 మంది ఎమ్మెల్యేలు కూడా బిజెపి విజయానికి కూడా పనిచేశారు. దీంతో ఆ మొత్తం 8 నియోజక వర్గాల్లోనూ బిజెపి అభ్యర్థులే గెలుపొందారు. ఢిల్లీలో పాలం, త్రిలోక్‌పురి, మదిపుర్, కస్తూర్బా నగర్, ఉత్తమ్‌నగర్, బిజ్వాసన్, మెహ్రౌలీ, ఆదర్శ్‌నగర్ అసెంబ్లీ స్థానాలను 2020 ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుచుకుంది. అయితే తాజా ఎన్నికల్లో ఆప్ పార్టీ అధినాయ కత్వం ఈ 8 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చింది. మొత్తం 8మంది సిట్టింగ్ ఎమ్మెల్యే లను పక్కన పెట్టింది. దీంతో ఆ ఎనిమిది మంది ఆప్ పార్టీకి రాజీనామా చేసి చేసి బిజెపిలో చేరిపోయారు. బిజెపి వారిలో ఒక్కరికి కూడా సీటు ఇవ్వలేదు. కానీ, వారి సేవలను వినియోగించుకుంది. దీంతో తాజా ఎన్నికల్లో ఆ 8నియోజక వర్గాల్లోనూ బిజెపి జయకేతనం ఎగురవేసింది. అలా 2020లో ఆప్ పార్టీకి కంచుకోటగా నిలిచిన ఆ 8నియోజకవర్గాలు తాజా ఎన్నికల్లో బిజెపి చెంతకు చేరాయి. తాజా ఎన్నికల్లో న్యూఢిల్లీ సీటు నుంచి పోటీ చేసిన కేజ్రీవాల్ కూడా ఓడిపోయారు. అలాగే డిప్యూటీ సిఎం మనీష్ సిసోసియాతో పాటు పలువురు కీలక నేతలు కూడాఓటమి పాలయ్యారు. పదేళ్ల అధికారంలో కొనసాగిన ఆప్ పార్టీలో అంతర్గత విభేదాలు కూడా బిజెపి ఘన విజయానికి తోడ్పాటునందించాయి.



# 'యమునా' శాపమే ఆప్‌ను ఓడించింది

## బిజెపి ఎంపి మనోజ్‌తివారి విమర్శ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో బిజెపి దూసుకుపోతోంది. ఆధిక్యాల్లో మ్యాజిక్ ఫిగర్ దాటి జోరు ప్రదర్శిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనీష్‌సిసోడియా పరాజయం పాలయ్యారు. వెనుకంజలో ఉన్న ఆప్‌పై కాషాయపార్టీ విమర్శలు గుప్పిస్తోంది. యమునా నది శాపం తగలడంవల్లే వారు ఓడిపోయారంటూ వ్యాఖ్యానించింది. ఢిల్లీలో బిజెపి విజయం ఖరారైంది. త్వరలో రాజధానిలో మా ప్రభుత్వం కొలువుదీరనుంది. కేజ్రీవాల్ ప్రజలకు తీరని ద్రోహం చేశారు. మంచినీటికి బదులుగా మద్యం పంపిణీ చేశారు. యమునా నది శాపం వారికి తగిలింది. కాంట్రాక్ట్ కార్మికులు, ఉపాధ్యాయులు జీవితాలను అతలాకుతలం చేశారు. బస్సు డ్రైవర్లను తొలగించి వారి పెన్షన్‌ను నిలిపివేశారు. ఆయుష్మాన్ భారత్ ప్రయోజనాలను ప్రజలకు అందనివ్వకుండా అడ్డుపడ్డారు.

బిజెపి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాయక తొలి కేబినెట్ సమావేశంలో ఆరోగ్య పథకాల అమలుపై దృష్టిసారిస్తుంది అని బిజెపి ఎంపి మనోజ్ తివారి పేర్కొన్నారు. మా పార్టీ యమునా నదిని పరిశుభ్రంగా మారు స్తుంది. ప్రజలు ఎప్పుడు కావాలంటే అప్పుడు నదీ తీరాలకు వెళ్లేలా సౌకర్యాలు కల్పిస్తుంది. నీటిలో మునిగేలా శుభ్రపరుస్తాం. ఢిల్లీ సిఎం అభ్యర్థి అంశంపై బిజెపి అతి త్వరలో నిర్ణయం తీసుకుంటుంది. 20 ఏళ్ల పాటు ప్రభుత్వాన్ని నడిపించే సామర్థ్యం ఉన్న వ్యక్తినే నియమించే అవకాశం ఉంటుంది.

ఇక కేజ్రీవాల్ పంజాబ్‌కు పారిపోక తప్పదు అని ఎద్దేవా చేశారు. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ చేతిలో ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పరాజయం పాలయ్యారు. జంగ్‌పురలో మనీష్‌సిసోడియా ఓడిపోయారు. ఈ స్థానంలో బిజెపి అభ్యర్థి తర్వీందర్‌సింగ్ గెలిచారు. మరోవైపు, కాషాయ పార్టీ అభ్యర్థి రమేష్ బిధూరిపై స్వల్ప తేడాతో సిఎం అతిశీ విజయం సాధించింది. ముందునుంచి వెనుకంజలో కొనసాగిన అతిశీ చివరి రౌండ్‌లో పుంజుకున్నారు.

# జోబైడెన్‌కు దేశరహస్య సమాచారం తెలుసుకునే అనుమతి రద్దు

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం



**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ దేశ రహస్య సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం లేదని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయా అనుమతులను రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'ప్రస్తుతం జో బైడెన్ రహస్య సమాచారం పొందాల్సిన అవసరం లేదు. అందువల్ల మేము వెంటనే ఆయన భద్రతా అనుమతులను రద్దు చేస్తున్నాం. ఆయన రోజువారీ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్‌లను నిలిపివేస్తున్నాం. 2021లో నాకు ఇంటెలిజెన్స్ కమ్యూనిటీ నుంచి జాతీయ భద్రతా సమాచారం తెలుసుకోవడాన్ని నిలిపివేశారు. దానికి ప్రతిగానే నేను ఈ చర్యలు తీసుకుంటున్నా. అంతేకాక.. ఆయన పేలవమైన జ్ఞాపకశక్తితో బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారం విషయంలో జాగ్రత్తలు వహించాలని నిర్ణయించుకున్నా. నేను ఎల్లప్పుడూ జాతీయ భద్రతను రక్షిస్తా' అని ట్రంప్ రాసుకొచ్చారు. కాగా, ట్రంప్ నిర్ణయంపై బైడెన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా సంప్రదాయం ప్రకారం అక్కడి మాజీ అధ్యక్షులకు జాతీయ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారం తెలుసుకునే అధికారం ఉంటుంది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌పై జోబైడెన్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన గెలుపునకు వ్యతిరేకంగా ట్రంప్ మద్దతుదారులు 2021 జనవరి 6న క్యాపిటల్ భవనంపై దాడి చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌నకు అప్పటివరకు ఉన్న ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ అనుమతులను బైడెన్ తొలగించారు. దీనికి ప్రతీకారంగానే ట్రంప్ తాజాగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

# విసిగిపోయిన ఢిల్లీ జనం మార్పునకు ఓటేశారు

## కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించింది. ఆప్ భారీ ఓటమిని చవిచూసింది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంకాగాంధీ స్పందించారు. ఢిల్లీ ప్రజలు పదేళ్లుగా ఒకే ప్రభుత్వాన్ని చూసి విసిగిపోయారని, అందుకే మార్పు కోసం ఓటేశారని వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్న విషయం ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సమావేశాల సందర్భంగానే తేలిపోయిందని ఆమె చెప్పారు.

'స్థానిక పరిస్థితులతో ప్రజలు విసిగిపోయారు. వారు మార్పును కోరుకున్నారు. మార్పు కోసమే ఓటేశారని అనుకుంటున్నా. ఈ ఎన్నికల్లో గెలిచిన అందరికీ నా శుభాకాంక్షలు. మిగిలిన వారు మరింతగా శ్రమించాలని ఈ ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. నేతలు స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై స్పందించాలి' అని కేరళ పర్యటనలో ఉన్న ప్రియాంకగాంధీ సూచించారు.

కాగా, ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకుగాను బిజెపి 48 స్థానాల్లో గెలిచింది. అధికారపార్టీ కేవలం 22 స్థానాలకు పరిమితమైంది. ఇక కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడోసారి కూడా ఒక్క ఎమ్మెల్యే సీటైనా గెలుచుకోలేకపోయింది. ఎన్నికల్లో గెలిచిన బిజెపి న్యూఢిల్లీలో కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేష్‌వర్మకు సిఎం పదవి కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# ఓడినా బిజెపిపై మా పోరాటం కొనసాగిస్తాం

## కల్కాజీ ఎమ్మెల్యే, మాజీ సిఎం అతిశి మర్లేనాసింగ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కల్కాజీ స్థానంనుంచి బిజెపి ఎంపి రమేష్ బిదూరిపై విజయంసాధించిన సీఎం అతిశి మొర్లేనా తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచినప్పటికీ సంబరాలుచేసుకునే తరుణం ఇది కాదని, ఎన్నికల ఫలితాలు తమ పార్టీకి గట్టి ఎదురుదెబ్బలేనని ప్రజల తీర్పును గౌరవిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో తాను కల్కాజీనుంచి గెలిచానని కానీ వేడుకలు చేసుకునే సమయం కాదని, నాపై విశ్వాసం ఉంచి గెలిపించిన కల్కాజీ ప్రజలకు ధన్యవాదాలనిఎన్నికల ఫలితాలు ఆప్‌కు గట్టి షాక్ అని ప్రజల తీర్పును తలవంచాల్సిందేనని అతిశి వ్యాఖ్యలుచేసారు. బిజెపిపై మా పోరాటం ఆగదని ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. బిజెపి సీనియర్ నాయకుడు రమేష్ బిదూరిపై ఆమె 3521 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇదేస్థానంనుంచి కాంగ్రెస్ తరపున అల్కాలాంబ పోటీచేసారు. గతంలో 2020లో జరిగిన ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి అతిశిమర్లేనాసింగ్ 52శాతం ఓట్లతో ప్రజల మద్దతును పొందారు.

# మిల్కిపూర్‌లో బిజెపి విజయం

**లక్నో, ఫిబ్రవరి 8:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యజిల్లా మిల్కిపూర్ ఉప ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించింది. సమాజ్‌వాదీపార్టీ పై జరిగిన పోరులో బిజెపని అభ్యర్థి చంద్రభాన్ పాశ్వాన్ గెలిచారు. ఎస్పీ అభ్యర్థి అజిత్‌ప్రసాద్‌ను 60వేల ఓట్లతేడాతో ఓడించారు. 2027లో జరగనున్న ఉత్యరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మిల్కిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఫలితాలు కేవలం ట్రైలర్ అని డిప్యూటిసిఎం కేశవ్‌ప్రసాద్ మౌర్య అన్నారు.

ఇది కేవలంట్రైలర్ మొత్తం చిత్రం 2027లో విడుదలవుతుందని సమాజ్ వాదీపార్టీ జీరో అవుతుం దని ఆయన అన్నారు. ప్రతి ష్టాత్మక రామాలయాన్ని నిర్మించిన అయోధ్య జిల్లాలోని ఫైజాబాద్ లోక్‌సభ స్థానంలో సమాజ్‌వాదిపార్టీ అభ్య ర్థి అవధేష్‌ప్రసాద్ బిజెపి అభ్యర్థిపై విజయం సాదించారు. పార్లమెంట్‌కు ఆయన



ఎంపిక కావడంతో ఎస్సీలకు రిజర్వు చేసిన అయోధ్య జిల్లాలోని మిల్కిపూర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అయింది. ఆధిపత్య పాసీ వర్గానికి చెందిన అవధేష్ కుమారుడు అజిత్ ప్రసాద్‌ను ఎస్పీ పోటీకి దించింది. అయితే ఇరు పార్టీల మధ్య జరిగిన ప్రతిష్టాత్మకపోరులో అదేవర్గానికి చెందిన బిజెపి అభ్యర్థి చంద్రభాను పాశ్వాన్ ఘనవిజయం సాధించారు.

# ఇంకా కొట్టుకుంటూనే ఉండండి..

## ఆప్, కాంగ్రెస్‌పార్టీలపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు అనుగుణంగానే ఫలితాల్లో బిజెపి మ్యాజిక్ ఫిగర్‌ను దాటి దూసుకుపతోంది. అధికార ఆమ్ ఆద్మీ, కాంగ్రెస్ పార్టీలు వెనుకంజలో ఉన్నాయి. దీనిపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ ఆప్, కాంగ్రెస్‌లకు చురకలు అంటించారు. ఢిల్లీలో బలం ఉన్న ఆప్‌కు కాంగ్రెస్ సహకరించలేదని, అందువల్లే ఎన్నికల ఫలితాల్లో వెనుకబడిపోతున్నారని మండిపడ్డారు. ఇంకా మీలో మీరే కొట్టుకుంటూ ఉండండి అంటూ వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికల విషయంలో ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్, ఆప్ పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. దాంతో ఇరుపార్టీలు వేరువేరుగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించాయి. అంతేకాకుండా ఎన్నికల ప్రచారాల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆప్‌పై పలు ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇండియా కూటమికి ప్రాముఖ్యం తగ్గిపోయిందంటూ ఆప్ సహా కూటమి నేతలు అసహనం వ్యక్తం చేశారు. దీనివల్ల ఆగ్రహానికి గురైన ఒమర్‌అబ్దుల్లా కలసికట్టుగా లేకపోతే కూటమికి ముగింపు పలకాలంటూ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయి. ఎన్నికల సమయంలో స్థానిక పార్టీలు బలంగా ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పోటీ చేయకుండా వారికే అవకాశం ఇవ్వాలనే ఒప్పందంతో ఏర్పడింది. కాగా ఆప్ అధికారంలో ఉన్న ఢిల్లీలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అప్పటికే జరిగిన లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర , హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయాన్ని ఎదుర్కోవడంతో ఆప్ అందుకు అంగీకరించలేదు. దీంతో రెండు కూటమి పార్టీలు ఒంటరి పోరుకు సిద్ధమయ్యాయి.

# 54వేల ఓట్ల మెజార్టీతో ఈరోడ్ డిఎంకె అభ్యర్థి గెలుపు





**ఈరోడ్, ఫిబ్రవరి 8:** తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార డిఎంకె అభ్యర్థి విసి చందిరకుమార్ భారీ విజయం నమోదుచేసారు. ఈరోడ్ ఈస్ట్ స్థానానికి శనివారం ఉప ఎన్నిక పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే ఎన్టీకే అభ్యర్థి ఎంకె సీతాలక్ష్మిని భారీ ఆధిక్యంతో ఓడించారు.

మాజీ ఎమ్మెల్యే కూడా అయిన చంధిరకుమార్ మొద టిరౌండ్‌నుంచే ఆధిక్యంలో నిలిచారు. నియోజక వర్గంలో డిఎంకె ఆధిపత్యాన్ని చాటిచెప్పింది. కనీసం ఎన్నికల్లో సీతాలక్ష్మి తన ధరావత్తు అయినా దక్కించుకుంటుందా అన్న భావన నియోజకవర్గనేతల్లో కనిపించింది. చంధిరకుమార్‌కు లక్షోట్లకుపైగా రాగా సీతాలక్ష్మి కేవలం 23 వేల ఓట్లతోనే వెనకబడిపోయారు. ఈ ఉప ఎన్నికలు తమిళనాడులో 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు రిఫరెండమ్ వంటివని డిఎంకె నేతలు హర్షం ప్రకటించారు. ఈరోడ్ తూర్పునుంచి 54వేల ఓట్ల ఆధిక్యంతో తమ అభ్యర్థి గెలవడం డిఎంకెపార్టీకిప్రజల్లో ఉన్న ఆదరణను రుజువుచేస్తుందని డిఎంకె అధినేత సీఎం ఎంకె స్టాలిన్ అన్నారు. మొత్తం 46 మంది అభ్యర్థులు పోటీచేసారు.

వీరిలో 44 మంది స్వతంత్ర అభ్యర్థులే ఉన్నారు. ఎన్‌టికె, డిఎంకె ఎఐఎడిఎంకెతోపాటు ఇతర విపక్ష పార్టీల అభ్యర్థులు కూడా పోటీచేసారు.

ఈరోడ్ ఒకప్పటి ప్రముఖ నేత ఈవీ రామస్వామి పెరియార్ సొంత నియోజకవర్గం కావడం గమనార్హం.

# హ్యాట్రిక్ సున్నాలతో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడోసారి కూడా కాంగ్రెస్ ఒక్కస్థానం కూడా సాధించలేకపోయింది. ఒకప్పుడు హ్యాట్రిక్ విజయంతో ఢిల్లీ పీఠాన్ని పాలించిన హస్తంపార్టీ ఇపుడు కనీసం ఒక్కస్థానం కూడా గెలవలేని స్థితిలో నిలిచిపోయింది. ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బిజెపి విజయం సాధించింది. 1998లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మొదటిసారి అధికారంచేపట్టింది. అప్పటినుంచి ప్రతి ఎన్నికల్లోను ఆ పార్టీ విజయం సాధించింది. సీఎంగా షీలాదీక్షిత్ నేతృత్వంలో ఆపార్టీ హస్తినలో తిరుగులేని శక్తిగా మారింది. 2003, 2008 ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. ఆ సమయంలో కేంద్రంలో యుపిఎ ప్రభుత్వం ఉండటం ఢిల్లీ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌పార్టీ హవా చూపించింది. ఆమ్ ఆద్మీపార్టీ రాకతోనే కాంగ్రెస్‌కు కష్టకాలం ప్రారంభం అయింది. 2013 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఉన్న ఓటుబ్యాంకు చాలావరకూ ఆప్‌కు వెళ్లిపోయింది. దీనితో ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎనిమిది స్థానాలతోనే సరిపెట్టుకుంది. 2015 ఎన్నికల్లో ఉన్న సీట్లుకూడా కోల్పోయింది. సున్నాకే పరిమితం అయింది. 2015, 2020 ఎన్నికల్లోను కాంగ్రెస్ ఓటర్లు కాంగరగెస్‌చేతిలో ఒక్కస్థానం కూడా గెలిపించి ఇవ్వ లేదు. ఉన్న ఓటు బ్యాంకు కూడా ఎగిరిపోయింది. ఉత్తరాదిరాష్ట్రాల్లో ఆప్ క్రమేపీ విస్తరించింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మారిపోయింది. కాంగ్రెస్ ఓటుబ్యాంకును మొత్తం సాధించుకోవడం కనిపించింది. ఢిల్లీ సహా సరిహద్దురాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టం కాసాగింది. కాంగ్రెస్ వ్యతిరేక ఓటర్లు, బిజెపి తీరు నచ్చనివారంతా ఆప్‌వైపు మళ్లారు. కాంగ్రెస్ ఓటుబ్యాంకు దారుణంగా పడిపోయింది. అందుకే ఈసారి ఎన్నికల్లో వేరువేరుగా ఇండియా కూటమి తరపున కాకుండా వేరువేరుగా పోటీ చేసాయి. అయినా కూడా తన ఓటు బ్యాంకును కాపాడు కోలేకపోయింది. దీనికితోడు కాంగ్రెస్‌కు దేశరాజధానిలో బలమైన నాయకుడేలేడు. షీలాదీక్షిత్ తర్వాత ఆపార్టీకి సరైన నాయకుడు లేకుండాపోయాడు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడం చేయకపోవడం, కేంద్రంలో బిజెపిని ఎదిరించేందుకు ఆప్‌తో చేతులు కలిపిన కాంగ్రెస్ రాష్ట్రంలో ఆపార్టీని దూషించడం ఆపార్టీని ఓటర్లు హర్షించలేకపోయారు.


దీనికితోడు ఇపుడు ప్రభుత్వం ఏంచేస్తోంది, తమ ప్రభుత్వ లక్ష్యాలేమిటి అనేవి స్పష్టంగా చెప్పలేకపోయింది. మహిళలకు ఉచితాలు, 25 లక్షల ఆరోగ్యబీమా ప్రకటించినా ఓటర్లు ఆపార్టీని ఎన్నికల్లో పక్కన పెట్టేసారు.

# భారీ రాకెట్లలో ఉపయోగించే క్రయోజనిక్ ఇంజన్‌కు సరికొత్త పరీక్ష

## మహేంద్రగిరిలో విజయవంతంగా పూర్తి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు

## ఎన్‌జిఎల్‌వి రాకెట్లకు ఇది కీలకం





పెద్ద రాకెట్లలో ఉపయోగించే సిఇ20 క్రయోజనిక్ ఇంజన్ జ్వలన పరీక్ష ఇస్రో విజయవంతంగా పరీక్ష పూర్తి చేసిన స్వదేశీ సిఇ20 క్రయోజనిక్ ఇంజన్

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అతిపెద్ద రాకెట్లను ప్రయోగించే సమయంలో క్రయోజనిక్ ఇంజన్‌ను సరికొత్తగా ఉపయోగించుకోవడానికి స్థిర పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం ఎల్‌విఎం3 బాహుబలి రాకెట్లలో మూడవ దశలో సిఇ20 పేరుతో ఈ ఇంజన్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే దీన్ని ప్రజ్వలన చేసిన ఆగిన తర్వాత కూడా మళ్లీ మండుకునే విధంగా సరికొత్త ఇంజన్‌ను రూపుదిద్దారు.

తమిళనాడు లోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో హై ఆటిట్యూడ్ టెస్ట్ (హెచ్‌ఎటి) తరహాలో ఈ పరీక్ష నిర్వహించారు. ఇది భవిష్యత్‌లో జరిగే న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) రాకెట్ల తయారీకి కూడా కీలకం అవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. టర్బో పంపులను ఉపయోగించి ప్రత్యేక ట్యాంకులో నిల్వ చేయబడిన ప్రెషరైజ్డ్ గ్యాస్ (స్టోర్డ్ గ్యాస్ సిస్టం) ఎంతో ఉపయోగపడనుంది. రాకెట్ ప్రయాణిస్తున్నప్పుడే క్రయోజనిక్ ఇంజన్‌ను మళ్లీ పునఃప్రారంభించే కొత్త తరహా ప్రయోగంగా దీన్ని పేర్కొంటున్నారు. గగన్‌యాన్ మిషన్‌కు కూడా 19 టన్నుల నుంచి 22 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని వాడే సౌలభ్యం ఉంది.

ఈ విధానాన్ని ఇస్రో అమల్లోకి తీసుకురావడంతో భవిష్యత్ ప్రయోగాలపై మరింత దృష్టి పెట్టినట్లయింది.



## మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్ జయంతి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** మాజీ రాష్ట్రపతి భారతరత్న జాకీర్ హుస్సేన్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఆ మహనీయుడి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, దేశంలో విద్యారంగం అభివృద్ధికి గొప్ప కృషి చేసిన విద్యావేత్తగా డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఎన్నో సేవలు అందించారని ముఖ్యమంత్రి కొనియా డారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

# తెలంగాణలో బిఆర్ఎస్ వైఫల్యం వల్లే బిజెపి ఎదుగుదల

## కెటిఆర్ ట్వీట్‌పై విరుచుకుపడిన మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, సురేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి ఎదుగుదలకు బిఆర్ఎస్ వైఫల్యం కారణమని ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ జీరో వచ్చి బిజెపి 8 సీట్లు గెలుపొందేలా చేసింది దీనికి కాంగ్రెస్ చెప్పాలా అని ఆయన ట్వీట్ చేశారు. కర్ణాటక, తెలంగాణలో ఎలా పుంజుకున్నామో అలాగే దేశవ్యాప్తంగా గెలుస్తామని ధీమాను వ్యక్తంచేశారు. గులాబీ పార్టీ కారణంగానే బిజెపి ఎదిగిందని అన్నారు. కెటిఆర్ "బిజెపికి అతిపెద్ద కార్యకర్త రాహుల్‌గాంధీ" అని ట్వీట్ చేయడంతో మంత్రులు కెటిఆర్‌పై విరుచుకుపడ్డారు. పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమి కన్నా బిజెపి గెలుపు కెటిఆర్‌కు ఆనందం ఇస్తోందని అన్నారు. కేసులు మాఫీ కోసమే ఇదంతా అనే మాట నిజంకాదా అని ప్రశ్నించారు. దేశాన్ని ఏలుతామని పార్టీ పేరు మార్చుకున్న మీ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదని మండిపడ్డారు. బిఆర్ఎస్ బిజెపి పార్టీల బంధం విడదీయరానిదని, అది నిజమని మరోసారి కెటిఆర్ నిరూపించారని పొన్నం తెలియజేశారు. మంత్రి కొండా సురేఖ కూడా కెటిఆర్ వ్యాఖ్యపై తీవ్రంగా స్పందిసూనత "మోదీ అంకుల్ "గెలుపుకు కీలక పాత్ర పోషించినందుకు మీ సోదరిని అభినందించాలని, ఈ ఫలితాల్ని రూపొందించడంలో ఆమె చేసిన ప్రయత్నాలు స్పష్టంగా ఉన్నాయని పరోక్షంగా లిక్కర్ స్కామ్ ను గుర్తుచేశారు. పార్లమెంట్ఎన్నికల్లో రాజ్యాంగానికి మించినవారు ఎవరు లేరని మోదీకి అర్థమయ్యేలా రాహుల్‌గాంధీ చేశారని ఆమె పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడి పదవి కట్టబెట్టడానికి రాహుల్ నాయకత్వం ఉపయోగ పడిందని అయినా మీ స్వయంకృతాపరాధంతో పార్లమెంట్ ఎన్నికలలో జీరోకు పడిపోయి తుడిచిపెట్టుకొనిపోయిందని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ బలమైన ప్రభావంను విస్మరించ కూడదని ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా పోటీ చేయడానికి వెనుకాడుతోందని ఈ నష్టం బిఆర్ఎస్ మరో ఎన్నికల పోరులోకి అడుగు పెట్టడానికి ఇష్టపడకుండా పోయిందని గుర్తు చేశారు. నిజంగా అర్థమైనా వారిని అభినందించడం మరిచిపోవద్దని నెక్స్ట్‌టైమ్ బెటర్ లక్ కెటిఆర్ అంటూ కొండా సురేఖ వ్యంగంగా వ్యాఖ్యానించారు.



## సమగ్ర కులగణన నివేదికపై బిసి సంఘాలతో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు

### పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు కేశవరావు, బిసి కమిషన్ చైర్మన్, సభ్యులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన నివేదికపై బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సచివాలయంలో బీసీ సంఘాలతో చర్చలు జరిపారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలు, బీసీ మేధావులతోపాటు ప్రభుత్వ సలహాదారు కేశవరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిషన్ సభ్యులు, ఎంపి సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, టీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ఎంబీసి కార్పొరేషన్ జ్ఞానేశ్వర్, ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. సమగ్ర కులగణన రిపోర్టుపై, అలాగే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీసీ సంఘాల నేతలు కోరారు. కులగణన రిపోర్టును సమీక్షించాలని, అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలకి అన్యాయం జరిగిన విషయాలపై అంకెలు, సంకెలను బీసీ సంఘాల నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

# భారతీయ జానపదం అరగని, తరగని కళ

## విద్యాశంకర భారతీస్వాముల అనుగ్రహభాషణం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** భారతీయ సనాతనధర్మ జానపదం ఎన్నటికీ అరగని, తరగని కళని, ఎప్పటికీ నవ్యమై భవ్యమై చరించు భవకళ, పరమశివుడు అధిపతి అయిన నటరాజ కళని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పరమపూజ్య పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ అభినవోద్ధండ విద్యాశంకర భారతీస్వాముల అనుగ్రహభాషణ ప్రసంగం ప్రబోధించారు. ధర్మం అభివృద్ధిలోకి రావాలి.. ధర్మాన్ని ఆచరించకపోతే అధర్మంగా ప్రభలి లోకం అల్లకల్లోమై భావితరాలకు కళాసంపదలు అందవన్నారు. జానపద కళకు ప్రాణంపోసినవారు శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నారు. మనలో కళాభిమానముంటే ఆ కళాదృష్టితో పరమాత్మని దర్శించుకోగలమన్నారు. రమణాచారి జన్మదినంతో ప్రజలకు కళలను కళాకారులతో చూపించాలను కళాఋషి, మహర్షి, సమస్తాలు దాగివున్న మానవాకారంలో ఉన్నవారని, జ్ఞానాన్ని మేళవించిన జానపదం ఈనాటి



రమణాచారి దంపతులను సత్కరిస్తున్న విద్యాశంకర భారతీస్వామీజీ

సభా ప్రాంగణమని అభివర్ణించారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థలు సత్కళాభారతి, యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సాంస్కృతికబంధు సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ విద్యాశంకర భారతీస్వాములు విశిష్ట అతిథి తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, గౌరవ అతిథులు రాష్ట్ర కార్మికశాఖ బ్రహ్మం, స్వామివారి ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ సూర్యనారాయణ, నిర్వాహక సంస్థల అధ్యక్షులు సత్కళాభారతి సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి డా. కె.వి.రమణాచారి 73వ జన్మదినాన్ని పురస్కరించుకొని దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సభకుముందు వివిధరీతుల జానపద కళాకారులచే ఆయా కళాప్రదర్శనలతో ఉర్రూతలూగించి ఆనందడోలికల్లో ముంచెత్తివేశారు. డా. మామిడి హరికృష్ణ డా. కె.వి.రమణాచారి జన్మదినం కళాదినం, సాంస్కృతిక పర్వదినం, సాహిత్య ఉత్సవ దినోత్సవం, అపూర్వఘట్టం, యావత్ తెలుగుజాతి చిరపరిచయస్తుడని, సంస్కృతి, సాహిత్యం, కళలన్నా ఎంతో ప్రేమానురాగాలతో ఆయా రంగాలను, కళాకారులను ప్రోత్సహిస్తున్నారని ఆయన జీవన ప్రస్థానాన్ని సవివరంగా విశదీకరించారు. అనంతరం స్వామీజీ ఆశీస్సులతో మామిడి హరికృష్ణ చేతులమీదుగా 500మంది జానపద కళాకారులకు రమణాచారి కార్మికశాఖతో చేయించిన 2లక్షల ప్రమాద భీమా(ఈశ్వం) కార్డులను అందజేశారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి: మంత్రి సీతక్క



శనివారం ములుగు మండలంలోని ఇంచేర్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**ములుగు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకుసాగాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. శనివారం ములుగు మండలంలోని ఇంచేర్లలో జరిగిన ములుగు, వెంకటాపూర్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్య మంత్రి రేవంతరెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలుచేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిందన్నారు. తాను మంత్రి అయిననాటి నుండి ఇప్పటివరకు ములుగు నియోజకవర్గంలో రూ. 30 కోట్ల సీడీఎఫ్ నిధులతో దళిత, గిరిజన వాడల్లో సిసి రోడ్స్ డ్రైనేజీలు కల్వర్టులు మంజూరు చేయించానన్నారు. అదేవిధంగా ములుగు నూతన బస్‌స్టాండ్ ఏటూరునాగారంలో బస్ డిపోకు నిధులు రూ. 80 కోట్లతో టూరిజం డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్ శాఖ నుండి బిటి రోడ్లకు రూ. 310 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. అలాగే నాయకులకు కార్యకర్తలకు మధ్యలో విభేదాలుంటే తన దృష్టికి తీసుకురావాలిని సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉండాలి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మధ్యలోకి తీసుకెళ్లాలి మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి కానీ ఎక్కడా మాట్లాడకూడదు పార్టీ కోసం పనిచేసిన వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీట్ చేయడం కోసం అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలి పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థలలో టికెట్లు ఇవ్వడం జరుగుతుంది అని రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సస్పెన్షన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 8:** ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ షాక్ ఇచ్చింది. ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో, దీంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు పిసిసి క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సుభాష్‌రెడ్డి కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావును, పార్టీని దుర్భాషలాడినట్లు ఫిర్యాదు అందింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో ఆయన దుర్భాషలాడినట్లు వెల్లడి కావడంతో అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలంటూ చిన్నారెడ్డి గత యేడాది నోటీసులు జారీ చేశారు. 2024 నవంబరు 21 నాటికి వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. 2024 నవంబరు 20 నాటికి సుభాష్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. అయితే, ఆయన సమాధానంపై సంతృప్తి చెందని రాష్ట్ర అధిష్ఠానం సస్పెన్షన్ వేటు వేస్తూ నిర్ణయం తీసుకుంది.

# దేశంలో బిజెపి ప్రభంజనం మొదలైంది

## ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** దేశంలో బిజెపి ప్రభంజనం మొదలైందని ఎంపి డికె అరుణ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇజెపి గ్రాండ్ విక్టరీ సాధించిందన్నారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బిజెపికి ఇది చారిత్రకమైన విజయం అన్నారు. పదేళ్ల అవినీతి పాలనకు ఢిల్లీ ప్రజలు చరమగీతం పాడారన్నారు. బిజెపి పాలనపై ఈ దేశ ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందనడానికి ఇదే కారణం అన్నారు. ఢిల్లీలో ప్రజలంతా బిజెపికి అండగా నిలిచారన్నారు. అభివృద్ధిని కోరుకుంటూ అవినీతి ఆప్‌ను చీపురుతో ఊడ్చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా గెలుస్తామన్నారు.
ఈ దేశంలో మార్పు మొదలైందని, ఢిల్లీ నుంచి గల్లీ దాక మేమే గెలుస్తాం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీ లా కాంగ్రెస్ పార్టీ వ్యవహించడం లేదన్నారు. కేజ్రీవాల్ చేసిన అవినీతిని ప్రజలు గుర్తించారని, అందుకే ఓటుతో బుద్ధి చెప్పారన్నారు.

**తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే: బిజెపిఎల్‌పి నేత ఏలేటి**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం పట్ల బిజెపిఎల్‌పినేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశ ప్రజలు మోడీ నాయకత్వాన్ని బలపరిస్తున్నారని, ఈ ఎన్నికలలో స్పష్టం అవుతోందని ఆయన అన్నారు. రోజూ రోజుకు కాంగ్రెస్ పార్టీ కనుమరుగు అవుతుందన్నారు. గతంలో ఆప్‌పార్టీ తప్పుడు హామీలతో, అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడంతో ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఏ ఒక్క అవినీతి ఆరోపణల లేకుండా, స్వచ్ఛమైన సుపరిపాలన అందిస్తున్న నరేంద్రమోడీని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో తెలంగాణలో రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పట్ల ఆ ప్రభుత్వాన్ని ప్రజలు ఎలా గద్దె దించారో, ప్రస్తుతం ఢిల్లీ ఎన్నికల్లో కూడా ప్రజలు అలాంటి తీర్పే ఇచ్చారని, రాబోవు రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలో కూడా ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని, గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ అవినీతి పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని చీదరించుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో రాబోయేది రామ రాజ్యమే అన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

## మాదిగలకు 11 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణలో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాంగ్ కులస్తుల భాష వేరైనప్పటికి వారి వృత్తి, మాదిగల కులస్తుల వృత్తి ఒక్కటేనని వారిని మాదిగలతోనే ఉంచాలని కోరారు. వర్గీకరణ బిల్లు తప్పుల తడకగా ఉందని, కాంగ్రెస్ పార్టీలోని మాల నాయకులు కుట్ర చేశారని ఆయన ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మాంగ్ కులస్తుల సదస్సులో ఆయన ముఖ్యఅతిధి పాల్గొని ప్రసంగించారు. 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 రిజర్వేషన్‌లు కేటాయిస్తూ 32 లక్షల జనాభా ఉన్న మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం న్యాయమేనా అని ఆయన ప్రశ్నించారు. సోమవారం మాదిగల, నేతకానిల అభిప్రాయాలను సిఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రుల దృష్టికి తీసుకువెళతామన్నారు. పార్లమెంట్ మాజీ సభ్యుడు వెంకటేష్ మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు తప్పుల తడకగా ఉందని, నేతకానిలను ప్రత్యేక కేటగిరిగా పరిగణించాలని కోరారు.

# మా సామాజికవర్గం లెక్కలు వాస్తవ విరుద్ధం

## రీసర్వే నిర్వహించి పద్మశాలీల లెక్కలను పక్కాగా తేల్చండి

### ప్రభుత్వానికి రాష్ట్ర సంఘం డిమాండ్




అభివాదం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్, బాలరాజు, శ్రీనివాస్, నవీన్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రీ సర్వే నిర్వహించి పద్మశాలీల లెక్కలను పక్కాగా తేల్చాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం చూపిన తమ సామాజిక వర్గ లెక్కలు వాస్తవ విరు ద్ధంగా ఉన్నాయని ఆవే దన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీలు కేవలం 11 లక్షల మా త్రమే ఉన్నారని చెప్పడం విడ్డూరమని మండి పడ్డా రు. గతంలో చేసిన సర్వే లోనే తమ జనాభా 11 లక్షలకుపైగా ఉన్నట్లు తేలిందని, ఈ పదేళ్లలో 30 లక్షలకుపైగా జనాభా పెరిగి ఉంటుందని జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలి పోయిన వారిని కూడా లెక్కిస్తే మరింత పెరుగు తుందన్నారు. రేవంత్ నేతృతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని చెబుతున్న లెక్కలు ఒక సామాజికవర్గానికి తీరని అన్యాయం చేసేలా ఉన్నాయని విమర్శించారు. సర్వే విధానమే గందరగోళంగా సాగిందని, సర్వేకు ఉపయోగించిన పత్రంలో కులగణన చివరి ప్రాధాన్యతలో ఉందని విమర్శించారు. సరి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే రీసర్వే నిర్వహించి తమ సామాజికవర్గ లెక్కలను పక్కాగా తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్, కోశాధికారి నవీన్, గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు, బురా మల్లేష్, ఉపాధ్యక్షుడు వనమాల శంకర్, సిహెచ్. చంద్రుడు, గుంటి నగేష్, జోగి సూర్యప్రకాష్, పాశిగంటి మల్లేష్, గంజి శ్రీనివాస్, సామల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్‌ను తెలుగు భాషలో ఉన్న తిట్లన్నీ తిడుతున్నారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** మన ఐరన్ లెగ్ రేవంత్ రెడ్డి.. ఢిల్లీ పోయి కాంగ్రెస్ పార్టీకి సున్నా సీట్లు తెప్పించిండని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. శనివారం బిఆర్ఎస్ భవన్ లో జరిగిన సిర్పూర్ కాగజ్ నగర్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీకి అతిపెద్ద స్టార్ క్యాంపెయినర్లు అంటే.. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అని సెటైర్ వేశారు.'రేవంత్ రెడ్డి దుర్మార్గపు పాలనతో పేద ప్రజల మీద పడ్డాడు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని రోటిబండ తండాలో 110 ఎకరాల భూమి కావాలని 400 మంది పోలీసులను పంపించాడు. హైదరాబాద్ లోని నాచారంలో చెప్పులు కుట్టుకునే అతని దుకాణం, పాలు అమ్ముకునే ఆమెది చిన్న డబ్బాను కూడా వదలకుండా కూలగొట్టించాడు. రేవంత్ రెడ్డిని తెలుగు భాషలో ఉన్న తిట్లన్ని తిడుతున్నారు. వేరే వారైతే సిగ్గుతో చచ్చిపోయేవారు. రేవంత్ రెడ్డికి సిగ్గు లేదు కాబట్టి బ్రతుకుతున్నాడు' అని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన ప్రజలు కోపంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు నాయకులు ప్రజల్లోకి వెళ్తే ప్రజలు కొడతారు... ముఖ్యమంత్రి కూడా పోలీస్ సెక్యూరిటీ లేకుండా బయట తిరిగే అవకాశం లేదు. ప్రజలు తిడుతున్న తిట్లకి రేవంత్ రెడ్డి కాకుండా వేరే వాళ్ళు ఉంటే ఆత్మహత్య చేసుకునేవారు తెలుగు భాషలో ఉన్న అన్ని తిట్లను ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిడుతున్నరుఇంత దుర్మార్గమైన పాలన చేయాల్సిన అవసరం కాంగ్రెసుకు ఏమున్నదో ఆలోచించుకోవాలి. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటల మనుషులె కానీ చేతల ప్రభుత్వం కాదు అని అర్థమైంది. తెలంగాణ నలుమూలలో కాంగ్రెస్ పార్టీకి తీవ్రంగా వ్యతిరేకత నెలకొని ఉందని చెప్పారు. అప్పుడప్పుడు సూర్యుడు కూడా మబ్బుల చాటుకు వెళ్తాడు.. కేసీఆర్ కూడా తప్పకుండా తిరిగి ప్రజల ఆశీర్వాదంతో మళ్ళీ అధికారంలోకి వస్తారని పేర్కొన్నారు. సిర్పూర్ కాగజ్నగర్ తో నాకు వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నది. 2006 నుంచి 9 వరకు అక్కడ తెలంగాణ రాష్ట్ర సమితి బలోపేతం పని చేసిన. 2009లో శాసనసభ ఎన్నికల్లో పార్టీ గెలిచింది. రాష్ట్రంలో పది సీట్లు మాత్రమే గెలిచిన సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కూడా గులాబీ జెండా ఎగిరిందని తెలిపారు.

# పేదలకు విదేశీ విద్యను కాంగ్రెస్ దూరం చేస్తోంది : ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఫిబ్రవరి 8:** కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిప్పులు చెరిగారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు నిధులు విడుదల చేయకుండా.. పేదలకు విదేశీ విద్యను దూరం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎంపికై వివిధ దేశాల్లో చదువుకుంటున్న తెలంగాణకు చెందిన విద్యార్థులతో ఏర్పాటు చేసిన జూమ్ మీటింగ్ లో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. దాదాపు 200 మంది విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తుందన్నారు. పేద విద్యార్థులు విదేశాల్లో చదవాలనేది కేసీఆర్ ఆలోచన అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం ఉద్దేశాన్ని తుంగలో తొక్కిందని ఆరోపించారు. పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం ఎందుకు చిన్నచూపు చూస్తోందని నిలదీశారు. స్కాలర్‌షిప్ అందక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దానికోసం వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. రెండో విడత నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## బిసిల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటిసి, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఇటీవల ప్రత్యేకంగా ఒకరోజు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో రెండు బిల్లులు పెడతామని సిఎం ప్రకటించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచడానికి ఒక బిల్లు, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు పెడతామని ప్రకటించారని, కాని బిసిల రిజర్వేషన్‌లను పెంచే బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదని, కేవలం జనాభా లెక్కల మీద మాత్రమే అసెంబ్లీలో పెట్టి బిసిల దృష్టిని మరల్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లు ఎందుకు ప్రవేశపెట్టిలేదని ఆయన సిఎంను ప్రశ్నించారు. సిఎం రిజర్వేషన్‌లు పెంచకుండా కులాల లెక్కలు తప్పుగా చూపిస్తూ ప్రజల దృష్టిని మరల్చడానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

# బల్క్ డ్రగ్ తయారీదారుల సంఘంతో ఉన్నత విద్యామండలి ఎంఒయు

## నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని పెంపొందించడమే లక్ష్యం

### ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** తెలంగాణ ఉన్నత విద్యా మండలి.. బల్క్ డ్రగ్ తయారీ దారుల సంఘం ఆఫ్ ఇండియా (బీడీఎంఏ)తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. విద్యాసంస్థ, ఔషధ పరిశ్రమ మధ్య నైపుణ్య అంతరాన్ని తగ్గించడానికి ఈ అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టా రెడ్డి తెలిపారు. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడి యంట్ (ఏపీఐ) రంగం యొక్క పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి తగిన నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని పెంపొందించడానికి ఈ సహకారం ఒక ముఖ్యమైన అడుగని తెలిపారు. విద్యా శిక్షణను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సమలేఖనం చేయడమే ఎంఓయూ ప్రాథమిక లక్ష్యమన్నారు. ఫార్మా తయారీ, పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డీ), నాణ్యత నియంత్రణ (క్యూసీ), నాణ్యత హామీ (క్యూఏ), మొక్కల నిర్వహణ, భద్రత, నియంత్రణ మరియు పర్యావరణ నిర్వహణ వంటి రంగాలలో అవసరమైన ఆచరణాత్మక జ్ఞానం,సామర్థ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఎంవో యూపై ఉన్నత విద్యా మండలి, బీడీఎంఏ ఆఫీస్‌బేరర్లు శనివారం సంతకం చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, బీడీఎంఏ అధ్యక్షుడు ఆర్‌కె అగర్వాల్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ రామేశ్వరరావు, ట్రెజరర్ అనుప్వీర్ పాల్గొన్నారు. విద్యార్థులకు సరైన నైపుణ్యాలు మరియు అవకాశాలతో సాధికారత కల్పించడంలో ఎంవోయూ ఒక ముందడుగు. విద్యార్థులకు వారి ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, నియామకాలు పరిశోధన కార్యకలాపాలకు కూడా వీలు కల్పించనుంది. నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సృష్టించడమే కాకుండా ఫార్మాస్యూటికల్ మరియు బల్క్ డ్రగ్ తయారీకి కేంద్రంగా తెలంగాణ స్థానాన్ని బలోపేతం చేయనుందని ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు.



## కుల గణనలో బిసిల జనాభాను తగ్గించడం పెద్ద కుట్ర

### బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఎమ్మెల్సీ మ్యాచ్‌ఫిక్సింగ్

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలి

### కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడం వెనుక పెద్ద కుట్ర ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడంవల్ల భవిష్యత్తులో తెలంగాణలోని బీసీలో పోటీ చేసే స్థానాల్లో హిందూ సమాజం గెలిచే పరిస్థితి ఉండబోదన్నారు. గతంలో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 4 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలవాల్సిన స్థానాల్లో ముస్లింలు గెలిచారన్నారు. ఒకవైపు కుల గణన సర్వేలో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి దెబ్బతీస్తున్నారు. ఇంకోవైపు బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి యావత్ హిందూ సమాజాన్నే దెబ్బతీసే ఘోరమైన కుట్ర జరుగుతోందన్నారు. ఇంత అన్యాయం జరుగుతుంటే బీసీ సంఘాలు ఎందుకు స్పందించడం లేదు? వాళ్ల నోళ్లు ఎందుకు మూతపడ్డాయ్?అని మండిపడ్డారు. మేధావులు, పట్టభద్రులు ఈ విషయంలో మౌనంగా ఉండటం సమాజానికే అరిష్టమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణ పాఠం చెప్పాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. మోసకారి కాంగ్రెస్ కు ఢిల్లీ ప్రజలు గాడిద గుడ్డును బహుమతిగా ఇచ్చి తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని రాంనగర్ చౌరస్తా నుండి గీతాభవన్ చౌరస్తా వరకు "పట్టభద్రుల సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు భారీ ఎత్తున యువకులు, ఉద్యోగులు, బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు. ఈ యాత్రకు బండి సంజయ్ తోపాటు మెదక్, ఆదిలాబాద్ ఎంపీలు రఘునందన్ రావు, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త, ఉమ్మడి మెదక్‌నిజామాబాద్ ఆదిలాబాద్‌కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, జిల్లా అధ్యక్షుడు గంగడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల బీజేపీ మేనిఫెస్టోను బండి సంజయ్ ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు.

# అశాస్త్రీయ కులగణనను సరిచేయండి

### సిఎస్ శాంతికుమారికి బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 8:** రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కులగణనలో అశాస్త్రీయ పద్ధతులు అవలంబించిందని బిఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు బీసీలకు అన్యాయం చేసేలా ఉన్న కులగణనను వెంటనే సరిచేయాలని బిఆర్ఎస్ ప్రతినిధుల బృందం... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరింది. ఈ మేరకు శనివారం సాయంత్రం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి నేతృత్వంలో బిఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిశారు. కులగణనలో బీసీల సంఖ్యను తగ్గించి చూపించిన కుట్రను సరి చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ల అంశంలో బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసేందుకే యేదాది పాటు కులగణన కార్యాచరణ చేపట్టకుండా కాల యాపన చేసిందన్నారు. తీరా హడావుడిగా న్యాయ స్థానాల తీర్పులకు విరుద్ధంగా ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా అశాస్త్రీయంగా విద్య,ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ,కుటుంబ,కులగణన సర్వేను చేపట్టిందని ఆరోపించారు. ఈ సర్వేలో 2011 కేంద్ర గణాంకాలు, 2014 సమగ్ర కుటుంబ సర్వేలతో పోల్చితే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన సర్వేల్లో బీసీ కులాల జనాభా సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గిందని ఆరోపించారు. బీసీల ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకుని పొరపాట్లను సరిదిద్దాలని కోరారు. ఆ తర్వాత సచివాలయం మీడియా పాయింట్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ,ఈ ప్రభుత్వం నిండు శాసనసభ సాక్షిగా వెల్లడించిన కులగణన నివేదిక బీసీ అవమానపర్చే, కుట్రగా కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ, కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తున్నదన్నారు.మనదేశంలో జనాభా పెరుగుతుందే తప్ప తగ్గడమనేది జరుగదన్నారు. పార్లమెంట్ లో ప్రతి రోజు రాజ్యాంగం ప్రతిని చేతబట్టుకుని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీకి తెలంగాణలో బీసీలకు జరుగుతున్న అన్యాయం గురించి తెలియదా?అని ప్రశ్నించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బీసీలకు సముచిత గౌరవం దక్కిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో తీవ్ర అన్యాయం చేస్తున్నదని విమర్శించారు.బీసీల పట్ల తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులం ప్రధాని నరేంద్రమోదీని కలిసి వివరిస్తామని, సమన్యాయం కోసం పార్లమెంట్‌లో బలమైన గళాన్ని వినిపిస్తామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి గంగుల మాట్లాడుతూ,గద్దెపై కూర్చున్న తమ గూడు కూల్చుతమంటే ఊర్కోబోమని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేషజాలకు పోకుండా,మొండిపట్టుదల విడనాడి వెంటనే రీ సర్వేకు ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. డెడికేషన్ డే ప్రకటించి సర్వే జరిపించాలని, వివరాలను బహిరంగ పరచి 3 రోజుల పాటు ఎటువంటి అభ్యంతరాలు లేనిపక్షంలో తుది నివేదిక రూపొందించాలని ప్రభుత్వానికి సలహానిచ్చారు. మధుసూదనాచారి మాట్లాడుతూ, జనాభాలో మేమెంతో మాకంత వాటా దక్కాల్సిందేనని స్పష్టం చేశారు.రాష్ట్ర జనాభాలో బీసీలు 53శాతం ఉంటే,అది కేవలం 46శాతం అంటూ తప్పుడు లెక్కలు చూపి ప్రభుత్వం తమ గొంతు కోసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన హక్కుల సాధనకు, వాటా దక్కించుకునేందుకు బిఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ,తమ బీసీ జాతి జనాభాను తక్కువగా చూపి అవమానిస్తే, అణగదొక్కాలని చూస్తే సహించబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.తమిళనాడు తరహాలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 42 రిజర్వేషన్ల అమలుపర్చాలని,వాటికి చట్టబద్దత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్ఎస్ ప్రముఖులు డాక్టర్ ఆంజనేయ గౌడ్,ఉపేంద్రాచారి,కోటి కిశోర్ గౌడ్ తదితరులు సీఎస్ శాంతకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.




శనివారం సాయంత్రం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం

# పదేళ్ల అరాచకానికి తెర

### ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అవినీతి, అక్రమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు

### డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల వల్ల వేగంగా అభివృద్ధి: ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి8,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అవినీతి,అక్రమ ప్రభుత్వంపై సామాన్య,మధ్యతరగతి ప్రజల విజయానికి ప్రతీక అని ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో అభివృద్ధి అనుహ్యాంగా జరుగుతుందన్నారు. విశ్వవ్యాప్తంగా దేశంలో ఎన్డీఏ ప్రభుత్వ విధానాలను మెచ్చుకుంటున్నారన్నారు. ప్రపంచపటంలో ఆర్థికంగా, సాంకేతికంగా భారతదేశం అత్యున్నత స్థాయిలో ఉండటానికి ప్రధాని నరేంద్రమోడీ విధానాలే కారణమన్నారు.ఢిల్లీలో అందుకు భిన్నంగా 10 ఏళ్ళకుపైగా అరాచక విధా నాలతో, అభివృద్ధి నిరోధక పాలన సాగిందన్నారు.ఆర్థిక నేరాల్లో ఆప్ నాయకులు కీలకంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచారన్నారు. ప్రపంచ నగరాలకు దీటుగా నిలవాల్సిన ఢిల్లీని కేజ్రీవాల్ కాలుష్యనగరం మార్చారన్నారు. డిల్లీలోని తెలుగువారంతా బిజెపి అండగా నిలవడం అభినందనీయమన్నారు. తాము ప్రచారం చేసిన ప్రాంతాల్లో బిజెపికి విజయం అందిం చిన ఆయా నియోజకవర్గాల ప్రజలకు సీఎం చంద్ర బాబు కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయం మొత్తం దేశ ప్రజలను జాగృతం చేస్తోందన్నారు.



**ఆప్‌ను ప్రజలు తిప్పికొట్టారు: కేంద్రమంత్రి పెమ్మసాని**

ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకోలేదని కేంద్రమంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ అన్నారు. ఏబీఎన్‌తో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. సంక్షేమం, తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టాలని కేజ్రీవాల్ చూశారని విమర్శించారు.

# కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చూస్తే జాలి కలుగుతోంది

### సరైన సమయంలో ప్రజలు తీర్పు ఇస్తారని మళ్లీ నిరూపితమైంది: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఢిల్లీ అభివృద్ధిలో కేజ్రీవాల్ ప్రభుత్వం విఫలమైందని అందుకే ప్రజలు వారిని ఓడించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోపిడీ పాలనను కొనసాగించిన కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించారు అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఘన విజయం వైపు నడిపించిన ఢిల్లీ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు అన్నారు. ఈ విజయానికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తెలుగు ప్రజల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కేజ్రీవాల్‌తో పాటు అనేక ముఖ్యమైన నేతలు ఓటమి చెందారన్నారు. ప్రజలు ఒకసారి నిర్ణయం తీసుకుంటే, అది కేజ్రీవాల్, రాహుల్ గాంధీ, కెసిఆర్ ఎవరూ మార్చలేరు అన్నారు. సరైన సమయంలో ప్రజలు తీర్పు ఇస్తారని మరోసారి నిరూపితమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చూస్తే జాలి కలుగుతుందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన తర్వాత, కాంగ్రెస్ ఓటములను కంప్యూటర్ ద్వారా లెక్కపెట్టాల్సిన స్థితి ఏర్పడిందని, రాహుల్ గాంధీ నాయకత్వంపై కాంగ్రెస్ కార్యకర్తలకే విశ్వాసం లేదు. దేశ ప్రజలు ఎలా విశ్వసిస్తారు? అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ డబుల్ హ్యాట్రిక్ ఓటమిని మూటగట్టుకుందని, 2014, 2019, 2024 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెద్దసున్నా. 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదన్నారు.

ఢిల్లీ అభివృద్ధిలో కేజ్రీవాల్ ప్రభుత్వం విఫలమైందని, దోపిడీ పాలనను కొనసాగించిన కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించారన్నారు. హర్యానాలో బిజెపి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ద్వారా, ఆప్ పార్టీ తమ నీచ రాజకీయాలను బయట పెట్టుకుందన్నారు. హర్యానా రాష్ట్ర ప్రభుత్వమైన బిజెపి యమునా నదిలో విషం కలిపిందని నీచపు ఆరోపణలు చేసి దిగజారారు అన్నారు. రాజ్యాంగాన్ని మార్చుతారని కాంగ్రెస్ గతంలో తప్పుడు ప్రచారం చేసింది, అయితే ప్రజలు వారి మాటలను నమ్మలేదు. ఎన్నికల్లో ఆ పార్టీని తిరస్కరించారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్లి, తెలంగాణ అభివృద్ధి చేస్తున్నామంటూ భారీ ప్రకటనలు ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రచారం చేసిన మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 16 సీట్లు గెలుచుకోగా, ఢిల్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి గుండుసున్నా వచ్చిందన్నారు. కాని, రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ ఫ్రంట్‌ను మహారాష్ట్ర ఎన్నికల్లో ఓడించి, గతంలో ఎన్నడూలేని విధంగా నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే భాగస్వామ్య పార్టీలను ప్రజలు గెలిపించారన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో, జైల్లో నుంచే పరిపాలన చేసిన ఏకైక సిఎం కేజ్రీవాల్ అన్నారు. అవినీతి ఆరోపణలతో, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే లిక్కర్ కేసులో జైలుకెళ్లి స్వాతంత్ర్య పోరాటం చేసిన మాదిరిగా జైలునుంచే పరిపాలన చేసి దుర్మార్గపు ఆలోచనతో కేజ్రీవాల్ పనిచేశారన్నారు. అందుకే కేజ్రీవాల్ డ్రామాలకు ప్రజలు అర్థం చేసుకుని తీర్పునిచ్చారన్నారు. కేజ్రీవాల్ అవినీతి ఆరోపణలతో, లిక్కర్ స్కాంలో జైలుకెళ్లి, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు, కేజ్రీవాల్ గతంలో సామాన్య ప్రజల కోసమే రాజకీయాల్లోకి వచ్చామంటూ అనేక రకాలుగా ఉపన్యాసాలు ఇచ్చారు. కాని, ఆయన నిజస్వరూపం తెలిసుకుని ప్రజలు ఓడించారన్నారు. 2025లో కాదు కదా 2050లో కూడా ఆప్‌ను ఎవ్వరూ ఓడించలేరు, ఆప్‌ను ఓడించాలంటే నరేంద్ర మోడీ మరో జన్మ ఎత్తాలంటూ అహంకారంతో ఉపన్యాసాలు ఇచ్చిన కేజ్రీవాల్‌కు ప్రజలు సరైన బుద్ధిచెప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లోనూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిజెపి విజయం సాధించడం ఖాయం. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో కాంగ్రెస్ భవిష్యత్తు అంధకారమే అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం కొనసాగుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ సమానంగా కొనసాగేలా మోడీ పాలన అందిస్తున్నారన్నారు. గతంలో అవినీతికి వ్యతిరేకంగా చేసిన అన్నాహజారే ఉద్యమానికి అందరం స్వాగతం పలికాం. కాని కలుపుమొక్కలా కేజ్రీవాల్ బయటకు వచ్చి, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక లిక్కర్ స్కాంలో, కుంభకోణాల్లో మునిగితేలారు. అందుకే ప్రజలు తన నిజ స్వరూపాన్ని గుర్తించి కేజ్రీవాల్‌ను ఓడించారంటూ కిషన్‌రెడ్డి అన్నారు.



శనివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# మిస్సింగ్ కేసుల ఛేదనలో పోలీసు రికార్డు

### ట్రేసింగ్ 91 శాతం పైమాటే

### మహిళా భద్రతా విభాగం చొరవతో తప్పిపోయిన వారిని చాలా యేళ్లయినా కనిపెడుతున్న పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిస్సింగ్ కేసుల ఛేదనలో పోలీసు శాఖ మెరుగైన ఫలితాలను అందుకుంటోంది. ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం మిస్సింగ్ కేసుల ఛేదనలో తెలంగాణ పోలీసులు 91 శాతం పైగా ఫలితాలు సాధిస్తుండడం గమనార్హం. ఈ విషయంలో పోలీసు శాఖకు మహిళా భద్రతా విభాగం (డబుృఎస్‌డబ్ల్యు)తో పాటు యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ (ఎహెచ్‌యు) యూనిట్ విభాగాలు సహకరిస్తుండడం విశేషం. మిస్సింగ్ కేసుల ఛేదనలో 2022లో 96.64 శా తం, 2023లో 94.83 శాతం ఫలితాలను అందుకోగా 2024లో 91.12 శాతం ఫలితాలు సాధించింది. దేశ వ్యాప్తంగా వున్న పోలీసు విభాగాలతో పోలిస్తే టి. పోలీసు విభాగానికి అనేక అంశాలలో ప్రత్యేక శైలి వుండడం తెలిసిందే. 2014 వరకు ఉమ్మడి ఎపిలో వున్న టి.పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్రం తరువాత మరింత పురోగమించిందనడంలో ఎలాంటి సందేహం లేదు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణలో మంచి మా ర్కులు సాధించడంతో పాటు టెక్నాలజిని వాడడంలో టి. పోలీసులు దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచి శహభాష్ అనిపించుకుంటూ ఇప్పుడు మిస్సింగ్ కేసుల ఛేదనలో మెరుగైన ఫలితాలను సాధిస్తోంది. ఒకప్పుడు మిస్సింగ్ కేసుల ఛేదన 50 శాతం లోపేనంటే అతిశయోక్తి కాదు. ఐదారేళ్లుగా మిస్సింగ్ కేసులను తీవ్రంగా పరిగణిస్తున్న సిఐడి విభాగం, ఈ విభాగానికి తోడుగా వున్న డబ్ల్యుఎస్‌డబ్ల్యు, ఈ విభాగంలో కీలకంగా వున్న ఎహెచ్‌యు సహకారంతో కనిపించకుండా పోయిన వారిని స్వల్ప వ్యవధిలోనే పట్టుకుని అయిన వారికి అప్పగిస్తోంది. దీనికి తోడుగా చిన్న వయస్సులో తప్పిపోయిన వారిని పదేళ్లు, 15 ఏళ్ల తరువాత వారి ముఖ కవళికలు ఎలా మారివుంటాయనే దానిని నిర్ధారించే కంప్యూటర్ విభాగం సహకారంతో నాలుగైదేళ్ల వయస్సులో కనిపించకుండా పోయిన వారిని 17 ఏళ్ల నుంచి 20 ఏళ్ల వయస్సులో ఎక్కడో సుదూర ప్రాంతంలో వుండగా గుర్తించి వెతికి పట్టుకుని డిఎన్ఎ పరీక్షలు చేసి మరీ అయిన వారికి అప్పగిస్తున్న ఉదంతాలు వున్నాయి. ఆపరేషన్ ముస్కాన్‌తో ప్రతీయేటా రాష్ట్ర వ్యాప్తంగా ఐదారు వేల మంది బాలలను గుర్తిస్తున్న పోలీసులు అందులో ఆచూకీ తెలిసిన వారిని వారి కుటుంబీకులకు అప్పగిస్తుండగా మిగతా వారు దారితప్పకుండా విద్యాబుద్ధులు నేర్పించి, ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పనిచేసే హోంలలో చేరుస్తున్నారు. ఇలా హోంలలో చేరుతున్న బాలల బాగోగులను డబ్ల్యుఎస్ డబ్ల్యు నేరుగా పర్య వేక్షిస్తుండడం గమనార్హం. మిస్సింగ్ కేసుల ఛేదనలో పోలీసులకు ఉపకరిస్తున్న మరో అంశం సిసి కెమెరాలు. గతంలో సిసి కెమెరాలు అందుబాటులో వుండేవి కావు. కానీ నేడు సిసి కెమెరాలతో పాటు సెల్‌ఫోన్లు అందుబాటులో వచ్చాక మిస్సింగ్ కేసుల ఛేధన పోలీసులకు మరింత సులువైందని సిఐడి అధికారులు చెబుతున్నారు. సిసి కెమెరాల ఆధారంగా, బాలికల్లో ఇద్దరి వద్ద వున్న సెల్‌ఫోన్ల ఆధారంగా 24 గంటల్లో వారు ఎక్కడ వున్నారన్నది పోలీసులు తెలుసుకోగలిగారు. ఇదే విధంగా హైదరాబాద్‌లో కనిపించకుం డా పోయిన ఇద్దరు బాలురు యుపిలోని ఓ రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డారు. వీరిని సిసి కెమెరాల ఆధారంగా పట్టుకున్నారు. 2014 ఆగస్టు నెలలో హైదరాబాద్‌లోని పా తబస్తీలో కనిపించకుండా పోయిన మహమ్మద్ ఖలీల్ అనే 12 ఏళ్ల బాలుడిని పదేళ్ల తరువాత యుపిలోని ప్రయోగరాజ్‌లో ఒక విశ్రాంత ఉపాధ్యాయుడి వద్ద పెరుగుతున్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

# విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు!

### పరీక్షల్లో ఫెయిలవుతామనే ఆందోళనే ప్రధాన కారణం

### ఒత్తిడి తట్టుకోలేక.. వేధింపులతోనూ సూసైడ్‌లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే కాకుండా.. దేశంలో కూడా గత కొంత కాలంగా విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయంతోనే ఎక్కువ మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పరీక్షలు రాసిన తరువాత ఆత్మహత్యలకు ప్రయత్నించే వారు ఎక్కువగా ఉంటున్నారు. కొంత మంది పరీక్షలను సరిగా రాయలేమని భావించి ముందుగానే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొంత మంది చదువుల ఒత్తిడిని తట్టుకోలేక సూసైడ్ చేసుకుంటున్నారు. పరీక్షలకు సంబంధించి పోటీ పరీక్షలతోపాటు.. విద్యార్థుల వార్షిక పరీక్షలకు భయపడి ముందుగానే ఆత్మహత్యలకు పాల్పడే వారు కొందరైతే.. పరీక్షల అనంతరం ఆత్మహత్యలకు పాల్పడేవారు మరికొందరుంటున్నారు. నీట్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షల్లో పాస్ కాలేమని భావించి ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి సంఖ్య దేశంలో ఎక్కువగా ఉంటుంది. ఆ తరువాత ఇంటర్మీడియట్ స్థాయిలోని వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయంతో మరణిస్తున్న వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంటుంది. ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఇటు ఇంటర్ బోర్డుతోపాటు సెంట్రల్ బోర్డులైన సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. గత మూడేళ్లల్లో నీట్ పోటీ పరీక్షల్లో నెగ్గలేమని ఒత్తిడితో మరణించిన వారి సంఖ్య 100కి పైగానే ఉన్నట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో ప్రధానంగా రాజస్థాన్‌లోని కోటా నగరంలోనే ఎక్కువగా ఉంటున్నాయి. ఒక్క గత ఏడాదిలోనే 25 మంది విద్యార్థుల వరకు సూసైడ్‌కి పాల్పడినట్టు స్థానిక పోలీసు లెక్కలు చెబుతున్నాయి. నీట్‌తోపాటు జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌కి సంబంధించిన ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు కూడా సూసైడ్ బాట పడుతున్నారు. విద్యార్థులు తాము నీట్‌ను, జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను చదవలేమని తల్లిదండ్రులకు చెబుతున్నప్పటికీ.. వారి పేరెంట్స్ వినకుండా.. వారిని కోచింగ్ సెంటర్లలో చేర్పించడంతో.. తాము తప్పకుండా పోటీ పడాల్సి వస్తున్న నేపథ్యంలో.. తాము ఎలాగూ నీట్‌లో ర్యాంక్‌ను సాధించలేమని భావించి ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పోటీ పరీక్షలే కాకుండా.. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల మూలంగా కూడా ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఇంటర్మీడియట్‌లో బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్నందున.. బోర్డు పరీక్షల్లో ఫెయిలావుతామనే భయంతో పరీక్షలు జరిగిన తరువాత విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు.

కాలేజీలు, స్కూల్స్‌లో ఉపాధ్యాయులు, యాజమాన్యాల వేధింపులను భరించలేక.. తోటి విద్యార్థుల ముందు అవమానపరిస్తే తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో రెసిడెన్షియల్ విధానంలో హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంటి నుంచి కాకుండా హాస్టల్‌లో ఉంచి చదివించడంతో.. వారు ఒత్తిడిని తట్టుకోలేక.. మిగిలిన వారితో కలవలేక.. అక్కడి సిబ్బంది, లెక్చరర్ల వేధింపులను తట్టుకోలేక సూసైడ్‌లకు పాల్పడుతు న్నారు. రెండు రోజుల క్రితం పాఠశాల యాజమాన్యం అవమానించడంతో 10వ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జరిగిన వియం తెలిసిందే. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలను నివారిం చడం కోసం.. టెలీ మానస్‌ను ఏర్పాటు చేసింది.

వార్షిక పరీక్షల ఒత్తిడి నుంచి బయటపడటం కోసం మానసిక నిపు ణుల(సైక్యాట్రిస్టు)తో మాట్లాడిస్తారు. ఒత్తిడికి గురైన విద్యార్థులు కావొచ్చు.. పరీక్షలంటే భయ పడే వారు టెలీ మానస్‌కు ఫోన్ చేస్తే వారు ఒత్తిడి నుంచి బయట పడటానికి.. భయాన్ని పోగొట్టడానికి వైద్య నిపుణులు సూచనలు, సల హాలను ఇస్తుంటారు. టెలీ మానస్ ఏర్పాటు చేసిన తరువాత అక్టోబర్ 2022 నుంచి జనవరి 2025 వరకు 1,28,095 మంది ఫోన్ కాల్స్ చేశారు. వారిలో విద్యార్థులు 9214 మంది ఉన్నారు. టెలీ మానస్‌కి ఫోన్ చేసే విద్యార్థులకు ఒత్తిడి నుంచి బయట పడటానికి, పరీక్షల భయాన్ని పోగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. తాము పరీక్షల్లో ఫెయితామని.. అందుకే సూసైడ్ చేసుకోవానుకుంటున్నామని ఫోన్ చేసి మాట్లాడుతున్నారు.

# ఆప్ ఓటమి, చతికిలపడిన కాంగ్రెస్

### కానరాని విపక్షాల ఐక్యత!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని ఏడుకు ఏడు సీట్లు వరుసగా మూడు సార్లు క్లీన్‌స్వీప్ చేసిన ఆ పార్టీ తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటింది. తాజా విజయంతో తన పంతాన్ని నెగ్గించుకుంది. ఇక గతంలో దాదాపు 15 ఏళ్ల పాటు నిర్విరామంగా ఢిల్లీని ఏలిన కాంగ్రెస్ పార్టీ సున్నాకే పరిమితం అయింది. ఈ ఎన్నికల ఫలితాలు బిజెపి పట్టుదలను నిరూపించగా అదే సమయంలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కలిపి పోటీచేసి ఏడాది తిరగకముందే మళ్లీ విడివిడిగా పోటీ చేయడంతో ఇండియా కూటమి ఐక్యతపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా ఢిల్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీకి, కాంగ్రెస్‌కు మధ్య మొదటి నుంచి పిల్లి,ఎలుక వైరమే. 2013లో తొలిసారి ఆమ్ ఆద్మీ పార్టీ అధికారం చేపట్టింది కూడా కాంగ్రెస్ అధికారాన్ని కూలదోసే! ఆ ఎన్నికల్లో 28 సీట్లు గెలుపొందిన ఆమ్ ఆద్మీ పార్టీ అదే కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. అయితే 49 రోజులకే ఆ ప్రభుత్వం కుప్పకూలింది. మళ్లీ 2015 ఎన్నికల్లో ఏకంగా 67 సీట్లలో, 2020 ఎన్నికల్లో 62 సీట్లతో వరుస ఘన విజయాలు సాధించింది. ఆయా ఎన్నికల్లో బిజెపి రెండో స్థానంలో నిలువగా కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. ఒక్క ఢిల్లీలోనే కాదు పంజాబ్‌లోనూ కాంగ్రెస్‌ను కూలదోసి ఆప్ అధికారంలోకి వచ్చింది. అంటే రెండో చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వాలకు గండి కొట్టింది ఆమ్ ఆద్మీనే. 2024 లోక్‌సభ న్నికలకు ముందు బిజెపి విజయాన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఇండియా కూటమి ఏర్పడింది. ఆ ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక పార్టీలన్నీ జట్టు కట్టాయి. ఢిల్లీలో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేశాయి. అయినా ఏడుకు ఏడు సీట్లు బిజెపి ఖాతాలోనే పడ్డాయి.



పంజాబ్‌లో మాత్రం మళ్లీ వేర్వేరుగా పోటీ పడ్డాయి. అక్కడ ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన పోటీ నడిచింది. కాంగ్రెస్ 7, ఆప్ 3 స్థానాలు గెలుచుకున్నాయి. మళ్లీ హర్యానాలో 10 స్థానాలకు గాను రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. ఇక్కడ బిజెపి, ఇండియా కూటమి పార్టీలు అయిదేసి స్థానాలు గెలుపొందాయి. అక్కడికి కొన్ని రోజులకే జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేసి బిజెపి విజయం సాధించడం గమనార్హం. ఇండియా కూటమిలో ఆప్, కాంగ్రెస్ మాత్రమే కాదు ఇతర పార్టీలదీ అదే వైఖరి. కేరళలో కాంగ్రెస్, సిపిఎం నేతృత్వంలోని కూటమిల మధ్య పోటీ నడిచింది. పశ్చిమబెంగాల్‌లో వచ్చేసరికి అవే రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. ఇండియా కూటమిలో భాగమైన తృణమూల్ కాంగ్రెస్ వేరుగా పోటీ చేసింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే సీన్ రిపీట్ అయింది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఓ దశలో ఇండియా కూటమిలో కాంగ్రెస్ ఉండకూడదన్న డిమాండ్‌ను ఆప్ తెరపైకి తీసుకొచ్చింది. ఈ ఘటన ఈ రెండు పార్టీల మధ్య వైరాన్ని పెంచిందనే చెప్పాలి. కూటమిలోని పార్టీలైన సమాజ్‌వాది పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ ఆమ్ ఆద్మీ పార్టీకి జైకొట్టాయి. కాంగ్రెస్‌ను ఒంటరిగా వదిలేశాయి. ఆప్, కాంగ్రెస్ కలిసి పనిచేసి ఉంటే ఫలితం ఇంకోలా ఉండేదని విశ్లేషకులు అంటున్నారు.

# 'మజాకా'లో నటించడం అదృష్టం

పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా 'మజాకా'కిధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈచిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ హైలీ ఎంటర్ టైనింగ్ మూవీ శివరాత్రి కానుకగా ఫిబ్రవరి 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అన్షు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.


హీరోయిన్ అన్షు

**మీ పూర్తి పేరు అన్షు అంబానీ నా?** అంబానీ అనేది చాలా పాపులర్ సర్ నేమ్. అయితే నా ఇంటిపేరు అది కాదు. అసలు అంబానీ అనే పేరు నాకు ఎలా వచ్చిందో కూడా తెలీదు. నా వికీపీడియాలో కూడా అదే పేరు వుంది. అక్కడ ఎలా మార్చాలో కూడా తెలీదు. మీలాంటి వారు ఎవరైనా హెల్ప్ చేస్తే బావుంటుంది.(నవ్వుతూ) నా పేరు అన్షు. **రెండు, మూడు సినిమాల తర్వాత మళ్ళీ తెరపై కనిపించకపోవడానికి కారణం?** నేను 15 ఏళ్లకే ఇండస్ట్రీలో వచ్చేశాను. అప్పటికి అంత ఎమోషనల్ మెచ్యూరిటీ లేదు. ఒకవేళ మన్మధుడు నా 25 ఏళ్ల వయసులో చేసి వుంటే సినిమాల్లోనే కొనసాగడానికి ఆలోచించేదాన్ని. అప్పటికి నా చదువు కూడా పూర్తి కాలేదు. లండన్ వెళ్ళిపోయాను. కాలేజ్ పూర్తి చేసి మాస్టర్స్ చేశాను. సైకాలజిస్ట్ అయ్యాను. సొంతగా క్లీనిక్ పెట్టాను. 24 ఏళ్లకి పెళ్లి చేసుకున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. **మీ రీఎంట్రీ కోసం ఈ కథని సెలెక్ట్ చేసుకోవడానికి కారణం?** మజాకా లక్కీ స్టోరీ. నాకు చాలా నచ్చింది. ప్రసన్న ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. నవ్వుతూనే వున్నాను. నా క్యారెక్టర్‌కు చాలా ఇంపార్టెన్స్ వుంది. చాలా హెవీ రోల్. 23 ఏళ్ల తర్వాత నేను మళ్ళీ తెరపై కనిపిస్తున్న ఈ సినిమా అందరిని అలరిస్తుందని, నా పెర్ఫార్మెన్స్ ని అందరూ ఇష్టపడతారనే నమ్మకం వుంది. **20 ఏళ్ల తర్వాత మళ్ళీ సెట్స్ లోకి రావడం ఎలా అనిపించింది?** చాలా నెర్వస్ ఫీలయ్యాను. న్యూ కమ్మర్‌లానే అనిపించింది. అయితే టీంలో అందరూ ఎంతోసపోర్ట్ చేశారు. రెండురోజులు తర్వాత కుదురుకుంది.

ఎంటర్టైనర్లో రీతు వర్మ హీరోయిన్. మన్మధుడు ఫేమ్ అన్షు, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్‌కి

# 'అఖండ:2' ఫైట్ షూటింగ్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ అఖండ 2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. వారి మునుపటి బ్లాక్ బస్టర్ అఖండకు ఈ సీక్వెల్ యాక్షన్, ఇంటెన్స్ నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన ఈ చిత్రాన్ని ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. మోస్ట్ టాలెంటెడ్ ఆది పినిశెట్టి తన కెరీర్‌లో ఒక ఎక్సయిటింగ్ చాప్టర్ని మార్క్ చేస్తూ, ఈ చిత్రంలో పవర్ ఫుల్ పాత్రను పోషించబోతున్నారు. సరైనోడు సినిమాలో ఆదిని ఇంటెన్స్ పాత్రలో చూపించిన దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఆయన కలిసి చేస్తున్న రెండవ సినిమా ఇది. అన్ని పాత్రలకు గొప్ప ప్రాముఖ్యత ఇవ్వడంలో పేరుపొందిన బోయపాటి, ఆది పాత్రను పెరోషియస్‌గా రూపొందించారు, ఇది తన కెరీర్‌లో మోస్ట్ ఇంపాక్ట్ పాత్రల్లో ఒకటిగా నిలుస్తుంది. ఆది ఈ మూవీలో కొత్త లుక్ లో కనిపించనున్నారు. బాలకృష్ణ, ఆది మధ్య జరిగే పేస్ ఆఫ్ అభిమానులకు ఫీస్ట్ అందించబోతోంది. ప్రస్తుతం, ఈ సినిమా షూటింగ్ అన్నపూర్ణ 7 ఎకర్స్ లో ఆర్ట్ డైరెక్టర్ ఎఎస్ ప్రకాష్ నిర్మించిన గ్రాండ్ సెట్‌లో జరుగుతోంది, అక్కడ బ్రెత్ టేకింగ్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌ను రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షిస్తున్నారు. బాలకృష్ణ, ఆది పినిశెట్టి ఇద్దరూ ఈ యాక్షన్‌ప్యాక్డ్ షూట్‌లో పాల్గొంటున్నారు, వారి పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులను తమ సీట్ల ఎడ్జ్ లో ఉంచుతాయి. ఈ సన్నివేశం సినిమా లోని మెయిన్ హైలైట్లలో ఒకటిగా ఉండనుంది. బాలకృష్ణ పాత్రను మోస్ట్ డైనమిక్‌గా రూపొందించారు బోయపాటి. భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సీక్వెల్‌లో సంయుక్త ఫీమేల్ లీడ్‌గా కనిపించనుంది. సంగీత సంచలనం ఎస్ థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు, సినిమాటోగ్రాఫర్ సి రాంప్రసాద్, ఎడిటర్ తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్టర్ ఎఎస్ ప్రకాష్ వంటి అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. అఖండ 2 పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ చిత్రం దసరా పండుగ సందర్భంగా సెప్టెంబర్ 25, 2025న థియేటర్లలోకి రానుంది. నటీనటులు: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను.



# తెలుగులో హారిసన్ ఫోర్డ్ క్లాసిక్ మార్వెల్- కెప్టెన్ అమెరికా

థ్రిల్లింగ్ యాక్షన్ సన్నివేశాలు, పవర్ ఫుల్ ఫైట్లతో కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది, ఇది ఎంసియు యొక్క ఆరవ భాగం. లెజెండరీ నటుడు హారిసన్ ఫోర్డ్ పోషించిన రెడ్ హల్క్ పాత్రను పరిచయం చేయడంతో ఈ చిత్రం ఏమి ఈసారి ఏమి చెప్పబోతుందో చూడటానికి అభిమానులు ఉత్సాహంగా ఉన్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల అవుతుంది. కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్ చిత్రీకరణ సమయంలో ఎంసియులోకి (మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్) అడుగుపెడుతున్నప్పుడు తన అనుభవాన్ని పంచుకుంటూ, ఫోర్డ్ తనపాత్ర యొక్క పవర్ ఫుల్ డైనమిక్స్‌తో పాటు రాజకీయ కుట్రలో మునిగిపోవడం గురించి చెప్పారు. కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్ హై స్టేక్స్ యాక్షన్‌ను ఆకర్షణీ యమైన కథనంతో ఎలా మిళితం చేస్తుందో ఆయన హైలైట్ చేస్తూ, అవును, దీనికి చాలా పొలిటికల్ థ్రిల్లర్ అంశం ఉంది. కొన్ని అద్భుతమైన విషయాలు ఉన్నాయి, బలమైన భావోద్వేగ పాత్ర కథ కూడా ఉంది. మార్వెల్ పాత్రలు ఖచ్చితంగా వారి వ్యక్తిత్వాలకు చెందిన ఆసక్తికరమైన అంశాలను కలిగి ఉంటాయి, అద్భుతమైన పాత్రలో నేను వెతుకుతున్నది భావోద్వేగ వాస్తవికత, మరియు జరుగుతున్న అన్ని అద్భుతమైన విషయాలకు కొంత మానవ ప్రవర్తన మరియు సందర్భాన్ని అందిస్తుంది. అన్నారు. జూలియస్ ఓనా దర్శకత్వం వహించిన కెప్టెన్ అమెరికా: బ్రేవ్ న్యూ వరల్డ్, ఆంథోనీ మాకీ, హారిసన్ ఫోర్డ్, డానీ రామిరేజ్, షిరా హాస్, జోషా రోశ్వోర్, కార్ల్ లంబ్లీ, లివ్ టైలర్, టిమ్ బ్లేక్ నెల్సన్ నటించారు.




అవనీత్ కౌర్ నయా లుక్

# 'జాక్ కొంచెం క్రాక్' టీజర్ రిలీజ్

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ పుట్టిన రోజు సందర్భంగా 'జాక్ కొంచెం క్రాక్' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది. సిద్ధు బర్త్ డే స్పెషల్‌గా మేకర్లు జాక్ టీజర్‌ను విడుదల చేశారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సిద్ధ, భాస్కర్ కాంబోలో అదిరిపోయే ఓ వినోదాత్మక చిత్రం రాబోతోందని టీజర్ స్పష్టంగా చెబుతోంది. టీజర్‌లో సీనియర్ నటుడు నరేష్, సిద్ధు మధ్య వచ్చే తండ్రీ కొడుకులకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయని అర్థం అవుతుంది. ఇక హీరోల పాత్రలోని డిఫరెంట్ షేడ్స్ ఈ టీజర్‌లో చూపించారు. అసలు హీరో ఏంటి? ఏ ఉద్యోగం చేస్తున్నాడు?



అతని లక్ష్యం ఏంటి? అతని గమ్యం ఏంటి? ఈ ప్రేమ పోరాటాలు ఏంటి? ఈ ప్రేమ కథ ఏంటి? అని ఇలా రకరకాల ప్రశ్నలు తలెత్తేలా, సినిమా మీద ఆసక్తి పెంచేలా టీజర్‌ను కట్ చేశారు. సిద్ధు నుంచి మరొక బ్లాక్ బస్టర్ రాబోతోందని ఈ టీజర్ చెప్పకనే చెబుతోంది. సిద్ధు స్టైలిష్ లుక్స్, యాక్టింగ్‌కు మరోసారి ఆడియెన్స్ మెస్మరైజ్ కానున్నారు. వైష్ణవి చైతన్య, సిద్ధు జంట చాలా రిఫ్రెషింగ్‌గా అనిపిస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ ఈ సారి తన శైలిని పూర్తిగా పక్కన పెట్టి ఏదో సందేశాన్ని ఇస్తూనే కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించారని అర్థం అవుతోంది. ప్రముఖ నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ నేతృత్వంలోని అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, బ్రహ్మాజీ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అచ్చు రాజమణి స్వరాలు సమకూర్చారు.

# 14న 'బ్రహ్మా ఆనందం'

మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి హ్యాట్రిక్ హిట్ల తరువాత స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి 'బ్రహ్మా ఆనందం' అనే చిత్రం ఫిబ్రవరి 14న రాబోతోంది. ఈ చిత్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత బ్రహ్మానందం, అతని కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీమతి సావిత్రి,శ్రీ ఉమేష్ కుమార్ సమర్పణలో రూపొందించిన ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు ఆర్‌విఎస్ నిఖిల్ అద్భుతంగా తెరకెక్కించారు. విజయవంతమైన నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాను భారీఎత్తున నిర్మించారు. ప్రమోషన్స్‌లో భాగంగా నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా మీడియాతో చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆయన ఏం చెప్పారంటే? 'బ్రహ్మానందం' టైటిల్ మాకు దొరకలేదు. 'బ్రహ్మా ఆనందం' అని చివరకు మార్చాను. మా టీంలో కో డైరెక్టర్ వీరు ఆ టైటిల్‌ను డిజైన్ చేశారు. నా ప్రతీ సినిమాను సొంతంగానే నిర్మించాను. ఈ మూవీని కూడా నా బ్యానర్ మీదే సొంతంగానే తీశాను. ఎలాంటి కొలాబరేషన్ పెట్టుకోలేదు. తాత, మనవడు రిలేషన్, కథ నాకు బాగా నచ్చింది. మంచి ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. మా తాత కూడా నన్ను సక్సెస్‌ఫుల్‌గా చూడాలని అనుకున్నారు. కానీ మళ్లీ రావా ట్రైలర్‌లోనే ఆయన స్వర్గస్థులయ్యారు. మా తాతకి నివాళిగా ఈ సినిమా ఉంటుందని కథకు ఓకే చెప్పా. బ్రహ్మానందం అనే టైటిల్‌తోనే దర్శకుడు అప్రోచ్ అయ్యారు. బ్రహ్మానందం నటించకపోతే ఈ సినిమా తీయలేం. అదే విషయాన్ని ఆయనకు కూడా చెప్పాం. కథ విన్న తరువాత బ్రహ్మానందంకి కూడా చాలా నచ్చింది. ఇంత వరకు ఆయన్ని చూడనటువంటి పాత్రల్లో, ఎమోషన్స్‌లో చూస్తారు. ప్రస్తుతం బ్రహ్మానందం ఎక్కువ సినిమాల్ని చేయడం లేదు. చాలా సెలెక్టివ్‌గా పాత్రల్ని ఎంచుకుంటున్నారు. రంగమార్తాండ చూశాక ఆడియెన్స్ బ్రహ్మానందంని చూసే కోణం మారిపోయింది. కమెడియన్ అంటే కేవలం నవ్విస్తారనే ముద్ర వేస్తాం. కానీ బ్రహ్మానందం అద్భుతమైన నటులు. ఈ కథ నచ్చి బ్రహ్మానందం వెంటనే ఓకే చెప్పారు. హీరో పాత్ర కోసం చాలా మందిని ట్రై చేశాం. వెన్నెల కిషోర్ పేరుని బ్రహ్మానందం రికమెండ్‌చేశారు. ఆయనకు కూడా స్క్రిప్ట్‌పంపాం. ఆయన స్క్రిప్ట్ చదువుకున్నారు. హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ కాకుండా.. ఫ్రెండ్ క్యారెక్టర్ గిరి బాగుంటుంది చేస్తానని వెన్నెల కిషోర్‌అన్నారు. ఆ తరువాత రాజా గౌతమ్ పేరు చర్చల్లోకి వచ్చింది. కానీ అతను చేస్తే బాగుంటుందా?అని నాలో అనుమానం కలిగింది. కానీ రాజాని కలిసిన తరువాత అభిప్రాయం మారింది. అతని షేక్ హ్యాండ్ఇచ్చిన విధానం నాకునచ్చింది.సినిమాని కొన్ని లెక్కలతో తీస్తే కచ్చితంగా లాభాలు వస్తాయి. మనం ఎవరిని టార్గెట్ చేస్తున్నామో తెలుసుకోవాలి.


నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా

# మోడ్రన్ లుక్‌లో ఈషా రెబ్బా

మోడ్రన్ లుక్‌లో మెరిసిపోయింది అచ్చ తెలుగు అందం ఈషారెబ్బా. వైట్ టాప్, డెనిమ్ జీన్స్‌లో గ్లామర్ హొయలతో ఆకట్టుకుంటున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తెలుగులో సరైన కమర్షియల్ హిట్ కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తోంది ఈషారెబ్బా. అంతకుముందు ఆ తర్వాత మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈషారెబ్బా అమితుమీ, అ! సినిమాలో విజయాలను అందుకున్నది. అంతకుముందు ఆ తర్వాత మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈషా రెబ్బా అమీతుమీ, అ! సినిమాలో విజయాలను అందుకున్నది. ప్రస్తుతం మలయాళ మూవీ జయ జయ జయ జయహే తెలుగు రీమేక్‌లో ఛాలెంజింగ్ రోల్ చేస్తోంది ఈషారెబ్బా. ఈ రీమేక్‌లో తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తోన్నాడు. త్రీ రోజెస్ వెబ్‌సిరీస్ సీజన్ 2తో త్వరలోనే తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది ఈషా రెబ్బా. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ త్వరలో ఆహాఓటీటీ స్ట్రీమింగ్ కాబోతోంది. త్రీ రోజెస్ వెబ్‌సిరీస్ సీజన్ 2తో త్వరలోనే తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది ఈషా రెబ్బా. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన ఈ సిరీస్ త్వరలో ఆహా ఓటీటీ స్ట్రీమింగ్ కాబోతోంది. తెలుగులో దయా, మాయా బజార్ ఫర్ సేల్‌తో పాటు మరికొన్ని వెబ్‌సిరీస్‌లు చేసింది. తెలుగులో దయా, మాయా బజార్ ఫర్ సేల్‌తో పాటుమరికొన్ని వెబ్‌సిరీస్‌లు చేసింది.


ఈషా రెబ్బా

# హిస్టారికల్ మూవీ 'రజాకార్'

బాబీ సింహా, వేదిక, అనసూయ త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా రజాకార్. ఈ చిత్రాన్ని సమర్‌వీర్ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. యాట సత్యనారాయణ దరకత్వం వహించారు. 1940 దశకంలో రజాకార్లు సాగించిన అకృత్యాలకు తెరరూపమిచ్చిందీ మూవీ. గతేడాది మార్చి 15న థియేటర్స్‌లో రిలీజ్ మంచి విజయాన్ని అందుకున్న రజాకార్ సినిమాకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ప్రతి రివ్యూలోనూ సినిమా మేకింగ్, సీన్స్ బాగున్నాయంటూ విశ్లేషకులు అప్రిషియేట్ చేశారు. థియేట్రికల్ రిలీజ్ అయిన పది నెలల తర్వాత రజాకార్ మూవీ ఓటీటీలోకి వచ్చింది. గత నెల 24వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న రజాకార్ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. స్టార్ హీరోలతో పోటీ పడుతూ ఈ సినిమా నం.1 ప్లేస్ లో ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే 50మిలియన్ మినిట్స్ ప్లస్ వ్యూయర్ షిప్ అందుకుని దూసుకెళ్తోంది. రజాకార్ వ్యవస్థను నేపథ్యంగా ఎంచుకుని కథే హీరోగా దర్శకుడు యాట సత్యనారాయణ ఈ సినిమాను రూపొందించారు. ఆద్యంతం ఆకట్టుకునేలా రజాకార్ సినిమాను దర్శకుడు యాట సత్యనారాయణ తెరకెక్కించిన తీరు సాధారణ ప్రేక్షకుల నుంచి సినీ ప్రముఖుల దాకా అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాంకేతిక నిపుణుల ప్రతిభతో పాటు బాబీ సింహా, వేదిక, అనసూయ త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ నటన ఈ సినిమాకు ఆకర్షణగా నిలుస్తోంది.



# 'ఒక పథకం ప్రకారం' సక్సెస్ మీట్

సంచలన దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు సాయి రామ్ శంకర్ నటించిన క్రైమ్, సీట్ ఎడ్జ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఒక పథకం ప్రకారం. వినోద్ విహాన్ ఫిల్మ్స్ విహారి సినిమా హౌస్ ప్రై.లి. బ్యానర్స్ మీద గార్లపాటి రమేష్ తో కలిసి దర్శకుడు వినోద్ కుమార్ విజయన్ నిర్మించారు. ఈచిత్రం ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శ్రీలక్ష్మి ఫిల్మ్స్ పై బాపిరాజు ఈ మూవీని రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున రిలీజ్ చేశారు. సినిమాకు వస్తున్న స్పందన పట్ల యూనిట్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. విలన్ ఎవరో కనిపెడితే పదివేలు ఇస్తామని చిత్రయూనిట్ ప్రకటించిన ఆఫర్‌తో సినిమామీద అందరికీ ఆసక్తి ఏర్పడింది. దీంతో సినిమాకు మంచి ఓపెనింగ్ వచ్చాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి వస్తున్న ఆదరణను చూసిన చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ప్రీమియర్ షోలో 18 మంది మీడియా సభ్యులు విలన్ ఎవరనేది ఇంటర్వెల్ కంటే ముందు సీక్రెట్ చిట్స్ ద్వారా తెలిపారు. ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున 18 వేల రూపాయలను దర్శక నిర్మాతలు ఇచ్చారు. హీరో సాయి రామ్ శంకర్ మాట్లాడుతూ, 'ఒక పథకం ప్రకారం' సినిమాను చాలా రోజుల తర్వాత రిలీజ్ చేశారు. చూసిన ప్రతీ ఒక్కరూ అద్భుతంగా ఉందని అంటున్నారు. మేం అనుకున్నట్టుగానే అందరికీ రీచ్ అయింది. సముద్రఖని పాత్రకు అందరూ కనెక్ట్ అవుతున్నారు. పెద్ద ఓపెనింగ్స్ అని చెప్పను గానీ.. మా కథ, మా సినిమా బలంగా ఉందని చెప్పగలను. మా మూవీని చూసిన వారంతా మెచ్చుకుంటున్నారు. ఇప్పటి మీడియా సపోర్ట్ చేసి మరింత ముందుకు తీసుకెళ్లాలి ఉంటుంది. మా అందరికీ ఈ సినిమాతో గుర్తింపు వచ్చింది. విలన్‌ను కనిపెడితే పది వేలు ఇస్తామని ప్రకటించాం. చాలా చోట్ల లక్కీ డిప్ ద్వారా ఆడియెన్స్‌కు డబ్బులు ఇచ్చాం. ప్రేక్షకుల దగ్గరకు మా సినిమాను మరింతగా తీసుకెళ్లేందుకు మీడియా సహకరించాలి" అని అన్నారు. దర్శక, నిర్మాత వినోద్ విజయన్ మాట్లాడుతూ, "ఒక పథకం ప్రకారం' సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. అన్ని చోట్ల నుంచి మాకు ఆదరణ లభిస్తోంది. మీడియా మరింతగా సపోర్ట్ చేస్తూ మా సినిమాను ఆడియెన్స్ వద్దకు తీసుకెళ్లాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత గార్లపాటి రమేష్ కూడా పాల్గొన్నారు.



# మార్చి నాటికి దేశంలో హైడ్రోజన్ ట్రైన్ సిద్ధం

## జింద్-సోనిపట్ మార్గంలో పైలట్ ట్రయల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** దేశంలో కొత్తగా అమలుకు తెస్తున్న డెమూ టర్న్ హైడ్రోజెన్‌రైలును వచ్చే మార్చినాటికిప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధం అవుతోంది. జింద్ సోనిపట్ సెక్షన్‌లో ఈ రైలును నడిపించేందుకు కృషిచేస్తున్నట్లు చెన్నైలోని ఇంటిగ్రల్‌కోచ్‌ఫ్యాక్టరీ మేనేజర్ యు సుబ్బారావు వెల్లడించారు. పైలట్‌రైలు కోసం ప్రస్తుతం ఈ హైడ్రోజెన్ కోచ్‌లను తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కోచ్‌ల ఇంజన్ల ఆదునీకరణకు గాను డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్‌లు ఇకపై గ్రీన్‌హైడ్రోజెన్ ఇంధనం ఫ్యూయెల్‌సెల్స్‌తో పనిచేస్తాయి. ఇందుకోసం 111.83 కోట్లు కూడా మంజూరయినట్లు ఐసిఎఫ్ జనరల్‌మేనేజర్‌యుఎస్‌రావు తెలిపారు. ఇప్పటికే పలుసార్లు ప్రయోగాలుచేసిన ఈ హైడ్రోజెన్ పవర్ రైలు ఇంజన్‌కు తుదిరూపం ఇస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఆశ్వికశక్తి ఉన్న ఇంజన్‌గా తీర్చిదిద్దుతున్నారు. మొత్తం 1200 ఆశ్వికశక్తితో ఈ ఇంజన్‌నడుస్తుంది. ఇతర నాలుగుదేశాల్లో ఇప్పటివరకూ 500 నుంచి 600 హెచ్‌పి ఇంజన్లు మాత్రమే నడుస్తున్నాయని భారత్‌లో 1200 హెచ్‌పితో ఉన్న ఇంజన్లు వస్తున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్ ఇప్పటికే ప్రకటించారు.




# 'ఫోర్టిఫైడ్'పై అవగాహన లేక నల్లబజారుకు పిడిఎస్ బియ్యం

## డబ్ల్యుహెచ్‌ఒ ఆదేశం మేరకు ఐదు ఆహార సరకుల్లో ఫోర్టిఫైడ్ తప్పనిసరి

**హైదరాబాద్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన అరకొరగా ఉండటంతో పేదలు వాటిని తినకుండా దళారులకు విక్ర యిస్తున్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన 89,96,083 కుటుంబాలకు ఫోర్టిఫైడ్ రైస్‌ను 2022 నుంచి తెలం గాణలో సరఫరా చేస్తున్నారు. కొత్తగా జనవరి 26న మరో పదిలక్షల కుటుంబాలకు తెల్లరేషన్‌కార్డులు మం జూరు చేశారు. 3.5కోట్ల వినియోగదారుల కోసం పిడిఎస్ బియ్యం ఫోర్టిఫైడ్ చేసి సరఫరా చేస్తారు. పౌర సరఫరాలశాఖ ఏటా 36లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పిడిఎస్ ద్వారా సరఫరా చేస్తుంది. పిడిఎస్ బియ్యం బస్తాలో 99కిలోలకు అదనంగా 74 రూపాయలు ఖర్చు పెట్టి పదికిలోల ఫోర్టిఫైడ్ గ్రెయిన్స్‌ను కలిపి లబ్ధి దారులకు సరఫరాచేస్తుంది. పిడిఎస్ లబ్దిదారులు బియ్యం దొడ్డుగా వున్నాయని తినకుండా తిరస్కరి స్తున్నారేకానీ ఈ బియ్యం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజ నాలు గుర్తించడంలేదు. ఫోర్టిఫైడ్ రైస్‌ను తక్కువ ధరకు దళారులకు అమ్మేసుకుంటున్నారు. దళారులు రైసుమిల్లరకు విక్రయిస్తారు. రైస్‌మిల్లర్లు వాటిని పాలిష్ చేసి దేశం ఎల్లలు దాటిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాలమేరకు రాబోయే రోజుల్లో ప్రతి ఆహారసరుకులు ఫోర్టిఫైడ్ చేసి విక్రయించాల్సి వస్తుంది. పాలు, గోధుమపిండి, ఉప్పు, వంటనూనేలు బి12, ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి సూక్ష్మపోషకాలతో బలవర్ధకంగా తయారిస్తూ వినియోగదారులకు అందుబాటులోకి తీసు కొస్తున్నారు. గుడ్డును కూడా ఇప్పుడు ఇ విటమిన్‌తో ఫోర్టిఫైడ్ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మాత్రం నాలుగు ఆహారవస్తువులు ప్రైవేట్ రంగంలోని ఆహారపారిశ్రామిక వేత్తలు తప్పనిసరిగా ఫోర్టిఫైడ్ చేయనది విక్రయించడంలేదు. ఉప్పు అయోడిన్‌తో ఫోర్టిఫైడ్ చేసి విక్రయిస్తున్నారు.అదే విధంగా ఆహారవంటకాలలో వాడుతున్న నూనెలో కూడా విటమిన్స్ ఫోర్టిఫైడ్ చేస్తున్నారు.ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరాచేసే బియ్యంను ఐరన్,ఫోలిక్‌యాసిడ్,విటమిన్ల,జింక్, బి12 గుళికలు పలచటి దంతికలుగా రూపొందించి అందులో కలిపేస్తున్నారు.

ప్రతి99 కిలోలకు వెయ్యిగ్రాములు అంటే కిలో కలుపుతున్నారు. కస్టమ్‌మిల్లింగ్ బియ్యంకు మిల్లులలోనే వాటిని కలిపి ఎఫ్‌సిఐకి అందజేస్తున్నారు. ఫోర్టిఫైడ్‌కు క్వింటాల్‌కు 74రూపాయల ఖర్చును కేంద్రం రాష్ట్రం చెరిసమానంగా భరిస్తున్నాయి. పెద్ద ఎత్తున సామన్యుడి ఆరోగ్య ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం పిడిఎస్ బియ్యం లబ్దిదారులకు తెలియకపోవడంతో అమృతతుల్యమైన ఈ బియ్యం రేషన్‌దుకాణంలోనే కొన్నిచోట్ల విక్రయిస్తుంటే మరికొన్ని చోట్ల ఉదయం బియ్యం కొనుగోలు కోసం వచ్చే చిరువ్యాపారులకు కిలోకు పది రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. అంగన్‌వాడీకేంద్రాలలో కూడా ప్రస్తుతం ఫోర్టిఫైడ్ రైస్ బియ్యం వండిపెడుతున్నారు. దీనితో గర్భిణి మహిళలలో ఇనుము దాతువు లోపం తగ్గి ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టడమే కాకుండా మాతృ,శిశు మరణాలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా చౌకధరల దుకాణాల వారిగా ప్రభుత్వం సరఫరాచేసే ఫోర్టిఫైడ్ రైస్ బియ్యం పట్ల అవగాహన పెంచి అవి వారు వండుకొని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దొడ్డుబియ్యమైనా సన్నబియ్యమైనా ఫోర్టిఫైడ్ రైస్‌లో ఉండే పౌడర్ కూడా నీటిలో కలిసి వృధా కాకుండా కడగకుండానే వండుకొని తినాల్సి ఉన్నా ఈ విషయం చెప్పకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలలో వాటిని కడిగి వండుతుండటంతో అవి ఏ స్థాయిలో ప్రయోజనం కలిగించాల్సి ఉంటుదో అంత ప్రయోజనం లబ్దిదారులకు అందడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు తరలిపోయే రైస్ ఎక్కువగా ఫోర్టిఫైడ్ రైసు ఉంటుంది. మన ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించడానికి రూపొందించిన బియ్యం ఇతర దేశాల ప్రజల పాలవడం బాధకరం.

# ఆప్‌ను ఊడ్చి పారేశాం.. ఢిల్లీ మాదే

## తెలంగాణలోని ఎమ్మెల్సీ సీట్లూ మావే..

## మేధావులారా.. ఆలోచించి ఓటేయాలి

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అక్రమ దందాలకు పాల్పడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలు చీపురును ఛీ కొట్టి ఊడ్చిపారేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ మాదే.. తెలంగాణసహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలను ఏర్పాటు చేయబోయేది బిజెపియే అన్నారు. ఇక్కడ 3 ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోబోయేది కూడా బిజెపియే అన్న ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ చీపురుతో ఛీ కొట్టారు. చేతిని చిదిమేశారు. కమలాన్ని వికసింపజేశారు. ఢిల్లీ అయినా గల్లీ అయినా బిజెపితోనే మనసంతా, ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీతోనే మేమంతా అని చాటిచెప్పిన ప్రజలకు కృతజ్ఞతలు అని తెలిపారు. అక్రమ దందాలతో, అక్రమాలతో జైలుకు పోయిన నాయకుడు మాకొద్దు, నీతివంతమైన మోడీ పాలన ఢిల్లీలోనూ రావాలని ప్రజలు ఆకాంక్షించారు. అందుకే చీపురుతోనే ఆప్ పార్టీని ఊడ్చి పారేశారు. వార్ వన్ సైడ్ అన్నట్లుగా ఢిల్లీ ప్రజలు బిజెపికే పట్టం కట్టారు. తెలంగాణ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం త్వరలోనే రాబోతోంది. ఇకపై ఢిల్లీ పీఠం మాదే అన్నారు. త్వరలోనే తెలంగాణలోని ఎమ్మెల్సీ సీట్లు కూడా బిజెపి పరమే కాబోతున్నాయన్నారు. ఎందుకంటే ప్రశ్నించే పార్టీ బిజెపి అన్నారు. ఉద్యోగులు, పట్టభద్రులు, మేధావుల పక్షాన పోరాడేది బిజెపి అన్నారు. తెలంగాణలోని మేధావులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులంతా ఆలోచించుకుని బిజెపికి ఓటేయాలని కోరుతున్నామన్నారు.

# నకిలీ బీమా పత్రాలను సృష్టించి మోసాలకు పాల్పడిన ముఠా అరెస్టు

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** నకిలీ బీమా పత్రాలను సృష్టించి ఆయా భీమా కంపెనీలను, రవాణా శాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ సంస్థలను తప్పుదోవ పట్టిస్తున్న ఓ ముఠాను పేట్ బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. దూలపల్లి ప్రాంతానికి చెందిన ప్రవీణ్ (37), రామంతపూర్ ప్రాంతానికి చెందిన కాముని బాల మహేందర్ (28), బాలానగర్ ఫిరోజ్ గూడకు చెందిన మొలక బాలాజీ (29), లోతుకుంట అల్వాల్ ప్రాంతానికి చెందిన రుహుల్ల బేగ్ (27)లు గత కొంతకాలంగా ముఠాగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆలోచనలతో ప్రభుత్వ ప్రైవేటు యంత్రాంగాలను తప్పుదోవలను పట్టించేందుకు తప్పుడు పత్రాలను సృష్టించి తప్పించుకుని తిరుగుతున్నారు. గురువుల ప్రవీణ్ అనే నిందితుడు మేడ్చల్ రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీవో బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కార్యాలయానికి వచ్చే వాహనాదారులకు లేనిపోని మాటలు చెప్పి అధికంగా ఇన్సూరెన్స్ చెల్లించకుండా తక్కువ రూపాయలకే వాహన ఇన్సూరెన్స్ పత్రాలను ఇస్తానని నమ్మబలికి వారిని బుట్టలో వేసుకుంటాడు. మొలక బాలాజీ అనే నిందితుడు గతంలో ఓ ప్రైవేట్ సంస్థలు కన్సల్టెన్సీ గా పనిచేస్తూ కంప్యూటర్ పై అవగాహన ఉంది. దీనికి తోడు మరో ఇద్దరు నిందితులు అందరూ ఒక్కటిగా మారి ఆయా వాహనాల బీమా పత్రాలను పొందాలంటే 15 వేలకు పైగానే ఉంటుంది. కానీ వీళ్ల 2500 మాత్రమే పత్రాలను అందిస్తామని, వీటిని ఆయా వాహనాలను తనిఖీ చేసే సమయంలో అధికారులకు చూపిస్తే సరిపోతుందంటూ చట్టబద్ధమైనవంటూ నమ్మించి బాధితులను మోసం చేస్తూ వస్తున్నారు. వీరు చేసే మోసం పట్ల ఓ బాధితులు 7న పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు రంగంలోకి దిగి తమదైన శైలిలో నిందితులను పట్టుకొని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ అలియాంజ్, రహేజా ఇన్సూరెన్స్, క్రోమా, రిలయన్స్, బిగ్ బాస్కెట్ లాంటి పేరున కంపెనీల బ్రాండ్‌ను నకిలీ పత్రాలుగా తారుమారు చేసి బాధితులకు అప్పగిస్తూ వస్తున్నారు. వీరి వద్ద 16 మంది అభ్యర్థుల డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు 45 ఆయా నకిలీ పత్రాలు, 178 నకిలీ బజాజ్ అలి యాంజ్, ఆరు రహేజా బీమా, 1 సీఎం ఫైనాన్స్ నకిలీ బీమా సర్టిఫికెట్లు, లాప్ టాప్, సిపియు, సెల్‌ఫోన్లు సీజ్‌చేసి నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలపై బిజెపి మేధోమథనం

## విజయమే లక్ష్యంగా వ్యూహారచన

## ప్రచార కార్యాచరణపై ప్రణాళికలు

### ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు, యువతకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల తరుణంలో బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ గోల్కొండ హోటల్‌లో కిషన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ఎమ్మెల్సీ అభ్యర్థులు, కీలక నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమా వేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ, బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, పార్టీ ఎన్నికల అభ్యర్థులు, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల వ్యూహారచన రూపొందించేలా ప్రచార కార్యాచరణపై సమగ్రంగా చర్చించి కీలక సూచనలు చేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల పక్షాన ఎండగడుతూ, కాంగ్రెస్ సర్కారు మోసాలను ప్రజలకు వివరించేలా ప్రచారాన్ని ఉధృతం చేయడంపై ప్రధానంగా దృష్టి సాధించాలన్నారు. రానున్న రోజుల్లో కర్ణాటక, తెలంగాణలో జరగనున్న ఎన్నికల్లో స్వతంత్రంగా అధికారకంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందన్నారు. బిజెపి రాష్ట్ర శాఖ తరపున, ప్రజలందరి తరపున ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాకు శుభాకాంక్షలు తెలిపారు.

# మార్చి 3 నుంచి ఇ సెట్ దరఖాస్తుల స్వీకరణ

## 25న నోటిఫికేషన్.. మే 12న పరీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం(లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈసెట్-2025కి సంబంధించిన దరఖాస్తులను మార్చి 3 నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 25న జారీ చేయనున్నారు. మే 12న పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను శనివారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టా రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్ ప్రొఫెసర్లు ఈ పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, ఈసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ సెట్-2025ను నిర్వహించనుంది. ఈ సెట్-2025కి సంబంధించిన కమిటీ మొదటి సమావేశం శనివారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. అనంతరం ఈ సెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 25న ఈసెట్-2025 నోటిఫికేషన్ జారీ కానుంది. మార్చి 3 నుంచి ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. మే 12న పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తారు. ఈసీఈ, ఈఐఈ, సీఎస్ఈ, ఈఈఈ, సివిల్, ఎంఈసీ, సీహెచ్ఈ, మైనింగ్, ఎంఈటీ, పీహెచ్ఎం, బీఎస్ఎం కోర్సుల్లో ప్రవేశాలను తీసుకోనున్నారు.ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ. 500 కాగా.. ఇతర కేటగిరీల విద్యార్థులకి రూ. 900గా నిర్ణయించారు.

# మార్చి 1 నుంచి లాసెట్ దరఖాస్తుల స్వీకరణ

## 25న నోటిఫికేషన్ జారీ..

### జూన్ 6న లాసెట్, పిజి లాసెట్ పరీక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని న్యాయ శాస్త్ర కోర్సులైన 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లాకోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2025కి సంబంధించిన దరఖాస్తులను మార్చి 1 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 25న జారీ చేయనున్నారు. అలాగే పీజీ లా కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీలా సెట్-2025 నోటిఫికేషన్‌ను అదే రోజు జారీ చేయనున్నారు. లాసెట్‌తోపాటు.. పీజీ లాసెట్ పరీక్షను జూన్ 06న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టా రెడ్డి శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, లాసెట్, పీజీలాసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మి పాల్గొన్నారు. లాసెట్, పీజీ లాసెట్-2025ను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది. లాసెట్, పీజీలాసెట్ దరఖాస్తులను మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు స్వీకరిస్తారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈ నెల 25న జారీ చేయనున్నారు. ఏప్రిల్ 15 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. అపరాధ రుసుంతో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. 3 సంవత్సరాల లాసెట్ పరీక్షను జూన్ 6న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించనున్నారు. పీజీ లాసెట్, ఐదేళ్ల లాకోర్సులో ప్రవేశాల కోసం జూన్ 6న సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు

# కొంపముంచిన బిఆర్ఎస్‌తో కేజ్రీవాల్ స్నేహం

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కెసిఆర్ సార్థ్యంలోని బిఆర్ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంపముంచిందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి భాష్యం చెప్పారు. కెసిఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యా పారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయని ఆయన అపహాస్యం చేశారు. అన్నాఅజారే చేపట్టిన అవినీతిరహిత భారతదేశం నినాదాన్నే తన పార్టీ సిద్ధాంతంగా మార్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ ఇంతింతై వటుడింతై అన్నట్టుగా, మొదట ఢిల్లీలో అధికారం, తర్వాత పంజాబ్ ను కైవసం చేసుకోవడం ద్వారా దేశ స్థాయిలో తన పేరు మారుమోగేలా చేశారని చరిత్రను టిపిసిసి నెమరేసుకున్నారు. తాజా ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో ఆప్ ను కోలుకోలేని దెబ్బ తీశాయని ఎకసెక్కాలు చేశారు. ఈ పరిస్థితికి కేజ్రీవాల్ స్వయంకృతాపరాధమే కారణమని విమర్శించారు. కేజ్రీ పతనానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. అందులో ఒకటి కేసీఆర్ సారథ్యంలోని బిఆర్ఎస్ పార్టీతో కేజ్రీవాల్ స్నేహం ఆయన కొంప ముంచిందనే చెప్పాలి. కేసీఆర్ కుమార్తె కవితతో కేజ్రీ అండ్ కో లిక్కర్ వ్యాపారం ఆరోపణలు ఆయన పతనానికి పునాదులు వేశాయి. ఏ అవినీతిరహిత నినాదంతో కేజ్రీవాల్ దేశ స్థాయిలో ఇమేజ్ తెచ్చుకున్నారో దానికి లిక్కర్ స్కాం తూట్లు పొడిచిందని ఆయన పేర్కొన్నారు . ఆప్ కు అప్పటి వరకు ఉన్న క్లీన్ ఇమేజ్‌ను లిక్కర్ స్కాం ఆరోపణలు ఊడ్చిపారేశాయి.

అవినీతికి కేజ్రీవాల్ అతీతుడు కాదు అన్న అభిప్రాయం ప్రజల్లో కలగడానికి కేసీఆర్ ఫ్యామిలీ కారణమైందని అయన దుయ్యబట్టారు. రెండు దఫాలు ఢిల్లీని ఏలిన కేజ్రీ పాలనలో లిక్కర్‌స్కాం తప్ప మరో అవినీతి ఆరోపణలేదు. కవిత లిక్కర్ వ్యాపార కాంక్ష కేజ్రీ పార్టీ సిద్ధాంతానికే తూట్లు పొడిచిందని అన్నారు. దేశ స్థాయిలో కేజ్రీ ఇమేజ్‌ను ఈ స్కాం పైకి కనిపించనంత కుళ్లబొడిచిందనే చెప్పాలి. ఇక రెండో అంశం కాంగ్రెస్ పార్టీని శత్రువుగా పరిగణించడం తాజా ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీ పతనానికి మరో కారణమైందని అన్నారు. కాంగ్రెస్ తో పొత్తు వద్దు అన్న ఆయన నిర్ణయం బీజేపీ నెత్తిన పాలు పోసిందనే చెప్పాలి. కాంగ్రెస్ తో కటీఫ్ నిర్ణయంలో హేతుబద్ధత లేదు. కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు చీలి కాషాయ పార్టీకి మేలు జరుగుతుందన్న చిన్న లాజిక్‌ను కేజ్రీవాల్ తెలిసి మిస్సయ్యారా? లేక 'అవగాహన'తో చేశారా? అన్నది అర్థం కాని విషయం. కాంగ్రెస్ ను దూరం పెట్టి అధికారాన్ని కూడా కోల్పోయారని చెప్పక తప్పదని ఆయన పేర్కొన్నారు.

# కొత్త ఆదాయపు పన్ను చట్టానికి కేంద్ర కేబినెట్ ఆమోదం




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం కొత్త ఆదాయపుపన్ను చట్టానికి సంబంధించిన బిల్లును ఆమోదించింది. ఆరుదశాబ్దాల కాలం నాటి ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో ఈ కొత్త చట్టం తీసుకువచ్చేందుకు ఈ కొత్త బిల్లును రూపొందించారు. 1961 నాటి ఆదాయపు పన్ను చట్టంస్థానంలో ఉభయసభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంకోసం వెళుతుంది. తదనంతరం చట్టరూపంలోకి ఈ కొత్త బిల్లు వస్తుందని కేంద్రం వెల్లడించింది. పన్ను చెల్లింపు దారులకు సరళమైన రీతిలో మొత్తం అర్థం అయ్యే లా ఈ చట్టాన్ని రూపొందించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ కొత్త బిల్లు అమలుకువస్తే పన్ను చెల్లింపుదారులకు లిటిగేషన్ సమస్యలు తగ్గుతాయని కేంద్రం వివరిస్తోంది. సోమవారం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెడతారు. అనంతరం పార్ల మెంటరీ స్థాయీ సంఘానికి నివేదిస్తారు. సమగ్ర చర్చలుజరిగిన తర్వాత ఈ బిల్లు ఆమోదం పొందుతుందని తెలుస్తోంది.

# యుఎస్ఎయిడ్ సంస్థ ఉద్యోగులకు ఫెడరల్ కోర్టు ఊరట

## ట్రంప్ ఆదేశాలను నిలిపివేస్తూ జడ్జి నికొలస్ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** అమెరికా అంతర్జాతీయ అభివృద్ధిసంస్థలో ఉన్న 2200 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా ఫెడరల్‌కోర్టు న్యాయమూర్తి నిలిపివేసారు. అర్ధరాత్రివేళ 2200 మంది ఉద్యోగులను శెలవుపై వెళ్లాలన్న ఉత్తర్వులను అమెరికా జడ్జి పక్కనపెట్టారు. అమెరికా జిల్లాజడ్జి కార్ల్ నికోలాస్ ట్రంప్ ఉత్తర్వులను నిలిపివేస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీచేసారు. ఈ జడ్జిని కూడా ఒకప్పుడు ట్రంప్ నియమించిన న్యాయాధికారే కావడం గమనార్హం. అంతేకాకుండా 500 మంది యుఎస్ఎయిడ్ వర్కర్లు ఇప్పటికే శెలవుపై వెళ్లాలని ఉత్తర్వులుజారీచేసారు. వీరందరినీ కూడా తిరిగి నియమించాలని ఏ ఒక్కదేశంలోకూడా యుఎస్ ఎయిడ్ వర్కర్లు సెలవుపై వెళ్లడం కానీ వారిని శాశ్వతంగా పంపించడం కానీ జరక్కూడదని ఆదేశించారు. ఈనెల 14వ తేదీ లోపు ఈ ఉత్తర్వులన్నీ అమలులోకి వస్తాయన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్నతర్వాత జడ్జి నికోలస్ ప్రస్తుతం తాను తాత్కాలిక నిలిపివేత ఉత్తర్వులు జారీచేస్తానన్నారు. రెండు విదేశీ సేవల సంఘాలు అమెరికా ప్రభుత్వంలో ట్రంప్ జారీచేసిన ఉత్తర్వులపై కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసారు. యుఎస్ ఎయిడ్ వర్కర్లను ప్రస్తుతం ఉన్న 14 వేల సంఖ్యనుంచి 300 మందికి తగ్గించాలని ట్రంప్ డోజ్ చీఫ్ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌లు నిర్ణయించారు. అంతేకాకుండా యుఎస్ ఎయిడ్‌లో అంతా ఉగ్రవాదులేనని వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేసారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు ఈచర్యలు తప్పవని మస్క్‌చేస్తున్న వాదనలకు ఫెడరల్ కోర్టు ఉత్తర్వులు ఝలక్ ఇచ్చినట్లయింది. అమెరికా డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ కోర్టులో తన వాదనను వినిపిస్తూ 500 మంది ఉద్యోగులు ఇప్పటికే శెలవులో వెళ్లారని, మరో రెండువేల మందిని కూడా ఈఅర్ధరాత్రి నుంచి సెలవులో వెళ్లాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. తాత్కాలిక అసిస్టెంట్ అటార్ని బ్రెట్ షమేట్ మాట్లాడుతూ అవినీతి, మోసం ఎక్కువ ఉందని దేశ అధ్యక్షుడు భావిస్తున్నారని అందువల్లనే లేఆఫ్‌లు అనివార్యం అని ఆయన వాదనలు వినిపించారు. అమెరికన్ ఫారిన్ సర్వీస్ ఆర్గనైజేషన్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్లు డిసి ఫెడరల్‌కోర్టులో ఈ పిటిషన్‌వేసారు. రాజ్యాంగ వ్యతిరేకంగాను, అక్రమ చర్యలకు ప్రస్తుత అద్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పాల్పడు తున్నారని వెంటనే ఈ ఉత్తర్వులను రద్దుచేసే విధంగా ఆదేశాలు జారీచేయాలనికోరుతూ పిటిషన్ దాఖలుచేసారు.




# ఢిల్లీ ప్రజల చేతిలో చావుదెబ్బ తిన్న కేజ్రీవాల్

## ఢిల్లీ స్ఫూర్తితో తెలంగాణ గడ్డమీద కాషాయ జెండా ఎగరవేస్తాం

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజల చేతిలో చావు దెబ్బ తిన్నారని, ఢిల్లీ స్పూర్తితో తెలంగాణ గడ్డమీద కాషాయ జెండా ఎగరవేస్తామని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఢిల్లీలో బిజెపి విజయంపై నాంపల్లి బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీ పేదల బ్రతుకులు మారాలంటే బిజెపి రావాలి, మోడీ కేంద్ర ప్రభుత్వం అండతోనే ఇది సాధ్యం అని భావించారన్నారు. బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారన్నారు. పార్లమెంట్‌లో ఈ ఎనిమిది నెలల ప్రొసీడింగ్స్ చూస్తే.. ప్రతిపక్షాలు అన్నీ మోడీ మీద అక్కసుతో ఐక్యంగా పనిచేస్తున్నారు తప్ప దేశప్రజల కోసం కాదన్నారు. వారి సమస్యలు తీర్చడానికి నిర్మాణాత్మక పాత్ర పోషించడం లేదు. అస్తమానం దేశ ప్రతిష్ఠ దిగజార్చడం, అధికార పక్షం మీద దుమ్మెత్తి పోయడం తప్ప ప్రజల సమస్యల గురించి కొట్లాడలేదన్నారు. కేజ్రీవాల్ మాటలకు చేతలకు పొంతన లేదని, పేదలకోసం పార్టీ పెట్టామని చెప్పారు, మఫ్లర్ చుట్టుకొని పేదోని లెక్క యాక్షన్ చేశారన్నారు. తాగునీటి సమస్య కూడా తీర్చలేదు కానీ లిక్కర్ స్కాంలో డబ్బులు సంపాదించుకొని పంజాబ్లో ఎలా గెలవాలనే చూశారు. ఢిల్లీ వాళ్ళని తాగుబోతులని చేసి, ఢిల్లీని ముంచాలని చూసి, లిక్కర్ స్కాంలో స్వయంగా సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు జైల్లపాల య్యారు. వారిని చూసి మేము సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందని ప్రజలు కసితో అందరినీ ఓడించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో జీరో, ఢిల్లీ నగరాన్ని పాలించిన పార్టీకి సున్నా సీట్లు ఇచ్చారన్నారు. తెలంగాణలో పదేళ్ల కెసిఆర్ పాలన చూసి అసహ్యంతో ఓడగొట్టారు. కెసిఆర్ మీద కోపం వల్ల గెలిచిన కాంగ్రెస్ వాలకం ప్రజలకు అర్థం అయ్యింది. మోడీ అండ, కేంద్ర ప్రభుత్వం సహకారం ఉంటేనే తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అని ప్రజలు నమ్ముతున్నారు. రాష్ట్రంలో ఏ పని చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం సహకారం తప్పని పరిస్థితి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డమీద కాషాయ జెండా ఎగరవేయడానికి ఢిల్లీ విజయాన్ని స్పూర్తిగా తీసుకుని ముందుకు పోతామన్నారు.

**ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గాడిద గుడ్డు**

**తెలంగాణ బిజెపి సెటరికల్ ట్వీట్**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు ఇచ్చారని తెలంగాణ బిజెపి నేతలు తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ బిజెపి అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా సెటైరికల్ ట్వీట్ చేసింది. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు 2025 సందర్భంగా బాలక్‌బుద్ధి, గుంపుమేస్త్రి కోసం ప్రత్యేక పాట.. అంటూ వీడియో షేర్ చేసింది.గత తెలంగాణ ఎన్నికల సమయంలో రాష్ట్రానికి కేంద్రం బిజెపి ప్రభుత్వం గాడిద గుడ్డు ఇచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి గాడిద గుడ్డును సింబల్‌ను నెత్తిన పెట్టుకోని ప్రచారంలో పాల్గొన్నారు. అదే సింబల్‌ను బిజెపి ఉపయోగించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ ట్వీట్ వేసింది. చేయి సింబల్ సైతం గుండు సున్నా చూపిస్తున్న విధంగా వీడియోలో కన్పిస్తోంది. ఇందుకు సంబంధించిన ట్వీట్ తాజాగా చక్కర్లు కొడుతుంది.

# హీటెక్కిన ఛాంపియన్స్ టోర్నీ




## ప్రారంభానికి ముందే వివాదాలు
## రచ్చ చేస్తున్న ఐసిసి నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ-2025కి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ప్రారంభానికి మరో 10 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ టోర్నమెంట్ ఈ నెల 19 నుంచి పాకిస్తాన్, దుబాయ్‌లలో ప్రారంభం కానుంది. ఈ ఐసిసి టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయి. అన్ని జట్లు తమ జట్లను ప్రకటించాయి. టోర్నమెంట్ షెడ్యూల్ కూడా ప్రకటించారు. అయితే, మినీ వరల్డ్ కప్‌గా పేరుగాంచిన ఈ ఐసిసి టోర్నమెంట్‌కు సంబంధించి ఈ సారి అనేక వివాదాలు తలెత్తాయి.

అందులో ప్రధాన వివాదాలను గూర్చి తెలుసుకుంటే పాకిస్తాన్ పర్యటనకు టీమిండియా నిరాకరణ ఒకటిగా ఉంది. చాలా కాలం తర్వాత, పాకిస్తాన్ ఐసిసి టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. కానీ, భద్రతా కారణాల దృష్ట్యా టీం ఇండియా పాకిస్తాన్ వెళ్లడానికి నిరాకరించింది. ఆ తరువాత ఐసిసి హైబ్రిడ్ మోడల్‌ను ఆమోదించింది. భారత జట్టు ఇకపై తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడుతుంది. టీం ఇండియా సెమీఫైనల్స్‌కు చేరుకుని, ఆ తర్వాత ఫైనల్స్‌కు చేరుకున్నా, ఈ మ్యాచ్‌లు దుబాయ్‌లోనే జరుగుతాయి. లేకుంటే అవి పాకిస్తాన్‌లోనే జరుగుతాయి. మరో వివాదం పాకిస్తాన్ కూడా భారతదేశానికి రావడానికి నో అంటోంది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్ వెళ్లడానికి భారతదేశం నిరాకరించినప్పుడు, పాకిస్తాన్ కూడా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. రాబోయే ఐసిసి టోర్నమెంట్ కోసం పాకిస్తాన్ జట్టు భారతదేశానికి వెళ్లడానికి కూడా నిరాకరించింది. భారతదేశం లాగే, పాకిస్తాన్ కూడా తన మ్యాచ్ కోసం హైబ్రిడ్ మోడల్‌ను డిమాండ్ చేసింది. ఇక ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్ మ్యాచ్‌పై వివాదం చెలరేగింది.

2021లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చాక ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళా క్రీడలను నిషేధించారు. దీని కారణంగా, ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు కూడా రద్దు చేశారు. మహిళలు బయటకు వెళ్ళే హక్కు, వారి విద్య, అన్ని రకాల హక్కులు తీసివేశారు. అఫ్ఘాన్‌లో మహిళలపై జరుగుతున్న దారుణాలను దృష్టిలో ఉంచుకుని, ఇంగ్లాండ్‌కు చెందిన కొంతమంది రాజకీయ నాయకులు ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లాండ్ జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో మ్యాచ్‌లు ఆడకూడదని అభ్యర్థిస్తూ ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు ఒక లేఖ రాశారు. అయితే, ఐసిసి దీనికి సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే టీం ఇండియా జెర్సీపై గందరగోళం నెలకొంది. సాధారణంగా టోర్నమెంట్ నిర్వహించే దేశం పేరు అన్ని జట్ల జెర్సీలపై ఉంటుంది. కానీ, భారత జెర్సీపై పాకిస్తాన్ పేరు ఉండదని నివేదికలు వచ్చాయి. ఈ విషయంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఐసిసికి ఫిర్యాదు చేసింది. అయితే, తరువాత టీం ఇండియా జెర్సీపై పాకిస్తాన్ పేరు ఉంటుందని స్పష్టమైంది. కాగా భారత మ్యాచ్ రిఫరీ, అంపైర్ల వివాదాలు కూడా తలెత్తింది. ఛాంపియన్స్ ట్రోఫీకి అంపైర్లు, మ్యాచ్ రిఫరీలను ఐసిసి ఇటీవల ప్రకటించింది. అందులో ఒక్క భారతీయుడి పేరు కూడా లేదు. ఈ ట్రోఫీ జాబితాలో భారత అంపైర్ నితిన్ మీనన్‌ను చేర్చాలని బిసిసిఐ కోరింది. కానీ, వ్యక్తిగత కారణాల వల్ల నితిన్ పాకిస్తాన్‌కు వెళ్లడానికి నిరాకరించాడు. ఈ విధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఛాంపియన్స్ ట్రోఫీని వివాదాలు వెంటాడుతున్నాయి.



### ఇంటర్నేషనల్ లీగ్ టి20 టోర్నీలో..
## ముంబై ఇండియన్స్ ఔట్
### 6 వికెట్ల తేడాతో షార్జా వారియర్స్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ లీగ్ టి20 టోర్నీలో (ఐఎల్‌టి20-2025) డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్‌కు షాక్ తగిలింది. ప్రస్తుత ఎడిషన్లో ఆ జట్టు ఎలిమినేటర్ మ్యాచ్‌లో నాకౌటైంది. షార్జా వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ ఎమిరేట్స్ 6 వికెట్ల తేడాతో పరాజయంపాలై, టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 146 పరుగులు మాత్రమే చేసింది. 42 పరుగులు (22 బంతుల్లో; 6 ఫోర్లు, సిక్స్) చేసిన నికోలస్ పూరన్ ముంబై ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టామ్ బాంటన్ (29), విల్ జాక్స్ (18), కుసాల్ పెరీరా (18), అకీల్ హుసేన్ (15) రెండంకెల స్కోర్లు చేశారు. భారీ హిట్టర్లు ఆండ్రీ ఫ్లెచర్ (0), బెవాన్ జాకబ్స్ (7), రొమారియో షెపర్డ్ (7) దారుణంగా విఫలమయ్యారు. వారియర్జ్ బౌలర్లలో టిమ్ సౌథీ 2, ఆడమ్ మిల్నే, దిల్షన్ మధుషంక, అస్టన్ అగర్, హర్మీత్ సింగ్, రోహన్ ముస్తఫా తలో వికెట్ పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వారియర్జ్ 18.5 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది. టామ్ కొహ్లెర్ కాడ్‌మోర్ (40), జాన్సన్ ఛార్లెస్ (36) వారియర్జ్ విజయానికి గట్టి పునాది వేయగా, టిమ్ సీఫర్ట్ (40 నాటౌట్), రోహన్ ముస్తఫా (2 నాటౌట్) వారియర్జ్‌ను విజయ తీరాలకు చేర్చారు. జేసన్ రాయ్ (26) ఓ మోస్తరు స్కోర్ చేశాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో ముహమ్మద్ రోహిద్ ఖాన్ 3, ఫజల్ హక్ ఫారూకీ ఓ వికెట్ పడగొట్టారు. ఈ గెలుపు అనంతరం వారియర్జ్ రెండో క్వాలిఫయర్‌లో డెసర్ట్ వైపర్స్‌ను ఢీకొంటుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఈ నెల 9న జరిగే ఫైనల్లో దుబాయ్ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకుంటుంది. కాగా, యూఏఈ వేదికగా జరిగే ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో ఇప్పటి వరకూ రెండు ఎడిషన్లు జరిగాయి. తొలి ఎడిషన్‌లో గల్ఫ్ జెయింట్స్ ఛాంపియన్‌గా నిలువగా, రెండో సీజన్లో ఎంఐ ఎమిరేట్స్ విజేతగానిలిచింది. గత ఎడిషన్ ఫైనల్లో ఎమిరేట్స్ దుబాయ్ క్యాపిటల్స్‌పై విజయం సాధించింది. ఈసీజన్‌లో క్యాపిటల్స్ అందరి కంటే ముందే ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

## పోరాడి ఓడిన రిత్విక్ జోడీ

**న్యూఢిల్లీ:** డాలస్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ పోరాటం తొలి రౌండ్‌లో నేముగిసింది. అమెరికాలోని టెక్సస్‌లో జరుగుతున్న ఈ ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలి రౌండ్‌లో భారత్‌కు చెందిన రిత్విక్, కొలంబియాకు చెందిన నికోలస్ బారింటోస్ ద్వయం 6-7 (4/7), 7-5, 6-10తో సూపర్ టైబ్రేక్‌లో అమెరికా జంట రాజీవ్ రామ్-ఆస్టిన్ క్రాయిసెక్ చేతిలో ఓడిపోయింది. 1 గంట 57 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బారింటోస్ మూడు ఏస్లు సంధించి, రెండు డబుల్ ఫాల్టులు చేశారు. తమ సర్వీస్ను ఒకసారి కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను రెండు సార్లు బ్రేక్ చేశారు. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో అనుభవజ్ఞులైన రాజీవ్ రామ్, క్రాయిసెక్ పైచేయి సాధించి విజయాన్ని ఖరారు చేసుకున్నారు. రిత్విక్-బారింటోస్‌లకు 11,840 డాలర్ల (రూ.10 లక్షల 38 వేలు) ప్రైజ్ మనీ లభించింది. గత ఏడాది అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో నిలకడగా రాణించిన రిత్విక్, గత వారం భారత్-టోగో జట్ల మధ్య న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ మ్యాచ్ ద్వారా డేవిస్ కప్‌లో అరగేంట్రం చేశాడు.

## ముంబై ఓపెన్ టోర్నీలో..
## సెమీస్‌కు మాయ



**న్యూఢిల్లీ:** ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టోర్నీలో సంచలన ప్రదర్శన కొనసాగిస్తూ భారత టీనేజ్ టెన్నిస్ స్టార్ మాయ రాజేశ్వరన్ రేవతి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 15 ఏళ్ల మాయ 6-4, 3-6, 6-2తో ప్రపంచ 285వ ర్యాంకర్, జపాన్‌కు చెందిన మి యామగుచి పై గెలిచింది. రెండు గంటలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో మాయ ఐదు ఏస్లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. స్పెయిన్‌లోని రాఫెల్ నాదల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మాయ సెమీఫైనల్లో ప్రపంచ 117వ ర్యాంకర్, స్విట్జర్లాండ్‌కు చెందిన జిల్ టెచ్‌మన్‌తో తలపడనుంది. ఇక భారత మూడో ర్యాంకర్, తెలంగాణకు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ఈ టోరీల్నో ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో రష్మిక 2-6, 2-6తో జిల్ టెచ్మన్ చేతిలో ఓడిపో యింది. క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైన రష్మికకు 3,450 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 27 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

## పాకిస్తాన్‌కు భారీ షాక్



### ఫుట్‌బాల్ సమాఖ్యపై నిషేధం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఎఫ్ఐఎఫ్ఎ (ఫిఫా)) పాకిస్తాన్ ఫుట్‌బాల్ సమాఖ్యపై (పిఎస్ఎఫ్) సస్పెన్షన్ వేటు వేసింది. ఫిఫా నియమావళికి అనుగుణంగా పాక్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్వహణ జరగకపోవడంతో ఆ దేశ సమాఖ్యపై నిషేధం విధించింది. ఫిఫా నియమావళి ప్రకారం నడుచుకునేలా పీఎఫ్ఎఫ్ నిబంధనల్ని సవరించుకోవాలని, తద్వారా దేశంలో ఆటపై జవాబుదారీతనం పెరగాలని ఫిఫా ఇటీవల పలు సూచనల్ని చేసింది. అయితే పీఎఫ్ఎఫ్ వాటిని పెడచెవిన పెట్టింది. చివరి సారిగా నిబంధనలను అమలు చేయకపోయినట్లయితే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీంతోపాటు, పాక్ ఫుట్‌బాల్‌జట్లపై నిషేధాజ్ఞలుంటాయని హెచ్చరించింది. అయినా వాటిని ఏమాత్రం ఖాతరు చేయ కుండా నిబంధనల్లో సవరణలు చేయకపోవడంతో అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య తాజాగా పాకిస్థాన్ ఫుట్‌బాల్ సమాఖ్యను సస్పెండ్ చేసింది. అదేవిధంగా తాము సూచించిన సవరణలు పూర్తి చేసే వరకూ నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. కాగా 2019 జూన్‌లో ఫిఫా నియమించిన కమిటీనే పీఎఫ్ఎఫ్ వ్యవహారాలను చక్కబెడుతోంది. కానీ హరూన్ మాలిక్ నేతృత్వంలోని ఈ కమిటీని అక్కడి ప్రభుత్వం శాసించడంతో ఎన్నికల నిర్వహణ, నిబంధనల్లో సవరణల ప్రక్రియ మాత్రం చేపట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో హరూన్ తమపై వేటు తప్పదని ఇటీవల పార్లమెంటరీ ప్యానెల్ దృష్టికి తెచ్చినా అక్కడి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఫిఫా నియమావళికి తగ్గ మార్పులు,చేర్పులకు పాక్ ప్రభుత్వ ఆజమాయిషీలోని సమాఖ్య సిద్ధంగా లేదని హరూన్ మాలిక్ ఇటీవల అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్యకు నివేదించాడు.

## ఇపిఎఫ్ఒ గడువు పెంపు

**ముంబై, ఫిబ్రవరి 8:** యూనివర్సల్ అకౌంట్ నంబర్ యాక్టివేట్ జనవరి 15 నుండి ఫిబ్రవరి 15 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. యూఏఎన్ యాక్టివేషన్, ఆధార్ సీడింగ్ కోసం గడువు 2025 ఫిబ్రవరి 15 వరకు పొడిగించాం అని ఫిబ్రవరి 2 నాటి సర్క్యులర్‌లో ఇపిఎఫ్ఒ గుర్తించింది. యూఏఎన్, యూనివర్సల్ అకౌంట్ నంబర్ అనేది ఇపిఎఫ్ఒద్వారా సభ్యులకు కేటాయించే ఒక విశిష్టమైన 12అంకెల సంఖ్య. ఇది ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను నిర్వహరణకు కీలకం. ఇది వివిధ కంపెనీల నుండి అన్ని ఈపీఎఫ్ ఖాతాలను ఒకే ఖాతాలోకి లింక్ చేస్తుంది. ఉద్యోగాలు మారేటప్పుడు నిధులను సులభంగా బదిలీ చేయడంలో యూఏఎన్ సురక్షిత ప్రామాణీకరణ ద్వారా ఖాతా సమాచారం, లావాదేవీలు ప్రతిని రక్షిస్తూ భద్రతను పెంచుతుంది. అదనంగా వివిధ కంపెనీల కింద సృష్టించిన ఎక్కువ పీఎఫ్ ఖాతాలను ఏకీకృతం చేసి ఇబ్బందిని తొలగిస్తుంది, ఉద్యోగుల పదవీ విరమణ పొదుపు ప్రక్రియను క్రమబద్ధీకరించడంలో యూఏఎన్ జనరేట్ చేయడానికి అవసరమైన పత్రాలలో పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, గుర్తింపు రుజువు (పాస్పోర్ట్, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ నేషనల్), చిరునామా రుజువు, బ్యాంక్ ఖాతా వివరాలు మొదలైనవి ఉన్నాయి. సంఘటిత రంగంలో ఉపాధిని పెంచడమే లక్ష్యంగా 2024 బడ్జెట్‌లో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్‌సెంటివ్ పథకాలను ప్రవేశపెట్టారు. ఇవి అటు యాజమాన్యాలతోపాటు ఇటు మొదటి సారి ఉద్యోగులకు ఇద్దరికీ ప్రయోజనాలను అందిస్తాయి. ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ ఇపిఎఫ్ఒలో నమోదు చేసుకో వాలి. ప్రస్తుతం మూడు ఈఎస్ఐ పథకాలు ఉన్నాయి. వాటిలో స్కీమ్ఎ అనేది మొదటి సారి ఉద్యోగులకు వర్తిస్తుంది. స్కీమ్‌బి తయారీ రంగంలోని కార్మికులకు, స్కీమ్‌సీ యాజమాన్యాలకు మద్దతు ఉంది. ఇపిఎఫ్ఒకి సంబంధించిన ఇఎస్ఐ పథకం కింద ప్రయోజనాలను పొందడం కోసం యూఏఎన్ యాక్టివేషన్, బ్యాంక్ అకౌంట్ ఆధార్‌తో లింక్ చేయడం తప్పనిసరి.




## టాప్‌గేర్‌లో ఆటో రిటైల్ మార్కెట్..

**ముంబై, ఫిబ్రవరి 8:** దేశమంతటా 26,500 డీలర్ షిప్‌లతో ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఏడీఏ) ఏర్పడింది. దీని అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం, జనవరిలో అన్ని రకాల విభాగాలలో పెరుగుదల నెలకొంది. టూ వీలర్స్, త్రీ వీలర్, ట్రాక్టర్, కమర్షియల్ వెహికల్స్ ఇలా ప్రతి వాహన వర్గం సానుకూల ధోరణి కనబరిచింది. వినియోగదారుల విశ్వాసం, స్థిరమైన మార్కెట్ పునరుద్ధరణకు ఇది నిదర్శనంగా నిలిచింది. గతనెలలో ప్యాసింజర్ వాహనాల రిటైల్ అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 16 శాతం పెరిగి 4,65,920 యూనిట్లకు చేరుకున్నాయి. వీటి డిమాండ్ బాగా పెరిగిందని చాలా మంది డీలర్లు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాల రిటైల్ అమ్మకాలు గత నెలలో 15.2 లక్షల యూనిట్ల వద్ద కొనసాగాయి. గత సంవత్సరం ఇదే నెలలో 14.6 లక్షల యూనిట్లతో పోల్చితే నాలుగు శాతం పెరుగుదల నమోదైంది. గ్రామీణ ప్రాంతాల కన్నా పట్టణాల్లో వాహనాల కొనుగోళ్లలో స్వల్ప పెరుగుదల కనిపించింది. గతేడాదితో పోల్చితే నాలుగు నుంచి ఐదు శాతం ఎక్కువగా నమోదైంది. వాహనాల అమ్మకాలు పెరుగుదల వెనుక ఉన్న కారణాలను కూడా ఎఫ్ఏడీఏ ప్రతినిధులు వెల్లడించారు. కొత్త మోడల్ వాహనాల విడుదల, వివాహాల సీజన్, మెరుగైన ఫైనాన్సింగ్ వంటివి దీనికి కారణమని తెలిపారు. అయితే పెరుగుతున్న వడ్డీరేట్లు, గ్రామీణ ద్రవ్యత సవాళ్లు, మార్కెట్ అనిశ్చిత గురించి ఆందోళనలు ఇప్పటికీ ఉన్నాయన్నారు. కానీ మార్కెట్ పెరుగుతూ ఉండడంపై సంతోషం వ్యక్తంచేశారు. వాణిజ్య వాహనాల అమ్మకాలు గతేడాదితో పోల్చితే 8 శాతం పెరిగి 99,425 యూనిట్లకు చేరుకున్నాయి.ట్రాక్టర్ విక్రయాలు 5 శాతం పెరిగి 93,381కి చేరాయి. ఇక త్రీ వీలర్ రిటైల్ అమ్మకాలు ఏడు శాతం పెరిగి 1,07,033గా నమోద య్యాయి. ఏది ఏమైనా నూతన సంవత్సరంలో ఆటోమొబైల్ మార్కెట్‌కు మంచి శుభారంభం లభించింది. తాజా సర్వే ప్రకారం.. దాదాపు సగం మంది డీలర్లు (46 శాతం) ఈ ఫిబ్రవరిలో కూడా అమ్మకాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. మరో 43శాతం మంది మాత్రం స్థిరంగా కొనసాగుతాయన్నారు.



## అస్మితా పటేల్‌పై సెబి ఉక్కుపాదం!

**ముంబై, ఫిబ్రవరి 8:** భారతీయ స్టాక్ మార్కెట్లను రెగ్యులేటర్ సెబి పర్యవేక్షిస్తోంది. అయితే చాలా మంది ఫిన్‌ఫ్లూయన్సర్ల ఆగడాలకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఇన్వెస్టర్లకు ఎక్కువ రాబడులను ఆశజూపి భారీగా సొమ్ము చేసుకోవటంపై కఠినంగా వ్యవహరించాలని సెబి నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రెగ్యులేటర్ సెబి చర్యలతో చాలా మంది చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులకు టిప్స్ అందిస్తున్న అస్మితా జితేష్ పటేల్ అనే ఫిన్‌ఫ్లూయన్సర్‌పై సెబి చర్యలు చేపట్టింది. సెబి చట్టాల ప్రకారం రిజిస్టర్ కాని ఆమె పెట్టుబడిదారులకు చిట్కాలను అందిస్తోందని సెబి గుర్తించింది. వాస్తవానికి ఆమెను స్టాక్ మార్కెట్‌లో షీ వోల్ఫ్, ఆప్షన్స్ క్వీన్ అని పిలుస్తుంటారు. ఆమె పెట్టుబడిదారులకు ట్రేడింగ్ గురించి కోర్సులను కూడా నిర్వహిస్తుండేది. దీనికోసం వారి నుంచి భారీగా రుసుములు వసూలు చేస్తుండేది. అయితే కోర్సుల్లో ఆమె చెప్పిన టెక్నిక్స్ ఫాలో అయితే మంచి లాభాలను పొందవచ్చని భావించిన ట్రేడర్లు నష్టాలను చూశారు. ఆమె మాటలు నమ్మి నష్టాలను మూటకట్టుకున్న చాలా మంది పెట్టుబడిదారులు వరుసగా చేసిన ఫిర్యాదులపై మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగింది. పెట్టుబడి కోర్సులు, చిట్కాల పేరుతో సంపాదించిన రూ.104 కోట్లలో రూ.54 కోట్లను స్వాధీనం చేసుకుంది. అస్మితా జితేష్ పటేల్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్‌కు 5 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇదే సమయంలో ఇతర సోషల్ మీడియా ఫ్లాట్ ఫారమ్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, లింక్డ్ఇన్, ట్విట్టర్లలో కూడా భారీగానే ఫాలోవర్లను ఆమె కలిగి ఉంది. అస్మితకు అస్మితా పటేల్ గ్లోబల్ స్కూల్ ఆఫ్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీని స్థాపించింది. కంపెనీ వ్యవస్థాపకురాలుగా ఉన్న ఆమె ఈక్విటీ మార్కెట్లలో ట్రేడింగ్ చేయాలని భావిస్తున్న చాలా మంది ఔత్సాహికులకు ట్రేడింగ్ కోర్సులను ఈ కంపెనీ కొంత రుసుముకు నేర్పిస్తుంటుంది. వరుసగా వచ్చిన ఫిర్యాదులపై సెబీ స్పందిస్తూ ప్రస్తుతం ఆమెపై చర్యలకు ఉపక్రమించింది. సెబీ వద్ద రిజిస్టర్డ్ కాని వారు స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై టిప్స్ ఇవ్వటాన్ని నిషేధించిన సంగతి తెలిసిందే.



## టాటా ఎఐఎ నుంచి కొత్త పెన్షన్ ప్లాన్

**ముంబై, ఫిబ్రవరి 8:** టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) స్మార్ట్‌పెన్షన్ సెక్యూర్ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది కొత్త తరం పదవీ విరమణ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన వినోద యూనిట్‌లింక్ పెన్షన్ ప్లాన్, ద్వితీయ ఆదాయ మార్గాలను సృష్టించడం నుండి పదవీ విరమణ పొదుపులను పొందడం వరకు ఈ ప్లాన్ ఆర్థిక భద్రత, స్వాతంత్రం కోరుకునే డిజిటల్ వినియోగదారులు, ప్రొఫెషనల్స్ ఆకాంక్షలను తీరుస్తుంది.ముందస్తు పదవీ విరమణ ప్రణాళిక: 45సంవత్సరాల వయస్సు నుండి పదవీ విరమణ చేయడానికి పూర్తి సౌలభ్యం. ఈక్విటీలో 100శాతం నిధులను కేటాయించే ఎంపికతో వివిధ ఫండ్స్‌లో పెట్టుబడులకు అవకాశం. ఎటువంటి ఖర్చు లేకుండా, ఎన్ని సార్లయినా ఒక ఫండ్ నుంచి మరో ఫండ్‌కు మారే వెసులు బాటు. మీ మొత్తం ప్రీమి యాన్ని మీకు నచ్చిన ఫండ్స్‌లో పెట్టుబడి పెడతారు. ఇది మీడబ్బు వృద్ధి చెందడానికి, కలల పదవీ విరమణకు మార్గం సుగమం చేస్తుంది. ఆన్‌లైన్ కొనుగోలుతో ఫండ్ బూస్టర్లు, లాయల్టీ జోడింపులు ఉంటాయి. ఫార్మసీ కొనుగోళ్లు, రోగనిర్ధారణ పరీక్షలపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను అందించే హెల్త్ ఈ బడ్డీ సర్వీస్, కస్టమర్ ఫార్మసీ కొనుగోళ్లు, రోగనిర్ధారణ పరీక్షలపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను అందించే హెల్త్ బడ్డీ సర్వీస్. కస్టమర్ హెల్త్ సెక్యూర్ రైను పర్సన్ ద్వారా ఓపీడీ సేవలను కూడా ఎంచుకోవచ్చు. 80సీసీసీ కింద పన్ను ఆదా. మెచ్యూరిటీ సమయంలో లంప్సమ్‌పై 60శాతం పన్ను రహితం. ఆపద సమయంలో కుటుంబ అవసరాలను తీర్చడానికి అంతర్నిర్మిత ప్రీమియం మినహాయింపు ఎంపిక. వివిధ అవసరాలకు సరిపోయేలా టాటా ఎఐఎ ప్లాన్లను రూపొందించింది. స్మార్ట్‌పెన్షన్ సెక్యూర్ ప్లాన్‌లో స్మార్ట్ పెన్షన్ సెక్యూర్, స్మార్ట్ పెన్షన్ సెక్యూర్ ప్లస్ అనే రెండు ఎంపికలు ఉన్నాయి. ప్రణాళిక ప్రవేశ వయస్సు 35 నుండి 75 సంవత్సరాలు. వెస్టింగ్ వయస్సు 45 సంవత్సరాల నుండి రూపొందించబడింది.




## వాణిజ్యం


## అకౌంట్ అగ్రిగేషన్‌కు ఫోన్‌పే గుడ్‌బై

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఫిన్ టెక్ ప్లాట్‌ఫామ్ ఫోన్‌పే అకౌంట్ అగ్రిగేషన్ (ఎఎ) వ్యాపారం నుంచి వైదొలిగినట్లు ప్రకటించింది. ఈ సేవలను సరిపడా ఒప్పందాన్ని పొందలేకపోయినట్లు తెలిపింది. ఎన్‌బిఎఫ్‌సి- ఎఎ లైసెన్స్‌ను ఆర్బీఐకి స్వాధీనం నిర్ణయించినట్లు, అకౌంట్ అగ్రిగేషన్ కార్యకలాపాలను మూసివేసే చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. తన యూజర్ల ఆమోదం మేరకు వారి ఆర్థిక బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్‌లతో పంచుకోవడం ద్వారా రుణాలు, క్రెడిట్ కార్డులు తదితర సేవలు అందించేందుకు ఈ లైసెన్స్ కింద అనుమతి ఉంటుంది. 2023జూన్ లో ఫోన్‌పేకుఎన్‌బిఎఫ్‌సి-ఎఎ లైసెన్స్ రావడం విశేషం."రెండేళ్ల లోపే మా ఎఎ ప్లాట్ ఫామ్ 5 కోట్ల మంది భారతీ యులను చేర్చు కోవడం గర్వకారణంగా ఉంది. పోటీ ప్రాధాన్యతల దృష్ట్యా ఎక్కువ మంది ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ప్రొవైడర్లను మా ప్లాట్‌ఫామ్ వైపు ఆకర్షించలేకపోయాం. దీంతో ఫోన్‌పే గ్రూప్ అకౌంట్ అగ్రిగేషన్ వ్యాపారం నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. దీనికి బదులుమార్కెట్లో ఉన్న ఇతర ఎఎలతో జట్టు కడతాం"అనిఫోన్‌పే ప్రకటించింది.




## బులియన్ మార్కెట్ కళకళ

**ముంబై, ఫిబ్రవరి 8:** దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాటపట్టాయి. క్రితం రోజున పెరుగుదలకు బ్రేకిచ్చిన పసిడి ధరలు శనివారం స్వల్పంగా పెరిగాయి. బంగారం ధరలు ద్రవ్యోల్బణం, గ్లోబల్ ధరలలో మార్పు, సెంట్రల్ బ్యాంకు గోల్డ్ రిజర్వ్, హెచ్చుతగ్గుల వడ్డీరేట్లు, నగల మార్కెట్లతో సహా అనేక అంతర్జాతీయ కారకాలపై ఆధారపడి ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.79,450, 24 క్యారెట్ల పసిడి ధర 10గ్రాములకు రూ.86,670 వద్ద ఉన్నాయి. శుక్రవారంతో పోలిస్తే రూ.150, రూ.160 చొప్పున పెరిగాయి. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.86,820, 22 క్యారెట్ల ధర రూ.79,960గా ఉన్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు రూ.79,450గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.86,670గా ఉన్నాయి. దేశవ్యాప్తంగా వెండి ధరల్లో శనివారం ఎలాంటి కదలిక లేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి కేజీ రూ.1,07,000 వద్ద, ఢిల్లీలో రూ.99,500 వద్ద నిలకడగా ఉన్నాయి.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.